ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 17.06.2024 | సంపుటి : 10 సంచిక : 338 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## కృష్ణా జలాల్లో సమానవాటా కోసం
# పోరాడుతాం

**మంత్రి ఉత్తమ్ ● శ్రీశైలం-సాగర్ కాంపోనెంట్‌ను బోర్డుకు అప్పగించేది లేదు**

- సుప్రీంకోర్టు, ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలి
- జలసౌధలో నీటిపారుదల శాఖపై సమీక్షలో మంత్రి స్పష్టీకరణ



హైదరాబాద్(జనంసాక్షి):కృష్ణా జాలాల విషయంలో తీర్పు వచ్చే వరకు 50:50 వాటా వచ్చే వరకు ప్రయత్నించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ క్రమంలో తెలంగాణకు ఈ జలాల వాటాలో చట్టబద్ధమైన వాటా దక్కాల్సిందేనని అన్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలో నీటిపారుదల శాఖపై సమిక్ష నిర్వహించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు చట్టబద్ధమైన వాటా దక్కాల్సిందేనని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ చేశారు. ఆ దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు, అధికారులకు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలని తెలిపారు. నీటిపారుదల శాఖకు సంబంధించి సుప్రీంకోర్టు, ట్రైబ్యునళ్లలో ఉన్న అంశాలపై మంత్రి హైదరాబాద్ జలసౌధలో సమీక్ష నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు వైద్యనాథన్, రవీందర్ రావు, ప్రభుత్వ

మిగతా 2లో..

# త్యాగానికి ప్రతీక బక్రీద్

**ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు**



త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్తల అచంచలమైన భక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు.ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం అస్సలామ్, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఈ పండుగ జరుపుకుంటున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### రాగల ఐదురోజుల్లో
## వానలు
**ఐఎండీ ఎల్లో అలెర్ట్**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ఆదిలాబాద్,

మిగతా 2లో..

# విద్యుత్ ఒప్పందంలో కుంభకోణం జరగలేదు

- కమిషన్‌ది పక్షపాత ధోరణి ● విచారణ పూర్తికాకముందే తీర్పు ఎలా ఇస్తారు?
- కమిషన్ బాధ్యతల నుంచి జస్టిస్ నరసింహారెడ్డి వైదొలుగుతారని ఆశిస్తున్నాం
- విద్యుత్ కొనుగోళ్ల అంశంపై అప్పుడే కాంగ్రెస్, భాజపాలకు అసెంబ్లీలో సమాధామిచ్చాం
- నిస్పక్షపాతంగానే కొనుగోళ్లు చేశాం ● ఎలాంటి విచారణకైనా సిద్ధం: జగదీశ్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి)అసంబద్ధమైన విచారణ కమిషన్ బాధ్యతల నుంచి జస్టిస్ నరసింహారెడ్డి వైదొలుగుతారని తాము భావిస్తున్నట్లు మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ వాదిగా జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిపై సంపూర్ణ గౌరవం ఉందని.. కానీ, ఆయన కమిషన్ చైర్మన్‌గా మారాక అభిప్రాయాలు మారాయని వ్యాఖ్యానించారు. విద్యుత్ కొనుగోళ్ల అంశంపై తాము అధికారంలో ఉన్నప్పుడే కాంగ్రెస్, భాజపా నేతలకు అసెంబ్లీలో సమాధానం ఇచ్చామని, ఈఆర్సీ ముందు కాంగ్రెస్, భాజపా నేతలు తమ వాదనలు వినిపించారని పేర్కొన్నారు. ఏ విచారణకైనా సిద్ధమని సవాల్ చేశామన్న జగదీశ్ రెడ్డి.. కమిషన్ పాత్రపై భారాస అధినేత కేసీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారని అన్నారు. విచారణ చేసే అర్హత కమిషన్ చైర్మన్ కోల్పోయారని కేసీఆర్ లేఖ

మిగతా 2లో..



## కమిషన్‌ను కించపరుస్తారా!

**కమిషన్ ముందుకు రండి నిర్దోషిత్వాన్ని నిరూపించుకోండి :ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి**

హైదరాబాద్ (జనంసాక్షి): విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో విచారణ అధికారి జస్టీస్ నరసింహారెడ్డికి మాజీ సిఎం కేసీఆర్ భయపడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ విచారణకు సహకరించకపోతే అవినీతికి పాల్పడినట్లు అంగీకరించినట్టేనని చెప్పారు. విద్యుత్ కొనుగోళ్లపై వివరణ ఇవ్వాలని కెసిఆర్ కు

మిగతా 2లో..

## శంషాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత
**స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు**

**సీసీఎస్‌లో 12 మంది ఇన్‌స్పెక్టర్లపై**
## బదిలీ వేటు

**భారత్‌తో పనిచేసేందుకు**
## కట్టుబడి ఉన్నాం
**మోదీతో సమావేశం అనంతరం కెనడా ప్రధాని ట్రూడో**

## కోటాలో రాలిన మరో విద్యాకుసుమం
**ఒత్తిడి భరించలేక విద్యార్థి ఆత్మహత్య**
**ఏడాదిలో 11వ ఘటన**

పై వార్తలు 2 పేజీలో

# ఈవీఎం హ్యాకింగ్‌లపై కాంగ్రెస్ అనుమానాలు

**ఓటింగ్ యంత్రాలు బ్లాక్ బాక్సులవంటివే:రాహుల్ గాంధీ**



హైదరాబాద్(జనంసాక్షి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై మరోసారి ఆరోపణలు ఊపందుకున్నాయి. అమెరికాలో ఇఓటీలు హ్యాకింగ్‌కు గురయ్యాయంటూ టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేయగా మన దేశంలో కాంగ్రెస్ నేతలు ఆయనతో గొంతు కలిపారు. ఈ ఆరోపణలను కొట్టిపారేసిన బీజేపీ నేతలు భారత్‌లో ఈవీఎంలను హ్యాకింగ్ చేయడం అసాధ్యమని



స్పష్టం చేశారు. పోలింగ్ సమయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు హ్యాకింగ్‌కు గురవుతున్నాయంటూ టెస్లా, స్పేస్‌ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలు తీవ్రదుమారం రేపుతున్నాయి. అమెరికా నియంత్రణలోని ప్యూర్టోరికోలో ఇటీవల జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఎలాన్ మస్క్ ఈవీఎంలపై ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఇవీఎంలను తొలగిస్తే హ్యాకింగ్‌ను నివారించొచ్చని ఆయన సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తొలగించాలన్న మస్క్, వీటిని వ్యక్తులు లేదా ఏఐ సాయంతో హ్యాక్ చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇది దేశానికి నష్టాన్ని కలిగిస్తుందని మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ సమీప బంధువు రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ జూనియర్ కూడా ప్యూర్టో రికోలో నిర్వహించిన ప్రైమరీ ఎన్నికల్లో ఇఓటీల అవక తవకలు జరిగాయని తెలిపారు. పేపర్ ట్రయిల్ ఉండడం వల్లే సమస్యను గుర్తించగలిగామని, లేదంటే ఏం జరిగేదోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను నివారించడానికి పేపర్ బ్యాలెట్లను తిరిగి తీసుకురావాలని, అలా చేస్తే ప్రతి ఓటు లెక్కించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎలాన్ మస్క్

మిగతా 10లో..

# నీట్‌పై సమగ్ర విచారణ జరపండి

- లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా పట్టించుకోని కేంద్రం
- ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు వెంటనే ఈ వ్యవహారంపై స్పందించాలి
- ఎన్డీఏ ప్రభుత్వానికి కేటీఆర్ బహిరంగ లేఖ ● బాధ్యులను శిక్షించాలని డిమాండ్

హైదరాబాద్(జనంసాక్షి): కష్టపడి చదివే తమ పిల్లలు డాక్టర్ కావాలని కలలు కన్న తల్లిదండ్రుల ఆశలపై గందరగోళంగా మారిన నీట్ పరీక్షా వ్యవహారం నీళ్లు చల్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఓవైపు బీహార్ లో 30 లక్షల చొప్పున నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారని, ఇప్పటికే పదుల సంఖ్యలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలొస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఆది నుంచి నీట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తోందని విమర్శించారు. అత్యంత

మిగతా 2లో..



## నీట్ అవకతవకలు నిజమే అయితే..
**ఎన్టీఏ అధికారులపై కఠిన చర్యలు తప్పవు**
**ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టీకరణ**

వార్త 2లో



## 30లోగా గనులు
# వేలం వేయండి

**తెలంగాణకు కేంద్ర గనుల శాఖ సూచన ● తొమ్మిదేళ్లలో ఒక్క బ్లాక్‌ను కూడా వేలం వేయలేదు**
**గడువులోగా కనీసం ఆరింటికి వేలం పూర్తి చేయాలి ● రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సూచన**

దిల్లీ(జనంసాక్షి):తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం ఒక్క మినరల్ బ్లాక్‌ను కూడా వేలం వేయలేదని కేంద్ర గనుల శాఖ వెల్లడించింది. జూన్ 30 నాటికి కనీసం ఆరింటికి వేలం పూర్తి చేయాలని సూచించింది. ఇప్పటికే రాష్ట్ర సర్కార్‌కు 11 బ్లాకుల జియాలాజికల్ నివేదికలను పంపినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. వీటిలో ఐదు ఇనుప ఖనిజం, ఐదు సున్నపురాయి, ఒకటి మాంగనీస్ బ్లాకు ఉన్నట్లు తెలిపాయి.రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర గనుల శాఖ పలుమార్లు గుర్తు చేసినప్పటికీ.. ఒక్క బ్లాక్‌ను కూడా వేలం వేయలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 30 నాటికి కచ్చితంగా కనీసం ఆరింటికి వేలం పూర్తిచేయాలని సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రిత్వ శాఖ లేఖ రాసింది. ఈ విషయంలో విఫలమైతే.. ఆ ప్రక్రియను కేంద్రమే చేపట్టాల్సి వస్తుందని స్పష్టం చేసింది.మినరల్ బ్లాకుల వేలం ప్రక్రియ

మిగతా 2లో..

# కొలువుల జాతర

**సంక్షేమ శాఖల్లో 581 పోస్టులకు పచ్చజెండా**
**వసతి గృహాల్లో 562 అధికారులు, పిల్లల సంరక్షణ గృహాల్లో 19 మహిళా సూపరింటెండెంట్ పోస్టుల ప్రకటన**
**పరీక్షల షెడ్యూల్ విడుదల ● ఈ నెల 24 నుంచి 29వరకు నిర్వహణ**

హైదరాబాద్(జనంసాక్షి) సార్వత్రిక ఎన్నికల పూర్తి కావడంతో ఉద్యోగ నియామకాల్లో టీజీపీఎస్సీ దూకుడును పెంచింది. ఇటీవల గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి ప్రాథమిక కీని విడుదల చేసిన అధికారులు.. తాజాగా రాష్ట్రంలోని గురుకులాల్లో పలు పోస్టుల భర్తీకి పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళాశిశు సంక్షేమశాఖల పరిధిలోని వసతి గృహాల్లో 562 అధికారులు, పిల్లల సంరక్షణ గృహాల్లో 19 మహిళా సూపరింటెండెంట్ పోస్టులకు 2022 డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే.

మిగతా 2లో..



2లో

## డ్రగ్స్, గంజాయి వల్లే ఘాతుకాలు

**బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వం ● కుటుంబాన్ని ఓదార్చిన మంత్రి సీతక్క**
**ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ● ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష**
**డ్రగ్స్ రహిత తెలంగాణే సీఎం లక్ష్యం ● తక్షణ సహాయంగా రెండున్నర లక్షలు**
**మిల్లు యాజమాన్యం నుంచి మరో రూ. 5 లక్షలు ● ఇందిరమ్మ ఇల్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగం**



## టెర్రరిజంపై ఉక్కుపాదం

**జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్రదాడుల నేపథ్యంలో అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం**

దిల్లీ(జనంసాక్షి): జమ్మూకశ్మీర్‌లో వరుసగా చోటు చేసుకొంటున్న ఉగ్ర ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. టెర్రరిజంపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది.ఈ నేపథ్యంలోనే అక్కడి శాంతిభద్రతల పరిస్థితిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఆదివారం దిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఉగ్రవాదం అణచివేతను వేగవంతం చేయడానికి

మిగతా 10లో..



# ఢిల్లీలో నీళ్లో రామచంద్ర

**కొట్టుమిట్టాడుతున్న దేశ రాజధాని ప్రజలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశానికి రాజధాని. యావత్ భారతదేశ పాలనకు ముఖ్య కేంద్రం. అయినా ఏం లాభం. కనీస అవసరమైన నీటి కోసం అల్లాడాల్సిన పరిస్థితి. గత 15రోజులుగా ఇదే పరిస్థితి. దిల్లీకి మంచినీరు అందించే నీటి వనరుల్లో నిల్వలు తగ్గిపోవడమే దీనికి ప్రధాన కారణం. దీనికి తోడు దిల్లీ సహా ఉత్తర భారతంలోని అనేక ప్రాంతాల్లో ఎండలు తగ్గకపోవడం సమస్యను మరింత పెంచింది. వేసవి ముగిసి 15 రోజులు కావస్తున్నా దిల్లీలో 45నుంచి 47 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వర్షాలు లేక, నల్లానీరు రాక ప్రజలు చుక్కనీటి కోసం సతమతం కావాల్సిన దుస్థితి ఏర్పడింది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా అవి అరకొరగానే ఉంటున్నాయి. వీధిలోకి నీటి ట్యాంకర్ వస్తే దాని చుట్టూ ఎగబడి నీటిని తీసుకుంటున్న దృశ్యాలు దిల్లీలో అనేకం. ఒక్క బకెట్ నీరు దొరికినా చాలు అన్నట్లు ప్రజలు ట్యాంకర్ల చుట్టూ చేరడం అక్కడి దీనస్థితికి అద్దం పడుతోంది.సుప్రీంకోర్టు ఆగ్రహం.. దిల్లీకి నీటిని ప్రధానంగా యమునా నది నుంచి తీసుకుని, శుద్ధి చేసిన తర్వాత సరఫరా చేస్తారు. అయితే యమునలో నీటి మట్టం గణనీయంగా పడిపోయింది. మ్యూనక్ కాలువ కూడా దిల్లీ నీటి అవసరాలను తీరుస్తోంది. వేసవి

మిగతా 2లో..



# ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

**టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో - కన్వీనర్, ఐవీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త**

హైదరాబాద్(జనంసాక్షి):ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో - కన్వీనర్,అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఆదివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ఓల్డ్ మల్కాజ్ గిరి లో నూతన కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. వైశ్యుల ఎన్నో యేండ్ల కల ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీ నిరుపేద వైశ్యులకు అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.నామినేటడ్ పదవుల్లో ఆర్యవైశ్యుల కు అందే విధంగా కృషి చేస్తానని, దేశ వ్యాప్తంగా 17 కోట్ల మంది వైశ్యులను ఏకం చేయడమే అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ లక్ష్యం అని ఆయన అన్నారు. అధ్యక్షుడుగా పాత శ్రీనివాస్ గుప్త కార్యదర్శిగా అలంపల్లి సురేష్ గుప్త, కోశాధికారి బీవీఎస్ గుప్త మహిళ విభాగం అధ్యక్షురాలుగా గీత రాణి, కార్యదర్శి గా ఉమా మహేశ్వరి కోశాధికారిగా శారద గా ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ బీజేపీ నాయకులు ప్రభు గుప్త గారు ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద నాగభూషణం గుప్త, జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ గుప్త, ఐవీఎఫ్ తెలంగాణ కార్యదర్శి పబ్బ చంద్ర శేఖర గుప్త , మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ గుప్త , శ్రీనివాస్ గుప్త సాయి బాబా గుప్త తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో మరోసారి కాల్పులు

**ఇద్దరి మృతి.. మరో ఆరుగురికి తీవ్రంగా గాయాలు**



వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా లో మరోసారి కాల్పుల మోత మోగింది. టెక్సాస్‌లో రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణ కాల్పులకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.స్థానిక కాలమానం ప్రకారం శనివారం రాత్రి రౌండ్ రాక్‌లోని పార్కులో ఓ ఈవెంట్ జరిగింది. స్థానికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఈవెంట్‌కు సమీపంలో రెండు గ్రూప్‌ల మధ్య వివాదం చోటు చేసుకొంది. దీంతో ఓ వర్గం మరో వర్గంపై కాల్పులకు పాల్పడింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ముఖ్య విషయాల్లో భారత్‌తో కలిసి పనిచేస్తాం: కెనడా ప్రధాని ట్రూడో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే నిందితులు పరారయ్యారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

# ఢిల్లీలో నీళ్లో రామచంద్ర

కావడంతో ఈ కాలువలో నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఉన్న కొద్దిపాటి నీటిని కూడా ట్యాంకర్ మాఫియా అక్రమంగా తీసుకుంటోంది. ట్యాంకర్ మాఫియా ఆగడాలపై సుప్రీంకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మాఫియా నీటిని మింగేస్తోందని, దీన్ని అరికట్టేందుకు ఏం చర్యలు తీసుకున్నారని ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.బెంగళూరు, ఢిల్లీ లాంటి ప్రాంతాల్లో నీటి కొరతకు అనేక కారణాలు ఉన్నాయి. నీటికి ప్రధాన ఆధారమైన వర్షాలు కురవకపోవడం అందులో మొదటి కారణం. ఈ కారణంగా జలాశయాల్లో నీరు అడుగంటి ప్రజలకు తగినంత సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి మనుషులు చేసే లెక్కకు మిక్కిలి తప్పులు కూడా దీనికి తోడవుతున్నాయి. అడ్డూఅదుపూ లేకుండా భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడడంతో అవి అడుగంటాయి. ఎన్ని వేల అడుగులు తవ్వినా చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది.కొరవడిన అవగాహన.. పట్టణీకరణ, జనాభా పెరుగుదల మరో కారణం. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ప్రజలు పెద్ద ఎత్తున నగరాలు, పట్టణాలకు వస్తూ ఉండడంతో వారి అవసరాలకు నీరు సరిపోక కొరత ఏర్పడుతోంది. పట్టణాల్లో నిర్మాణాల కోసం చెరువులు, కుంటలు వంటి నీటి వనరులను పూడ్చడంతో వాటి జాడ లేకుండా పోతోంది. ఉన్న కొద్ది పాటి జల వనరులు సైతం కలుషితంగా మారడంతో నగరాలు, పట్టణాల్లో నీటికి కొరత ఏర్పడుతోంది. నీటిని వృధా చేయడం, వర్షపు నీటిని పొదుపు చేయాలన్న విషయాలపై అవగాహన లేకపోవడం వల్ల కొరత ఏర్పడినపుడు అవసరాలు తీరే మార్గం కనిపించడం లేదు. ఐక్యరాజ్యసమితి నీటి అభివృద్ధి నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 26శాతం ప్రజలు సురక్షిత తాగునీటికి దూరంగా ఉన్నారు. నీటి కొరత ఒక ప్రాంతానికి, దేశానికి పరిమితమైన సమస్య కాదు. ప్రపంచవ్యాప్తంగా 4వందల కోట్ల మంది ప్రజలు ఏడాదిలో ఒక రోజు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశాలు ఆర్థికంగానూ నష్టపోతాయని ప్రపంచ నీటి కొరత ముప్పు సంస్థ అట్లాస్ ఇటీవల హెచ్చరించింది. ప్రపంచ జీడీపీలో అది 31శాతం ఉంటుందని తెలిపింది. ఇందులో సగం వాటా భారత్, మెక్సికో, ఈజిప్టు, తుర్కియే నుంచే కోల్పోతుతందని తెలిపింది. ప్రపంచ జనాభాలో 18శాతం వాటా కల్గిన భారత్, నీటి వనరుల విషయంలో మాత్రం 4శాతానికే పరిమితమైంది. భారతదేశంలో సమకూరుతున్న నీటిలో 85శాతం నుంచి 90శాతం వ్యవసాయానికి, మిగతా నీరు పరిశ్రమలు, తాగునీరు, గృహ అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రపంచంలో వ్యవసాయానికి అత్యధిక నీరు వినియోగిస్తున్న దేశం భారతదేశమే.

## కృష్ణా జలాల్లో సమానవాటా కోసం
# పోరాడుతాం

సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, అధికారులు, ఇంజినీర్లతో సమావేశమై సంబంధిత అంశాలపై చర్చించారు. కృష్ణా నది జలవివాదాల రెండో ట్రిబ్యునల్, సుప్రీం కోర్టులో ఉన్న వివిధ అంశాల పరిస్థితి, ముందుకెళ్లాల్సిన మార్గాలను సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వివరించారు. 2015లో ఏపీతో కృష్ణా జలాల విషయంలో కేవలం ఆ ఏడాదికి మాత్రమే అడ్ హక్ పద్ధతిన అంగీకారం కుదిరినట్లు చెప్పారు. ఈ క్రమంలో కృష్ణా జలాల్లో తగిన వాటా కోసం ట్రిబ్యునల్ ముందు ప్రయత్నించాలని మంత్రి ఉత్తమ్ తెలిపారు. తీర్పు వచ్చే వరకు కృష్ణా జలాల్లో 50:50 వాటా కోసం ప్రయత్నించాలని నిర్ణయించారు. అయితే సుప్రీంకోర్టు ముందున్న ట్రిబ్యునల్ అవార్డు అంశాన్ని మహారాష్ట్ర, కర్ణాటకతో చర్చల ద్వారా పరిష్కరించుకోవడం మేలని వైద్యనాథన్ సూచించారు. ఈ ప్రతిపాదనకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆమోదం తెలిపారు. అయితే శ్రీశైలం, సాగర్ కాంపోనెంట్లను కృష్ణా బోర్డుకు అప్పగించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాల్లో వాటా, ప్రజల ప్రయోజనాల కోసం చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తవమ్ పృష్టం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు చట్టబద్ధమైన వాటా దక్కాల్సిందేనని చెప్పారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీంకోర్టు, ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపా రుదల శాఖ అధికారులకు, సీనియర్ న్యాయవాదులకు సూచించారు. కృష్ణా జలాల విషయంలో విభజన జరిగిన తర్వాత నుంచి ఇప్పటివరకు కూడా ఎలాంటి స్పష్టత రాలేదని తెలిపారు.

# డ్రగ్స్, గంజాయి వల్లే ఘాతుకాలు

**పెద్దపల్లి(జనంసాక్షి):**

పెద్దపల్లి జిల్లాలో ఓ రైస్ మిల్లులో అత్యాచారానికి, హత్యకు గురైనా బాలిక కుటుంబాన్ని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఓదార్చారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నేరస్తుడిని గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరలోనే కఠినమైన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటుందని భరోసా కల్పించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా న్యాయం చేస్తామన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు విజయ రమణారావు, రాజ్ సింగ్ ఠాకూర్ లతో కలసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు పురోగతి వివరాలను తెలుసుకున్నారు. డ్రగ్స్, గంజాయి మత్తులోనే ఇలాంటి ఘాతుకాలు జరుగున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు మంత్రి సీతక్క. గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి.. పడుకున్న పాపను ఎత్తుక్ెపోయి రేప్ చేసి చంపడం కలచి వేసిందన్నారు. హైద రాబాద్ లో సింగరేణి కాలనీలో గతంలో చిన్నారిని రేప్ చేసి చంపేసిన ఘటనకూ గంజాయి, మత్తు పదార్దాలే కారణమన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడల్లా పిల్లలను ఏలా కాపాడుకోవాలనే బాధ కలుగుతుందన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పథర్ధాల కారణంగా దుర్మార్గాలు పెరుగుతున్నాయన్నారు. అందుకే తెలంగాణలో డ్రగ్స్, గంజాయి లేకుండా చేసేందుకు తమ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని గుర్తు చేసారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కఠినంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో, నివాస ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు.కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఓదార్చిన మంత్రి సీతక్క. కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. తక్షణ సహాయంగా ప్రభుత్వం తరుపున రెండున్నర లక్షల రూపాయాల చెక్కును అందచేసారు. మిల్లు యాజమాన్యం నుంచి రూ. ఐదు లక్షల పరిహారాన్ని ఇప్పించారు. ఆసిఫాబాద్, పెద్దపల్లి కలెక్టర్లలో మాట్లాడి బాధిత కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించడంతో పాటు, కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరక్కుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.

## 30లోగా గనులు
# వేలం వేయండి

2015లో ప్రారంభమైంది. 2021లో నిబంధనలను సవరించారు. వాటి ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేయాలి. లేదంటే వాటిని నిర్వహించే అధికారం కేంద్రానికి సంక్రమిస్తుంది. కొత్త విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా 354 ప్రధాన మినరల్ బ్లాక్‌లను వేలం వేశారు. 48 చోట్ల ఉత్పత్తి ప్రారంభమైంది. తద్వారా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరిగింది.తెలంగాణలో మేజర్, మైనర్ మినరల్ బ్లాకులను వేలం పద్ధతిలో కేటాయించేందుకు గనులశాఖ సిద్ధమైందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఇటీవల వెల్లడించాయి. ఖనిజాల వారీగా ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపినట్లు తెలిపాయి. ఇందులో మూడు సున్నపురాయి బ్లాకులు కాగా, మరో 12 చిన్నతరహా ఖనిజాలని సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం రాగానే వేలం ప్రక్రియను ప్రారంభించాలని మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేలంలో అర్హత సాధించిన వారికి ఆయా గనుల్ని 20 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నట్లు సమాచారం.

# కోటాలో రాలిన మరో విద్యాకుసుమం

కోటా(జనంసాక్షి): రాజస్థాన్ లోని కోటా లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. ఐఐటీ-జేఈఈకి సిద్ధమవుతున్న ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఏడాది ఇది 11వ మరణం కావడం ఆందోళన కలిగిస్తోంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌లోని మోతీహారీకి చెందిన ఆయుష్ జైస్వాల్(17) గత రెండేళ్లుగా సామ్రాట్ చౌక్ ప్రాంతంలో ఉంటూ..ఐఐటీ-జేఈఈకి సిద్ధమవుతున్నాడు. శనివారం రాత్రి అతడు గది బయటకు రాకపోవడంతో స్నేహితులు అద్దె ఇంటి యజమానికి తెలియజేశారు. ఎన్ని సార్లు పిలిచినా ఆయుష్ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన యజమాని పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని తలుపులు పగలగొట్టి చూడగా గదిలో ఉరివేసుకుని కనిపించాడు. పోలీసులు ఆ విద్యార్థిని వెంటనే న్యూ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. గదిలో ఎటువంటి సూసైడ్ నోట్ లభించలేదు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. అతడి కుటుంబానికి సమాచారం ఇచ్చామని.. వారు వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహిస్తామన్నారు వివిధ పోటీపరీక్షల కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధి చెందిన కోటాలో విద్యార్థులు ఒత్తిడి కారణంగానే బలవన్మరణాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# కమిషన్‌ను కించపరుస్తారా!

జస్టీస్ నరసింహారెడ్డి కమిషన్ నోటీసులు ఇచ్చారు. జూన్ 15లోపు కమిషన్ ముందు హాజరుకావాలని తెలిపింది. నిన్నటితో ఇచ్చిన గడువు ముగుస్తున్న క్రమంలో.. జస్టీస్ నరసింహారెడ్డిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కమిషన్ కు కెసిఆర్ 12 పేజీల లేఖ రాశారు. దీనిపై జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పవర్ కమిషన్ చైర్మన్ నరసింహారెడ్డిని వైదొలగమనడానికి కేసీఆర్ ఎవరని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థను కేసీఆర్ కించపరుస్తున్నారని మండిపడ్డారు. విచారణ ఎదుర్కోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కేసీఆర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ తప్పుడు నిర్ణయాలతో రాష్ట్ర ప్రజలపై రూ.40వేల కోట్ల భారం పడిందని చెప్పారు. బొగ్గు లభ్యత ఉన్న రామగుండంలో కాదని దామరచర్లలో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ను ఎందుకు నిర్మించారని నిలదీశారు. సోలార్ పవర్ తో యూనిట్ రూ.3 విద్యుత్ లభిస్తుందని చెప్పారు. యాదాద్రి పవర్ ప్లాంట్ అసలు అవసరం లేదని జీవన్ రెడ్డి అన్నారు.

## కొలువుల
# జాతర

దీనికి సంబంధించిన పరీక్షలను జూన్ 24 నుంచి 29వరకు నిర్వహించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ప్రతి రోజు రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే ఈ పరీక్షలు ప్రారంభం కావడానికి మూడు రోజుల ముందు నుంచి తమ అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. ఇక పోస్టుల విషయానికి వస్తే.. అత్యధికంగా ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో 298 పోస్టులున్నాయి. బీసీ సంక్షేమశాఖలో గ్రేడ్-2 మొత్తం 140 పోస్టుల్లో ప్రీమెట్రిక్ బాలుర వసతి గృహాల్లో 87, పోస్టుమెట్రిక్ బాలుర వసతి గృహాల్లో 14, ప్రీమెట్రిక్ బాలికల వసతి గృహాల్లో 26, పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహాల్లో 13 ఖాళీలు ఉన్నాయి.

ఖాళీలు ఇలా...

గిరిజన సంక్షేమ వసతిగృహ అధికారులు గ్రేడ్-1 - 5; గ్రేడ్-2 - 106 ఎస్సీ సంక్షేమ వసతి గృహ అధికారులు గ్రేడ్-2 (మహిళ) - 70; గ్రేడ్-2 (పురుషులు) - 228 బీసీ సంక్షేమ వసతి గృహ అధికారులు గ్రేడ్-2 - 140 దివ్యాంగుల సంక్షేమశాఖలో వార్డెన్ గ్రేడ్ -1 - 5; వార్డెన్ గ్రేడ్-2 - 3 దివ్యాంగుల సంక్షేమశాఖలో మాట్రన్ గ్రేడ్-1 - 3; మాట్రన్ గ్రేడ్-2 - 2 చిన్నారుల సంరక్షణ గృహాల్లో లేడీ సూపరింటెండెంట్లు - 19

## రానున్న ఐదురోజులు వానలు..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. అలాగే, ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఈ నెల 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది.

## సీసీఎస్‌లో 12 మంది ఇన్‌స్పెక్టర్లపై బదిలీ వేటు

**ప్రక్షాళనకు దిశగా చర్యలు**

హైదరాబాద్(జనంసాక్షి): సీసీఎస్ ప్రక్షాళన దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. 12 మంది ఇన్‌స్పెక్టర్లపై బదిలీ వేటు వేశారు. వీరిని మల్టీజోన్ 2కు బదిలీ చేశారు.హైదరాబాద్ సీసీఎస్‌లో ఇటీవల ఏసీపీ ఉమామహేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో వీరిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈక్రమంలో సీసీఎస్‌పై వరుస ఆరోపణలతో తాజాగా 12 మందిని బదిలీ చేశారు.

## శంషాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

**హైదరాబాద్(జనంసాక్షి):** ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు తరిలించిన గంజాయి చాక్లెట్ ప్యాకెట్లను శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ ప్రాంతాల్లో ప్రతి శనివారం జరిగే పార్టీలపై ఎక్సైజ్ పోలీసులతో డీటిఎఫ్ ఫోర్స్ సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ సోదాల్లో భాగంగా రూ.7 లక్షల విలువైన 1.65 కేజీల గంజాయి చాక్లెట్ల ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.శంషాబాద్?లో జరుగుతున్న పలు చోట్ల అధికారులు తనిఖీలు చేశారు. ఇదే క్రమంలో ద్విచక్ర వాహనంపై బియాస్ గుప్తా అక్రమంగా గంజాయి చాక్లెట్ తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. తనిఖీల్లో భాగంగా పట్టుబడిన వ్యక్తితో పాటు గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'నీట్' పై సమగ్ర విచారణ జరపండి

ప్రతిష్టాత్మకమైన నీట్ ఎగ్జామ్ పై ఇన్ని ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ మోడీ సర్కార్ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు... ప్రతీసారి విద్యార్థులతో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని.. కీలకమైన నీట్ పరీక్షపై మాత్రం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు, లక్షలాదిమంది తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నీట్ ఎగ్జామ్ లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావటం ఎన్నోరకాల అనుమానాలకు తావిస్తోందని ధ్వజమెత్తారు. అందులో కూడా ఒకే సెంటర్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఏకంగా 720 మార్కులు సాధించడం చూస్తే.. పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయని, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తుచేశారు. అలాంటిది.. ఇంత ఒకే సెంటర్ లో ఇంతమంది విద్యార్థులకు పెద్దమొత్తంలో మార్కులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అలాగే ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించటం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు.. అసలు ఈ వ్యవహారం బయటకు రాగానే పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించాల్సిన కేంద్రం ప్రభుత్వం ఎందుకు ఈ అంశాన్ని ఇప్పటిదాకా పట్టించుకోలేదని నిలదీశారు. పైగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అంతా సవ్యంగానే జరిగిందంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేయటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. లక్షల మంది విద్యార్థులు ఎన్ని ఫిర్యాదులు చేసిన కేంద్రం స్పందించలేదని, పలువురు ప్రముఖులు సుప్రీంకోర్టులో కేసు వేసినా ఒక్క వివరణ కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకు కూడా కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చాలా చిత్రమైన సమాధానాలు చెప్పిందన్నారు. ఈ ఏడాది 1563 మందికి గ్రేస్ మార్కులు కలిపినట్లు చెబుతోందని, అసలు నీట్ లాంటి ఎగ్జామ్ లకు గ్రేస్ మార్కులు కలిపే విధానమే లేదని, అయినప్పటికీ ఎందుకిలా చేశారో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 1563 మంది విద్యార్థులకే ఎందుకు గ్రేస్ మార్కులు ఇచ్చారో.... దానికి ఏ ప్రాతిపదికను తీసుకున్నారో స్పష్టం చేయటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. +4, -1 విధానం ఉండే ఈ ఎగ్జామ్ లో సాధ్యం కాని విధంగా కొంతమంది విద్యార్థులకు 718, 719 మార్కులు రావటం కూడా మొత్తం గ్రేస్ మార్కుల విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ మొత్తం అంశం వివాదం కావటంతో ఇప్పుడు ఎన్టీఏ 1563 మందికి విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చామని వాటిని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిందన్నారు. గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థులకు వాటిని తొలగించి మళ్లీ ఎగ్జామ్ రాయిస్తామని లేదంటే గ్రేస్ మార్కులు లేకుండా ఉన్న ర్యాకింగ్ నే జత చేస్తామని పూటకో మాట మాట్లాడుతోందని మండిపడ్డారు.. విద్యార్థుల భవిష్యత్ ను ప్రమాదంలోకి నెట్టి ఇప్పుడు వాస్తవాలు బయటకు రాకుండా నానాతంటాలు పడుతున్నారని మండిపడ్డారు. ఒక్క గ్రేస్ మార్కుల అంశమే కాకుండా నీట్ పేపరే లీకైందంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. దీనికి బలం చేకూరే విధంగా గుజరాత్, బీహార్ లో పోలీసులు నీట్ లో అవకతవకలు పాల్పడిన కొంతమందిని అరెస్ట్ చేశారని, వరుసగా బయటపడుతున్న వివాదస్పద వ్యవహారాల కారణంగా నీట్ ఎగ్జామ్ తీరుపై విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా అనుమానాలు బలపడుతున్నా యన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా నీట్ ఎగ్జామ్ ను పెద్దసంఖ్యలో విద్యార్థులు రాశారని, నీట్ లో జరిగిన గ్రేస్ మార్కులు, పేపర్ లీకేజీ ఆరోపణల కారణంగా తెలంగాణ విద్యార్థులు కూడా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు మన రాష్ట్ర ఎంపీలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించే విధంగా రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలు ఎన్డీఏ సర్కారుపై ఒత్తిడి తేవాలని కోరారు. ఇంత జరుగుతున్నా ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాల్సిన అవసరముంది. లక్షలాది విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించిన ఈ అంశంలో వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, వెంటనే ప్రధాని దీనిపై స్పందించి మొత్తం అవకతవకలకు బాధ్యులెవరన్నది ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.. నీట్ లో జరిగిన అవకతవకల కారణంగా నష్టపోయిన విద్యార్థులకు ఇబ్బంది లేకుండా, వారికి న్యాయం చేసే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

## భారత్‌తో పనిచేసేందుకు కట్టుబడి ఉన్నాం

**(జనంసాక్షి):**భారత్-కెనడా సంబంధాలు తీవ్ర ఒత్తిడిలో ఉన్న సమయంలో ఇరు దేశాధినేతలు జీ7 సమావేశాల సందర్భంగా కలుసుకొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమైన అంశాలపై భారత్‌తో కలిసి పనిచేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో వెల్లడించారు. మన ప్రధాని మోదీ తో భేటీ అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇరు దేశాలు కలిసి పనిచేయాల్సిన సున్నితమైన అంశాల వివరాల జోలికి నేను వెళ్లడం లేదు. కానీ, కలిసి పని చేయడానికి కట్టుబడి ఉన్నాం. భవిష్యత్తులో చాలా ముఖ్యమైన పనులను మేం డీల్ చేస్తాం" అని ట్రూడో జీ7 చివరి రోజు మీడియా సమావేశంలో వెల్లడించారు.శుక్రవారం ప్రధాని మోదీ తాను ట్రూడోతో కరచాలనం చేస్తున్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. "కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోను జీ7 సదస్సులో కలిశాను" అంటూ దానికి క్యాప్షన్ జత చేశారు. మరోవైపు కెనడా ప్రధాని కార్యాలయం కూడా దీనిపై స్పందించింది. ఇరు దేశాధినేతలు ద్వైపాక్షిక అంశాలపై సంక్షిప్తంగా చర్చించారని పేర్కొంది. మోదీ తిరిగి ప్రధానిగా ఎన్నిక కావటంతో ట్రూడో శుభాకాంక్షలు తెలిపారని వెల్లడించింది.జీ20 సదస్సు తర్వాత కెనడా ప్రధాని భారత్‌పై నేరుగా ఆరోపణలు చేయడంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. గతేడాది జులై 18న బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య జరిగింది. దీని వెనక భారత్ ఏజెంట్ల పాత్ర ఉందంటూ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. తగిన ఆధారాలు ఇవ్వాలని.. ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. ఈ కేసులో తాజాగా ఎడ్మంటన్ ప్రాంతంలో నివాసముంటున్న కరణ్‌ప్రీత్ సింగ్ (28), కమల్‌ప్రీత్ సింగ్ (22), కరణ్ బ్రార్ (22)లను కెనడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# నీట్ అవకతవకలు నిజమే అయితే..

**ఢిల్లీ(జనంసాక్షి):**

నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులైన ఎన్‌టీఏ అధికారులను ఉపేక్షించేది లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. నీట్ పరీక్షల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా, బాధ్యతా యుతంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్, పరీక్షల నిర్వహణలో అధికారులు ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరిం చారు. సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా 1563 మంది అభ్యర్థులకు తిరిగి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.రెండు చోట్ల అక్రమాలు జరిగాయని గుర్తించామని, ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు. ఎన్‌టీఏ ఉన్నతాధికారులు ఎవరైనా దోషులుగా తేలితే వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోకతప్పదని తేల్చిచెప్పారు.ఎన్‌టీఏలో ప్రక్షాళన అవసరమని, ఈ దిశగా చర్యలు చేపడతామని, తప్పులు చేసినవారు చర్యల నుంచి తప్పించుకోలేని విధంగా కార్యాచరణకు దిగుతామని వెల్లడించారు. నీట్ యూజీ 2024లో గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థుల ముందు రెండు మార్గాలున్నాయని, ఈనెల 23న మళ్లీ పరీక్ష రాసి జూన్ 30 నాటికి నూతన స్కోర్ పొందడం లేదా గ్రేస్ మార్కులు లేకుండా గతంలో సాధించిన స్కోర్‌ను ఆమోదించాలని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రం లీకేజ్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

# విద్యుత్ ఒప్పందంలో కుంభకోణం జరగలేదు

రాసినట్లు తెలిపారు."ఇచ్చిన గడువు ప్రకారం మేం సమాధానం ఇద్దామని అనుకున్నాం. కానీ.. కాంగ్రెస్, భాజపా నేతల అభిప్రాయాలను జస్టిస్ నరసింహారెడ్డి మీడియా సమావేశంలో చెప్పారు. విచారణ పూర్తి కాకముందే తీర్పు ఎలా చెప్తారు? ఉమ్మడి రాష్ట్రంలో అనేక కమిషన్లు రద్దు అయ్యాయి. ఈఆర్సీ స్వతంత్ర కమిషన్.. అది ఇచ్చిన తీర్పు ఫైనల్ అవుతుంది కానీ, కమిషన్ ఇచ్చిన తీర్పు ఫైనల్ కాదు. 15వ తేదీ వరకు కేసీఆర్‌కు సమయం ఇచ్చి 11వ తేదీన జస్టిస్ నరసింహారెడ్డి మీడియా సమావేశం ఎలా ఏర్పాటు చేశారు?తెలంగాణ సమాజానికి నిజాలు చెప్పడానికి కేసీఆర్ లేఖ రాశారు.ఛత్తీస్‌గఢ్‌లో విద్యుత్ ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్స్ నిర్మాణం అన్ని ప్రభుత్వ రంగ సంస్థలతోనే ఒప్పందం చేసుకున్నాం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వంతో బహిరంగంగా విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నాం. కమిషన్ ఏర్పాటు కుట్రపూరితంగా జరిగింది. కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థతో మేం ఒప్పందం చేసుకున్నాం.కమిషన్ ఏర్పాటు కుట్రపూరితంగా జరిగింది. కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థతో మేం ఒప్పందం చేసుకున్నాం. ఏమైనా అవినీతి జరిగితే కేంద్రమే నిజానిజాలు బయటపెట్టాలి. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ఎక్కువ రేటుకు విద్యుత్ కొన్నాయి. తెలంగాణ మాత్రం రూ.3.90లకు విద్యుత్ కొనుగోలు చేసింది. కేసీఆర్ వివరణ తీసుకున్నాక ఛత్తీస్‌గఢ్ వాళ్లను పిలిస్తే బాగుండేది. దేశంలో ఏ కమిషన్ మధ్యలో లీకులు ఇవ్వలేదు. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాం. రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెం, విజయవాడ, ఆర్టీపీసీలో సబ్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారానే విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. పారదర్శకతతోనే ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్‌ఈఎల్‌కు భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలను అప్పగించాం"అని జగదీశ్ రెడ్డి వివరించారు.

# డయాలసిస్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం

- ఆసుపత్రి ఆవరణలో రోగులు, వైద్య సిబ్బంది తదితరులు
- భయాందోళనతో పరుగులు తీసిన వైద్యసిబ్బంది, రోగులు
- చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో ఘటన.. షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం
- మంటలను ఆర్పివేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది
- తప్పిన పెను ప్రమాదం.. ఊపిరి పీల్చుకున్న వైద్యసిబ్బంది





**చేవెళ్ల, జూన్ 15 (జనంసాక్షి) :** చేవెళ్ల ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో శనివారం రాత్రి 8 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. దాంతో డయాలసిస్ సెంటర్‌లో ఒక్కసారిగా పొగతో కూడిన మంటలు చేలరేగాయి. గదిలో నుంచి పొగతోపాటు మంటలు బయటకు చిమ్మటంతో వైద్యసిబ్బంది భయభ్రాంత్రులకు గురయ్యారు. వెంటనే ఆసుప్రతిలో ఉన్న రోగులను హుటాహుటిన బయటకు పంపించారు. వైద్యసిబ్బంది సైతం బయటకు పరుగులు తీశారు. అయితే, ఆ సమయంలో డయాలసిస్ సెంటర్ గదికి తాళం వేసి ఉంది. మంటలు, పొగ వెంటిలేటర్, కిటికీల ద్వారా బయటకు వ్యాపించాయి. పోలీసలకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వెంటనే వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే డయాలసిస్ గదిలో ఉన్న ఫైళ్లు, వైద్యపరికరాలు కాలిపోయాయి. విద్యుత్ సిబ్బంది ఆసుప్రతికి చేరుకుని కరెంటు సరఫరా నిలిపివేశారు. చేవెళ్ల ఎస్సై ప్రదీపకుమార్ ఆసుప్రతికి చేరుకుని షార్ట్‌సర్క్యూట్‌కు గల కారణాలు, వివరాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వద్ద పరిస్థితిని సమీక్షించారు. కాగా, ప్రమాద సమయంలో ఆసుప్రతిలో కాన్పుకోసం వచ్చిన గర్భిణీలు, బాలింతలు, కొందరు ఇతర రోగులు ఉన్నారు. ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు బయటనే ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. పాడైన విద్యుత్ వైర్‌తో పాటు వైరు కూడా సక్రమంగా లేకపోవడమే షార్ట్‌సర్క్యూట్‌కు కారణమై ఉంటుందని పోలీసలు, విద్యుత్ సిబ్బంది భావిస్తున్నారు. ఈ సంఘటన రాత్రి 8గంటల జరిగిందని, అర్ధరాత్రి జరిగి ఉంటే పెనుప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. డయాలసిస్ సెంటర్‌లో రాత్రివేళల్లో పరీక్షల నిర్వహణ జరగదని, పగటి పూట ప్రమాదం జరిగి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని వైద్యులు, సిబ్బంది పేర్కొన్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఆసుప్రతి సిబ్బంది, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



# సంక్షోభంలో ప్రభుత్వం విద్యారంగం

- ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను



**హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి) :** సంక్షోభంలో ప్రభుత్వ విద్యారంగం ఉందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వీపీ సాను అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు బాగ్ లింగంపల్లి స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి వీరభద్రం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ్య సమావేశాలకు అధ్యక్షత వహించారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను హాజరయ్యారు. ప్లీనరీ ప్రారంభ సూచికగా స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలు గల జెండాను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ఆవిష్కరించారు. గత కాలంలో ఉద్యమాన్ని సమీక్షించుకుంటూ, రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు భవిష్యత్ కర్తవ్యాలపై పలు తీర్మానాలు చేసారు. అనంతరం విపి సాను భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రారంభ సభలో మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో ఉందనీ, కేంద్రంలో బిజెపి విధానాలతో విద్యారంగం నాశనమవుతోందని అన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఏ సంస్థ నిర్వహించే నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాసారనీ, బిజెపి పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ లు, నిర్వహణ వైఫల్యాలు బహిర్గతమయ్యాయనీ, పరీక్ష పేపర్ ను లక్షల రూపాయలకు కొందరు అమ్మినట్లు ఆరోపణలు వచ్చాయనీ, విద్య కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోని అంశం అనీ, కేంద్రం పూర్తిగా రాష్ట్రాల హక్కులను లాగేసుకుని విద్యపై పూర్తి నియంత్రణ చేస్తుందనీ,ఇది పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఎన్టీఏ ను రద్దు చేయాలని, నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలనీ, ఈ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైందనీ, కానీ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేరనీ, సమస్యలన్నీ పేరుకుపోయాయనీ, పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభమయ్యాయనీ, నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందించడంలో గందరగోళం నెలకొందనీ, పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే అందిస్తామని చెప్పినప్పటికీ, పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ ఇండెంట్ తీసుకోవడంలో లెక్క తప్పింది న్నారు, ఫలితంగా మండలాల్లో పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్స్ అందలేదనీ, మరోపక్క యూనిఫామ్ కుట్టించేందుకు ప్రభుత్వం తక్కువ ధర చెల్లించడంతో పూర్తిస్థాయిలో యూనిఫామ్ అందుబాటులోకి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంకా యూనిఫాం పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదన్నారు. ఈ ప్లీనరీలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం.మమత, డి.కిరణ్, బి.వీరభద్రం, కె.అశోక్ రెడ్డి, డి.ప్రశాంత్, శ్రీకాంత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రజనీకాంత్ ,బి.శంకర్, సంతోష్ రాథోడ్, కె.ప్రశాంత్ మరియు రాష్ట్రంలో అన్ని జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు,హైదరాబాద్ నాయకత్వం పాల్గొన్నారు.

# కామాంధుని కఠినంగా శిక్షించాలి

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
- రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సునీతా రావు

**హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి) :** పెద్దపెల్లి జిల్లాలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఒక రైస్ మిల్లులో పనిచేసే బీహార్ కి చెందిన వినోద్ (28) తల్లితండ్రి మధ్యలో పడుకున్న 6 సంవత్సరాల చిన్నారిని రాత్రి 11 గంటలకు ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి చంపేసిన సంఘటన చాలా దురదృష్టకరమని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, జిల్లా ప్రెసిడెంట్స్ స్టేట్ ఆఫీస్ బేరర్స్ అన్నారు. తల్లిదండ్రులు పక్కనే ఉన్న ఆ బాలికను కాపాడుకోలేకపోవడం చాలా బాధాకరం అదేవిధంగా రాత్రిపూట నిరంతరం పోలీసుల పర్యవేక్షణ కూడా ఉండాలి, మద్యం,డ్రగ్స్ మత్తులో పడి ఇలాంటి అఘాయిత్యాలు చేస్తున్నారన్నారు. తొందరగా అతనికి శిక్ష పడాలి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఆ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుందని మహిళా కాంగ్రెస్ తరపున వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తు న్నామన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధ్యత కుటుంబానికి సత్వర న్యాయం జరిగే విధంగా చూడాలని సునీత రావు అన్నారు.

# నీట్ పరీక్షలో అక్రమాలు

- గుజరాత్‌లో పేపర్లు అమ్ముకున్నారు
- ప్రధాని ఈ విషయంలో మౌనమేలా?
- బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్



**హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి) :** దేశ వ్యాప్తంగా నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయని బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కచ్చితంగా జరిగిందన్నారు. గుజరాత్ లో పేపర్లు అమ్ముకున్నారన్నారు. ప్రధానమంత్రి నీట్ పరీక్ష లీకేజీలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నీట్ వలన తెలంగాణ విద్యార్థులు నష్టపోయారన్నారు. నీట్ రద్దుపై సీఎం రేవంత్ రెడ్డి తన వైఖరి స్పష్టం చేయాలన్నారు. నీట్ అక్రమాలపై రేవంత్ రెడ్డి కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదు ? అని ప్రశ్నించారు. తెలంగాణ నుండి గెలిచిన ఎంపీలు నీట్ విద్యార్థుల కోసం ఎందుకు మాట్లాడటం లేదన్నారు. నీట్ వలన తెలంగాణ విద్యార్థులకు ర్యాంకులు రావడం లేదన్నారు. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎక్కడ వున్నారని ప్రశ్నించారు. నీట్‌పై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నీట్‌ను రద్దు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. నీట్‌ను రద్దు చేయకపోతే బిఆర్ఎస్వీ తరపున కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రేస్ మార్కుల సిస్టంను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మధ్యప్రదేశ్‌లో వ్యాపం కుంభకోణం జరిగినట్లు నీట్ కుంభకోణం జరిగిందన్నారు. రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై ఆరోపణలతో కాలం వెల్లదీస్తున్నారని, విద్యా శాఖను తన వద్ద పెట్టుకుని సీఎం ఇప్పటి వరకు సమీక్ష చేయలేదని ప్రశ్నించారు. ఫీజు రీ ఎంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం అమలుపై ఆరోపణల్లో నిజం లేదు

- నిరాధారమైన ఆరోపణలను ఖండించిన టీజీఎస్ఆర్టీసీ

**హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ)లో ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం (ఏఎఫ్‌సీఎస్) అమలు విషయంలో చేస్తోన్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకు బోర్డు అనుమతితోనే ఈ వ్యవస్థను సంస్థ అమలు చేయడం జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారించిందని చేస్తోన్న నిరాధారమైన ఆరోపణలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఖండిస్తోంది. నియమ నిబంధనలకు లోబడి బోర్డు అనుమతితోనే సంస్థలో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేస్తోంది.

# బక్రీద్ శుభాకాంక్షలు : మంత్రి కొండా సురేఖ



**వరంగల్ ఈస్ట్, జూన్ 16 (జనం సాక్షి) :** బక్రీద్ పండుగను ( జూన్ 17) పురస్కరించుకొని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, త్యాగం, సహనం, దాతృత్వం అనే సుగుణాలకు బక్రీద్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అల్లా పై విశ్వాసంతో జీవిస్తే అంతా మంచే జరుగుతుందనడానికి తండ్రీకొడుకులైన హజరత్ ఇబ్రహీం, ఇస్మాయిల్ ల జీవిత చరిత్ర సాక్ష్యంగా నిలుస్తుందని వెల్లడించారు. ఉన్న దాంట్లో ఇతరులకు పంచి పెట్టమని బక్రీద్ పండుగ అందించే స్ఫూర్తి గొప్పదని మంత్రి అన్నారు. భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ముస్లింలకు పిలుపునిచ్చారు. అల్లా దయ ఈ రాష్ట్ర ప్రజల పై ఉండాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు.

# మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన సోషల్ మీడియా నాయకుడు వడ్లకొండ వినయ్



**పాలకుర్తి జూన్ 16 (జనంసాక్షి) :** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లి ఫాంహౌస్ లో భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు,తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ను ఆదివారం పాలకుర్తి నియోజకవర్గ బిఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జీ వడ్లకోండ వినయ్ మర్యాదపూర్వకంగా కలిసి మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కెసిఆర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా ఎంతగానో దోహదపడుతుందని అన్నారు, పార్టీ ప్రతిష్ట కోసం సోషల్ మీడియా సైనికులు అహర్నిశలు పాటుపడాలని వెల్లడించారు, పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన సోషల్ మీడియా నాయకులకు రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు.

# యువత చేతిలో దేశ భవిత

- బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్



**బెల్లంపల్లి, జూన్ 16 (జనంసాక్షి) :** యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లి మండలం తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశిరెడ్డి పల్లిలో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు కేంద్ర బిందువు యువత అని, యువత తలుచుకుంటే ఎన్నో విజయాలను సునాయాసంగా అందుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, అంతటి శక్తి యువతకి ఉంది అన్నారు. క్రీడలు ఆడడంతో శరీరానికి వ్యాయామం అవుతుందని, విద్యార్థులు, యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉదయం వ్యాయామం చేసి, ఆరోగ్యం కాపాడుకోవాలని అన్నారు. యువకులు, గంజాయి, జూదం వంటి చెడు అలవాట్లకు, ఇతర చెడు మార్గాల వైపు వెళ్లకుండా చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కోరారు. మీ గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అసాంఘిక శక్తుల గురించి ఎటువంటి సమాచారమైనా పోలీసులకు అందించాలని ఈ సందర్భంగా సిఐ యువకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్ళగురిజాల సీఐ నరేష్, పోలీస్ సిబ్బంది, యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పాలమూర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు షాద్ నగర్‌లో సంతకాలు

- మహబూబ్ నగర్ గత అర్బన్ తాహశీల్దార్ డబుల్ బాగోతం
- గతంలో ఆర్ఐతో కలిసి సాగించిన అక్రమాలు వెలుగులోకి
- స్థానం మారినా షాద్ నగర్ నుంచి పట్టాలపై ప్రస్తుత సంతకాలు.
- హాట్ బాక్స్, లో కాల్చిన మటన్ తో పాటు నగదు ముట్టజెప్పిన వైనం..
- కొనసాగుతున్న విచారణ..వేటు పడే అవకాశం



**షాద్‌నగర్, జూన్ 16 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ నియోజకవర్గ పరిధిలో డబుల్ బెడ్ రూంల పంపిణీ వ్యవహారంలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి మహబూబ్నగర్ అర్బన్ తాహాసిల్దార్ గతంలో పనిచేసిన ఓ అధికారి తమ కార్యాలయ సిబ్బంది ఆర్ఐ లతో కలిసి తమ వద్ద డబ్బుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం రూపాయల లక్షలు తీసుకున్నారనీ బాధితులు సీఎం కార్యాలయంతో పాటుగా జిల్లా కలెక్టర్ కు కలిసి ఫిర్యాదు చేశారు వెంకటేశ్వర సరిత అనే మహిళతో పాటుగా పలువురు బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు ఒక్కో డబుల్ బెడ్ రూమ్ రూపాయిలు మూడు లక్షల చొప్పున 10 ఇండ్లకు డబ్బులు అప్ప చెప్పినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. మరో నాలుగు ఇండ్ల కోసం రూపాయలు 15 లక్షల వరకు ఇచ్చి మోసపోయినట్టు బాధితులు ఉన్నత్తధికారుల చుట్టూ తిరుగుతూ మొరపెట్టుకున్నారు మహబూబ్ నగర్ అర్బన్ కార్యాలయం నుంచి సదర్ తాహశీల్దార్ బదిలీ అయ్యి షాద్ నగర్ కు వచ్చినప్పటికీ కాలి ఇండ్లకు పాత తేదీలతో తన సంతకాలు చేస్తూ మిగిలిన డబ్బులు బెడ్ రూమ్స్ అమ్ముకుంటున్నారనే వార్తలు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో వినిపిస్తున్నాయి ఈ వార్తలకు కూడా ఊతమిచ్చేలా జిల్లా కేంద్రంలో ఓ మహిళకు సంబంధించి మొదటగా మౌలాలి గుట్టలో ఏ 14 -299 నెంబర్ తో ఇంటిని కేటాయించడంతో ఏదైనా నచ్చలేదని తిరస్కరించారు మరో నెంబర్ తో కూడిన ఇంటిని దీవిటీపల్లి లో ఈ నెంబరు 21- 553 కేటాయించారు అది కూడా నచ్చకపోవడంతో ప్రస్తుతం జె 21-553 ఇంటిని కేటాయించి కొత్త పట్టా ఇచ్చారు ఇలా ఇష్టరీతిలో వ్యవహరిస్తూ వివరిస్తూ ఒకే ఒక్కరికే మూడు నెంబర్లతో పట్టాలను ఇచ్చిన ఫోటోలు ప్రస్తుతం వెలుగులోకి వచ్చాయి ఒక్కొక్కరికి రెండు మూడు పట్టాలను మారుస్తూ కాసులు దండుకున్నట్లు అనుమానాలు ఆరోపణలు పుట్టుకొస్తున్నాయి..

**హాట్ బాక్స్ లో ముడుపులు..**

డబుల్ బెడ్ రూమ్ అక్రమ వ్యవహారానికి సంబంధించిన డబ్బు అన్నీ కూడా హాట్ బాక్స్ లోనే ఇచ్చారని బాధితులు షాద్ నగర్ వచ్చినప్పుడు మొరపెట్టుకున్నారు హాట్ బాక్స్ కవర్ లో మందు కాల్చిన మటన్ బిర్యానీ వంటి పదార్థాలతో పాటుగా ముందే మాట్లాడుకున్న డబ్బు అంతా కూడా నీటుగా కవర్ లో ప్యాక్ చేసి కార్యాలయ సిబ్బంది తీసుకునేవారని వెంకటేష్ అనే బాధితుడు ఆరోపిస్తున్నాడు తానే 14 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి రూపాయలు 30 లక్షల వరకు ముట్టజెప్పినట్టు తన ఫిర్యాదులో ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లారు తాను ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయానికి బాధితులు వెళ్లి మరి వాదనలకు దిగాడు ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది..

**సీఎం వద్దకు చేరిన పంచాయతీ..**

డబుల్ బెడ్ రూమ్స్ అక్రమ వ్యవహారంపై మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ తో పాటుగా పలువుకి బాధితులు పిర్యాదు చేశారు విచారణ పేరుతో తాత్సర్యం చేస్తుండడంతో బాధితులు నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పిర్యాదు చేశారు దీంతో మహబూబ్ నగర్ అర్బన్ కార్యాలయ సిబ్బంది చేతివాటంపై దృష్టి సారించిన సీఎం క్యాంప్ ఆఫీస్ లో రహస్యంగా విచారణ కొనసాగిస్తున్నారని వీరిపై వేటుపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది..

# కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో శిక్షణకు ఆన్లైన్లో దరఖాస్తుల ఆహ్వానం

కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో మెరుగైన ఉద్యోగాలకోసం, అత్యధిక ఉద్యోగావకాశాలుగల లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణకై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్లైన్లో దరఖాస్తులు కోరబడుచున్నవి. ఇంటర్ పాస్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఈ క్రింది కోర్సుల్లో చేరేందుకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో రాణించేందుకు ప్రతి ఒక్క విద్యార్థి నేర్చుకోవాల్సిన 50 కి పైగా లేటెస్ట్ ఇంటర్నేషనల్ సాఫ్ట్వేర్ కోర్సులు: ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లార్నింగ్ , బిజినెస్అనలిటిక్స్ , దేవోప్స్ , ఫుల్ స్టాక్ డెవలప్మెంట్, పైథాన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, ప్రాజెక్ట్ మేనేజిమెంట్, బ్లాక్ చైన్, డీప్ లెర్నింగ్, సాస్, సెలీనియం, సేల్స్ ఫోర్స్, సాఫ్ట్వేర్ డెవలప్మెంట్, జావా, ఒరాకిల్ లాంటి 50 కి పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ సర్టిఫికేషన్ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుంది,కోర్సు ఫీజులో 80 %రాయితీ, శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆమోదిత సర్టిఫికెట్ ప్రదానం చేయడం జరుగుతుంది. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు గలవు

ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్ : **www.nationalskillacademy.in**

ఇతర వివరాలకు సుమప్రదించాల్సిన ఫోన్ నెంబర్: 9505800050

**శ్రీమాన్ రెడ్డి (ప్రోగ్రాం కోఆర్డినేటర్)**
**నేషనల్ స్కిల్ అకాడమీ, శ్రీ నిలయం,**
**ల్యాంకో రోడ్, మణికొండ, హైదరాబాద్**
**9505800050**


# పెట్టె గుట్టు!!

ఆ ఓట్ల పెట్టె తెరిచి చూస్తే..!
పోయిన మన ఆత్మాభిమానాలు దొరకొచ్చు
ఆనాటి ప్రమాణ స్వీకారాల తర్వాత సిగ్గుతో
చచ్చిన అక్షరాల అవశేషాలు కనబడొచ్చు
అభాగ్యుల వెలిసిపోయిన అర్జీల కన్నీళ్ల
తడి తగలవచ్చు
నాటి ఫలితాలకు ఉప్పొంగిన ఛాతీలు
సొంతదారుల్నే తలలు దించుకొనేలా దొర్లి
పడొచ్చుజి
ఉచితాలకు తాకట్టు పెట్టిన ప్రజాస్వామ్యం
తలకాయ బయటపడి ఊపిరి తీసుకోవచ్చు
బూజు పట్టిన ఆశలు నిల్వ వాసన కొడుతున్న
ఆశయాలు వెలుపలికొచ్చి అందర్నీ విస్మయ
పర్చవచ్చుజి
చచ్చి సమాధి ఐన వాగ్దానాల పుర్రెలు
బయటపడి భయపెట్టొచ్చు
నాటి చప్పట్లు ఈలలు కొనఊపిరితో కొట్టు
మిట్టడుతూ జారి పడొచ్చు
వంచనాశిల్పంగా రంగు మారిన ప్రజల
నమ్మకశిల్పం త్రవ్వకాల్లో బయట పడ్డట్టు
విరిగి ముక్కలై పెట్టెలోంచి రావచ్చు
అయినా ప్రతీ పెట్టే ఒకటే కాకపోవచ్చు!
ప్రతీ రంగు వెలిసిపోక పోవచ్చు
ప్రతీ ఫలితం వెన్నులో గుచ్చిన పదును
ఖడ్గంతో కుక్కచావు చావక పోవచ్చు
ప్రతీ నమ్మకం వమ్మకం కాక పోవచ్చు
ప్రతీసారీ అబద్దమే అందలమెక్కి వెక్కిరించక
పోవచ్చు..
ప్రతీది గారడీయే కాకపోవచ్చు
ఏమో ఈ సారి గుర్రం ఎగరావచ్చు!?
పెట్టె బుట్టెడు ఫలాలతో పుట్టెడు నిజాలతో
నిండి ఉండొచ్చు..!!

**భీమవరపు పురుషోత్తమ్**
**ఎస్బీఐ ఇన్నీస్పేట్ బ్రాంచ్**
**రాజమండ్రి**
**9949800253**

# గుండె గాయాన్ని ప్రేమతో కడుగు!

***డబ్బు, డబ్బు, డబ్బు, ఇదే ఇప్పుడు ప్రధానం అయిపోయింది! మనిషి దీని వెనక కుక్కకు బొక్క మాదిరి పడిపోయాడు! రాజకీయాల్లో, కుటుంబాల్లో, ఇదే ప్రధాన రోల్ ప్లే చేస్తున్నది. అవసరానికి మించి సంపాదన, ఆదాయం కోసం మోసం, ద్రోహం, అన్యాయం, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్నటికైనా మట్టిలో కలవాల్సిన ప్రాణాలు అని తెలిసి కూడ తల్లి, తండ్రులను సైతం డబ్బు కోసం దూరం చేసుకుంటున్నారు. ఒక్కో సంఘటన, దృశ్యం, ఆస్తుల కోసం హత్యలు లాంటి వి చూస్తుంటే ఆందోళన కలుగుతున్నది. అసహ్యం వేస్తున్నది.తల్లి,తండ్రుల గుండెను పిల్లలు,ముఖ్యంగా ఎదిగిన కొడుకులు తీవ్రంగా గాయ పరుస్తున్నారు!తొమ్మిది నెలలు కడుపులో,ఆ తర్వాత రెండేండ్లు ఒడిలో,ఆతర్వాత భుజం మీద,చంకల్లో మూడేండ్లు మోసే తల్లి పాల ఋణం,ప్రేమ ఋణం తీర్చలేనిది! పసిగుడ్డు గా ఉన్నపుడు ఛాతి మీద,భుజాల మీద,నాలుగేండ్ల వయస్సు నుంచి నీ వ్రేలు పట్టుకుని నడిపించే తండ్రి! చదువు మొదలు నీ కోర్కెలు,అవసరాలు అడక్క ముందే తీరుస్తూ,నీ భవిష్యత్తుకు బాటలు వేసే తండ్రి! తనకోసం కన్నా కొడుకు బిడ్డల కోసం ఎక్కువ ఆలోచించే నిస్వార్థ తల్లి,తండ్రులను తప్పు పట్టడం,అవమానాలకు గురి చేయడం ఇటీవల సమాజంలో పెరిగిపోయింది!డబ్బు,ఆస్తులు,వారి కుటుంబం మీదే శ్రద్ధ,ఆసక్తులు పెరిగాయి!***






**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు**
**9951865223**

పెండ్లిళ్లు,పేరంటాలయ్యాక ఉమ్మడి కుటుంబాలు, మనస్తత్వాలు కలువక లక్షల కుటుంబాలు విడిపోయి, వేరుపడ్డాయి! మానవీయ కోణం అనేదే లేకుండా కమర్షియాలిటీ కుటుంబాలు అయిపోయాయి!వావి వరుసలు లేకుండా, ఒకరి మీద ఒకరికి నమ్మకాలు లేవు! ఉండవు! అనుమానాలు ఎక్కువ! ప్రేమలు,విశ్వాసంలు హుష్ కాకి అయిపోయాయి! ప్రత్యక్షంగా,పరోక్షంగా తల్లి ని,తండ్రి ని దుర్భాషలాడడం, కొట్టడం,చంపడాలు కూడా జరుగుతున్నాయి! ఒక సర్వే ప్రకారం ఒక కోల్ బెల్ట్ విస్తరించి ఉన్న ఆరు జిల్లా ల్లో ఉమ్మడిగా ఉన్న కుటుంబాలు కేవలం 4 శాతమే మిగిలాయి! 40 ఏండ్ల క్రితం దాకా ఇలాంటి ఉమ్మడి కుటుంబాలు 68 శాతం ఉండేవి! నాలుగు దశాబ్దాల్లో ఎంత తేడా? ఇది నిజం! నేల మీది నిజం!

**విడిపోయి ఉండలేక**

ఇక తల్లి తండ్రులను ఆరేసినెలల పాటు పంచుకుని,ఒక్కోసారి చాలకాలంగా కలిసి ఉన్న దంపతులను విడదీసి పోషించే పరిస్థితి మింగుడు పడక ఇల్లు విడిచే,ఊపిరి విడిచే వారు ఉంటున్నారు! తమ యువ జీవితం అంతా పిల్లల కోసం కష్టపడి,వయసు మీద పడి,కొంత ఉపశమనం పొందుదాము అనుకున్న రిటైర్డ్ జీవితాలకు సైతం ఇంటి పని,వంట పని,బయట పనులు తప్పడం లేదు! ఇలా ఇంకా కొడుకుల, కూతుర్ల ఇండ్లలో అది ఇండియా అయినా,యూఎస్ అయినా చాకిరీ చేస్తున్న వారు 75 శాతం ఉంటారు! కేవలం బిడ్డలు మాత్రమే ఉన్న దంపతుల పరిస్థితి కొంత బెటర్ గా ఉన్నా, అంత ఆరోగ్య కరంగా ఏమీ లేదు అంటే అతిషయోక్తి కాదు! కనీసం వృద్ధ తల్లి,తండ్రులను ఒకే ఇంటిలో ఉంటూ కూడా, అమ్మ తిన్నారా? నాన్న డాక్టర్ దగ్గరికి వెళ్ళి వచ్చారు కదా, డాక్టర్ ఏమన్నాడు? ఏమైనా తీసుకుని రావాలా? ఏమైనా తిం టావా? అమ్మా! అని అడగడు కొడుకు! అంటూ వాపోయే వారు ఎందరో! బతకాలి కదా! మనవళ్లు,మనవరాళ్ల కోసం ఊపిరి విడిచే దాకా! అంటూ కంట తడి పెడుతున్న వారు ఎందరో ఉన్నారు!

**యాంత్రిక జీవనం లో తల్లి, తండ్రులు! ఆగం!**

తల్లి,తండ్రులు ఈ యాంత్రిక, అసలు మానవత్వం,మానవ విలువలే లేని కాలం లో తల్లి దండ్రులు ఓల్డ్ మిషన్స్ అయిపోయారు అంటే అతిషయోక్తి కాదు! కోడలు,కూతుర్లు ఉదయం 9,10 గంటల కు గాని నిద్ర లేవని పరిస్థితి ఉంటే తల్లి,అత్త తెల్లవారు జామున నిద్ర లేచి, ఇల్లు, వాకిలి ఊడ్చి టిఫిన్,తయారు చేయడం చేస్తుంటారు! ఇలా 68 శాతం ఇండ్లలో ఉన్న పరిస్థితి! అత్త ఊడుస్తుంటే,ఇల్లు తుడుస్తుంటే చూస్తూ కూర్చునే కోడళ్ళు,కొడుకులు ఉన్నారు అంటే అతిషయోక్తి కాదు! అయితే ఇందులో తల్లి,తండ్రులను మంచిగా చూసుకునే కొడుకులు,అల్లుళ్ళు,బిడ్డలు,కోడళ్ళు ఉన్నారు! అయితే వారు పిడికెడే! చాలా తక్కువ!

**వాకిలి ఊడుస్తున్న తండ్రి!**

ప్రతీ రోజు నేను తెల్ల వారు ఝామున వాకింగ్ లో చూస్తుంటాను! చాలా ఇండ్ల ముందు ఊడ్చే వారిలో,అలుకులు చల్లే వృద్ధుల్లో ఇంటిలో పని మనుషుల కన్నా తల్లి,తండ్రులే ఎక్కువ ఉంటారు! పలువురి తో జర్నలిస్ట్ ను కాబట్టి,ఆగి మాట్లాడినపుడు వారి గోడు వినిపిస్తుంటారు! మంచిగా చూడండి అనడం లేదు, పంచభక్ష, పరమాన్నాలు కోరుత లేము, కనీసం మర్యాద లేదు! అవమానకరంగా చూస్తారు! మేము కష్టపడి సంపాదించుకున్న దానితో కట్టుకున్న మా ఇంటిలోనే ఉంటూ,మమ్మల్ని అవమానించడమే బాగుంటలేదు,అంటూ కొందరు విద్యావంతులు అయిన వృద్ధ దంపతులు పేర్కొంటా ఉంటే నా కండ్లు నీళ్లు తీసుకునే పరిస్థితి వచ్చింది!కొన్ని ఏండ్లు గా,కొన్ని నెలలు,రోజులు గా చిరునవ్వు ను కోల్పోయిన వారు సైతం ఎందరో ఉన్నారు! ఎప్పుడూ నవ్వేముఖం తో కనిపించే నా భార్య ముఖంలో కొద్ది రోజులు గా ఆ చిరునవ్వు మాయం అయిపోయింది! నైరాష్యం,అసహనం చూస్తున్నానని ఒక తండ్రి కంట తడి పెట్టాడు!

**నాన్నను ఏడ్పించకు!**

నాన్నను ఏడ్పించకండి, అవమానించకండి! తల్లి,తండ్రులను అవమానించడము, అగౌర్వపర్చడం సబబు కాదు! తల్లి తండ్రుల,అక్కా,చెల్లెళ్ళ ఇంకా ఎవరివైనా, మాటలతో గుండెలను గాయపరచిన, గాయపరుస్తున్న వారికి విజ్ఞప్తి!ప్రేమతో గుండెలను కడుగవచ్చు!విద్వేషం ను సైతం కరుగదీసే శక్తి ప్రేమకు,క్షమాపణల లకు ఉంటుంది! ఒక్క సారి ట్రై చేసి చూడండి!' పైసా యా ప్యార్' అంటే ప్యార్ హి అంటారు తల్లి తండ్రులు!నిజమైన అనుబంధం ఒక్కటే మనిషిని సంతోషంగా ఉంచగలుగుతుందని, ప్రపంచం లో అతిపెద్ద' హార్వార్డ్ 'యూనివర్సిటీ 75 ఏండ్లు నిర్వహించిన సర్వే లో తేల్చిన నిజం, కన్ఫ్యూషన్ ఇది!బెస్ట్ రిలేషన్ షిప్ వల్ల కుటుంబాలే కాదు,ప్రపంచం సంతోషం గా ఉంటుంది!ఒక్క సారి హృదయపూర్వకంగా,కల్మషం లేకుండా ప్రయత్నించి చూడండి! ఆ అనుభూతి ని మీరు ఊహించలేరు! తట్టుకోలేరు! అనుబంధం, ఆత్మీయతను మించిన ఆస్తి లేదు! భౌతికంగా మీరు దూరం అయినా మీ జ్ఞాపకాలు బతికి ఉండే వారి గుండెల్లో పదిలంగా ఉంటాయి!

# బక్రీద్ (ఈదుల్ అజ్హా) సందేశం ఏమిటి?



నమ్రూద్ రాజరికంపై ఇబ్రహీం అలైహిస్సలాం తిరుగుబాటు నాటి రాజరికం పునాదుల్ని కదిలించివేసింది. దైవం మనిషిని సృష్టించాడు.మతాన్ని సృష్టించలేదు. ప్రవక్తల ద్వారా మార్గాన్ని చూపించాడు. మారణహోమాన్ని కోరుకోలేదు. కానీ మనిషి సంపదపై,అధికారంపై తన గుత్తాధిపత్యం కోసం మతం,జాతి,ప్రాంతం,భాష పేరుతోనో, సామ్రాజ్యవాద భావాలతోనో తన దోపిడీ,పెత్తందారీతనంతో సామాజిక, ఆర్థిక అసమానతలను పెంచి బలవంతుడు, బలహీనులు, పాలకుడు,పాలితులు అనే వర్గాలను తయారు చేసాడు. ఇస్లాంలో ఖలీఫా(ప్రతినిధి)అనే పదం ఉంది. పాలకుడు, చక్రవర్తి,రాజు ఇలాంటి పదాలు లేవు. ఈ భావజాలంతోనే ప్రవక్తలు బలహీనుల పక్షం వహించి మీరు తలవంచాల్సింది సమస్త విశ్వాన్ని సృష్టించి,జనన, మరణాలకు అతీతుడైన ఆ ఒక్క దైవానికే తప్ప మరే ఆధిపత్య శక్తికి తలవంచరాదని ప్రబోధించారు.వారి హక్కుల కోసం ప్రజా చైతన్యాన్ని నిర్మించారు.

ఇస్లాంలో ఉన్న పర్వదినాలన్నీ పేదవారితో ముడిపడి ఉన్నవే. దురాచారాలను నిర్మూలించి మనిషిలో అచంచలమైన విశ్వాసాన్ని,ఏకేశ్వరత్వాన్ని,త్యాగ గుణాన్ని పెంపొందించేవే.హజ్రత్ ఇబ్రహీం అలైహి కాలం వరకూ నాటి సమాజాల్లో నరబలి అనే దురాచారం ప్రబలంగా ఉండేది.బలవంతులు బలహీనుల్ని పశువుల్లా కొని తమ మొక్కులకై బలిచ్చేవారు.ఈ దురాచార నిర్మూలన బక్రీద్ లక్ష్యాలలో ఒకటి.ప్రవక్త ఇబ్రహీం అలైహిస్సలాం దేవుని ఏకేశ్వరత్వాన్ని స్థిరంగా నాటి ఆ మార్గంలో ఎదురైన కఠిన పరీక్షలను ఎదుర్కొని విజయులైన ప్రవక్త.దైవం నరబలి అనే దురాచారాన్ని నిర్మూలించ దలిచి ఓ కఠిన పరీక్షకు ఇబ్రహీం ప్రవక్తను గురిచేసాడు.నీకు అత్యంత ప్రియమైన కుమారుడు హజ్రత్ ఇస్మాయిల్ అలైహిస్సలాంను బలివ్వు అంటూ పరీక్ష పెట్టాడు. ఓ వైపు దైవాజ్ఞ ,మరో వైపు లేక లేక కలిగిన కుమారునిపై పెంచుకున్న ప్రేమ .అయినా సరే దైవాజ్ఞకు కట్టుబడి బలిచ్చేందుకు సిద్ధ పడి కుమారుని అనుమతి కోరగా దైవాజ్ఞ అయితే మీ చిత్తం అన్న కుమారుడు. మార్గమధ్యంలో ఎన్నో ప్రలోభాలు ముందుకొచ్చినా తిరస్కరించిన ఇబ్రహీం ప్రవక్త. ఆ అచంచలమైన త్యాగానికి పకృతి విస్తుపోయింది.బలిపీఠంపై ఉన్న ఇస్మాయిల్ అలైహిస్సలాం శిరస్సు స్థానంలో ఓ మేకను ఉంచి నరబలి అనే దురాచారాన్ని దైవం శాశ్వతంగా నిషేధించటం జరిగింది.ప్రవక్త హృదయం సేద తీరింది.దేవుడి పేరుతో అప్పటి వరకూ ప్రపంచంలో ఉన్న నరబలి అనే దురాచారం కొట్టివేయబడింది.అల్లాహ్ దయామయుడు.మానవజాతికి ఇదే నా సందేశం అని ప్రవక్త ప్రకటించారు.ఖుర్బానీ అంటే త్యాగం.బక్రీద్ రోజున మీరిచ్చే పశువుల రక్తమాంసాలు నాకు చేరవు.మీ భయభక్తులు తప్ప.పేదసాదలకు పంచి పెట్టండి అనేది దైవాజ్ఞ.ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగానికి గర్తుగా,నరబలిని నిర్మూలించిన దైవాన్ని స్మరిస్తూ ముస్లింలు ఈదుల్ అజ్హా(బక్రీద్) జరుపుకుంటారు.ఆ రోజు జిబాహ్ చేసిన పశువు మాంసాన్ని తమ తోటి పేదసాదలకు పంచి పెడ్తారు.ఖుర్బానీ ప్రధాన ఉద్దేశం బలి కాదు.పేదల ఆకలి తీర్చటం.పేదలకు పౌష్టికాహారం అందించడం.

నాటి నమ్రూద్ దుష్ట పాలకునిపై అన్ని రాజ్యహింసల్ని ఎదుర్కొని,సకల బలహీనతల్ని జయించి ప్రజా చైతన్యాన్ని నిర్మించిన గొప్ప విప్లవ ప్రవక్త ఇబ్రహీం అలైహిస్సలాం.ఈ స్ఫూర్తినే తదనంతర ప్రవక్తలు అందించారు.ఇబ్రహీం ప్రవక్త అనంతరం వందల సంవత్సరాల తర్వాత జన్మించిన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం.కనుక ఇస్లాం స్థాపకులు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అని యూరోపియన్లు చెప్పే చరిత్ర నిజం కాదు.ఇస్లాంను పరిమితం చేసే కుట్ర.ప్రవక్త ముహమ్మద్ (స)కు ముందున్న ప్రవక్తలు బోధించింది ఇస్లాంనే..వీరు,వీరిని అనుసరించిన వారందరూ ముస్లింలే.దేవుని ఏకత్వాన్ని ప్రబోధించి ప్రవక్తల మార్గాన్ని అనుసరించిన అన్ని కాలాల,అన్ని సమాజాల ప్రజలను అరబ్బీ భాషలో ముస్లింలు(దైవ విధేయులు)అన్నారు.వీరి ధర్మాన్ని అరబ్బీలో ఇస్లాం(శాంతి, సన్మార్గం,దైవానికి అంకితమవటం)అని అన్నారు.ఆయా స్థలం,కాలాల్లో వీరు,వీరి అనుసరణ ధర్మం ఆయా స్థానిక భాషల్లో వివిధ పేర్లతో పిలవబడి ఉండవచ్చు.పవిత్ర ఖుర్ఆన్ అరబ్బీలో అవతరించింది కనుక అరబ్బీలో ఇస్లాం, ముస్లింలు అని సంబోధించింది.అంతే తప్ప ఇస్లాం అనేది ప్రపంచంలోని అన్ని జాతులకు సంబంధించిన మార్గం. ముస్లిం అనేది ఒక జాతి కాదు.ఒకవిశ్వాసం.దీనికి బక్రీద్ ఒక సాక్ష్యం.మనుషులంతా ఒక్కటే.ఆ ఒక్క దైవానికే తప్ప భూమిపై మరెవరికీ తలవంచరాదని,ఎట్టి ప్రలోభాలకు గురి కారాదని,ఎన్ని కష్టాలెదురైనా సత్యంపై స్థిరంగా నిలబడాలని ఈదుల్ అజ్హా సందేశమిస్తుంది... దురాచారాలను నిర్మూలించి,కులమతాల చట్రాలను దాటి సకల మానవజాతి ఏకం కావాలని బక్రీద్ పిలుపిస్తోంది.ఇస్లామియా ఆచరణను కేవలం నమాజులకే పరిమితం చేసుకుని తతిమ్మా జీవితాన్ని ప్రలోభాలకు గురి చేస్తే ఉపయోగం ఏముంటుంది ? దైవానికే భయపడే వాడు ప్రపంచంలోని ఏ దుష్ట శక్తులకు, ఆధిపత్య శక్తులకు తలవంచడు.దైవం ముందు తలవంచని వాడు ఈ ప్రపంచంలోని ప్రతి దానికీ బానిసే.

**కరీముల్లా, కవి**

# నాన్న నా దిక్సూచి



నాన్ననా బలం
నాన్న ను మించిన ప్రేమ మరొకటి లేదు
నాన్న నా దైవం
నడక నేర్పిన నాన్న!!
నాన్న అంటే ఆకాశమంత ప్రేమ
నాన్న నాకు కొండంత అండా
ఆత్మగాళ్ళు నాన్న
అనురాగం ఆప్యాయత పంచే నాన్న!!
కన్నవారికి మెతుకు
కన్న బిడ్డకు బతుకు
నిచ్చుటకై నాన్న పరుగు!!
కనిపించే దైవం అమ్మానాన్న
మన సంతోషమే నాన్న సంతోషం
నాన్న ప్రేమ అజరామరం
నాన్న త్యాగమూర్తి.!!

**దేవులపల్లి రమేశ్, (కవి, రచయిత)**
**నంగునూర్, సిద్దిపేట జిల్లా**
**9963701294**


# పూల పరిమళ భాష

**పల్లవి :**
ఎన్నో తారలున్నా గానీ
వన్నెల జాబిల్లి ఒక్కటే
ఎన్నో భాషలున్నా గానీ
తేనె లొలికే తెలుగొక్కటే
**చరణం:** 1
పదము పదములో...
మధువు చిలికేటి అందాల భాష నా
తెలుగు
అచ్చులతోనే అంతమయ్యేటి
అజంత భాష నా తెలుగు
ముద్దు మురిపాల...
ముద్దులొలికే ముత్యమంటి భాష నా
తెలుగు
సంజె పొద్దుల్లో... స్వర్ణములా
అందాలు చిందే నా తెలుగు
**చరణం :** 2
పనస తొనల్లోనా... పసందుగా
పరమాద్భుతమే నా తెలుగు
ద్రాక్షా పాకానా ... మాధుర్యమై మరులు
గొల్పే నా తెలుగు
మామిడి పండ్లలోనా...
మృదు మధురమై దాగెనే నా తెలుగు
తాటి పండ్ల గుజ్జులోనా...
తనివి తీరని తీపే నా తెలుగు
**చరణం :** 3
మొగలి పొదల్లోనా ...ఘుమ ఘుమల
పూల పరిమళమే నా
తెలుగుజి
మంచి మాటల్లోనా ...మేలిమి
బంగారమే నా తెలుగు
బొండు మల్లెలా... గుండెల గుడిలో
గుభాళించే నా తెలుగు
హరివిల్లుల్లో... విరిజల్లుల్లో... అలరారేదే
నా తెలుగు
**చరణం :** 4
జాన పదుల జావళీల్లో జాలువారేదే నా
తెలుగు
జాణ నవ్వుల్లో పువ్వుల నావై తెలియాడేదే
నా తెలుగు
కొండకోన జలపాతాల సుమధుర
సంగీతమే నా తెలుగు
కొమ్మల రెమ్మల కుహు కుహు రవాల
కోకిల గానమే నా తెలుగు

**గుండాల నరేంద్రబాబు**
**తెలుగు సాహిత్య పరిశోధకులు**
**శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి**
**9493235992**

# అందరం కలిసికట్టుగా కరువును తరమాలి

***ప్రతి సంవత్సరం జూన్ 17 తేదీన ప్రపంచ ఎడారీకరణ మరియు కరువుతో పోరాట దినోత్సవాన్ని జరుపుకుంటారు. "మనమందరం భూమి కోసం ఐక్యంగా ఉండాలి" అనే ఇతివృత్తంతో 2024 సం. కార్యక్రమాలను జరుపుతారు. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు ప్రస్తుతం అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఉన్నాయి. నేల దాని స్వాభావిక లక్షణాన్ని కోల్పోవడాన్ని నేల క్షీణత అని, సారవంతమైన భూమి యేపంటలూ పండడానికి వీలు లేకుండా పోవడాన్ని ఎడారీకరణ అని, ఒక ప్రాంతంలో ఎక్కువకాలం వర్షాలు కురవకపోవడం వలన ఆ ప్రాంతంలో పండవలసిన పంటలు పండకపోయే స్థితిని కరువు అని అంటారు.***



ఐక్యరాజ్యసమితి దగ్గర ఉన్న సమాచారం ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సెకనుకు సుమారు నాలుగు ఫుట్బాల్ మైదానాల విస్తీర్ణంలో సారవంతమైన భూమి క్షీణించబడుతుంది. 2040 సం నాటికి 25 శాతం పిల్లలు నీటి కొరతను ఎదుర్కొంటారు. 2050 సం.నాటికి ప్రపంచ జనాభాలో 75 శాతం మంది కరువులుకి లోనవుతారు. గత దశాబ్దంలో ఎడారీకరణ తీవ్రత గతం కంటె 35 రెట్లు పెరిగింది.

మనదేశంలో 2015 నుండి 2019 మధ్యలో 30.51 మి.హె క్షీణించింది. 2015 లో 4.42 శాతంగా ఉండగా 2019 నాటికి 9.45 శాతానికి పెరిగింది. 25 అక్టోబర్ 2023 నాటికి 25.1 కోట్ల మంది భూమి క్షీణత బారిన పడ్డారు. నీతి అయోగ్ ప్రకారం ప్రతీ సంవత్సరం 12 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణం ( నిమిషానికి 23 హెక్టార్లు ) కరువు మరియు ఎడారి కారణంగా నష్టపోతున్నాయి. ఇక్కడ 20 మిలియన్ టన్నుల ధాన్యం పండించవచ్చు. రాజస్థాన్ లో 21.23 హెక్టార్ల ఎడారి భూమి ఉండగా, మహారాష్ట్ర, గుజరాత్ లో వరుసగా 14.3 మి.హె మరియు 1.02 మి. హె. క్షీణించిన భూమి ఉంది. మన దేశంలో 21% ప్రాంతంలో ఏటా 700 మి.మీ కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది, అటువంటి ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా మారుస్తుంది. మొత్తం కరువు ప్రదేశంలో

విపరీతమైన కరువు గల వారు దాదాపు 12 శాతంగా ఉన్నారు. గుజరాత్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, వాయువ్య మధ్యప్రదేశ్, పశ్చిమ రాజస్థాన్లు ఇందులో ఉన్నాయి. తీవ్రమైన కరువు 42% విస్తరించి ఉంది. ఇందులో ఆంధ్రప్రదేశ్లోని రాయలసీమ, మహారాష్ట్రలోని మరాఠ్వాడా విదర్భలోని కొన్ని ప్రాంతాలున్నాయి. దాదాపు 46% పైగా మితమైన కరువు ఉంది. మధ్య ఉత్తర మధ్యప్రదేశ్, ఛోటా నాగ్పూర్, ఒడిషా, జమ్మూ మరియు కాశ్మీర్, మధ్య తూర్పు తమిళనాడులు ఇందులో ఉన్నాయి. మన దేశంలో అహ్మదాబాద్లోని భారత స్పేస్ అప్లికేషన్ సెంటర్ ఎడారీకరణ, భూ సార క్షీణత అట్లాస్ను రూపొందించింది. దీని ప్రకారం దేశంలో భూసార క్షీణత, ఎడారీకరణ సుమారు 97.84 మిలియన్ హెక్టార్లుగా తేలింది. పర్యావరణ అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం మనదేశం తన భూమిలో దాదాపు 32% క్షీణత, 25% ఎడారీకరణకు గురవుతోందని తెలిపింది.

1.6 బిలియన్ హెక్టార్ల పంటభూమి క్షీణతకు 3.2 బిలియన్ల ప్రజల మీద ప్రభావం చూపుతుంది. 2050సం నాటికి కరువుకు ప్రపంచ జనాభాలో మూడొంతుల మందిని ప్రభావితం అవుతారని తెలిపింది. 4.8 నుండి 5.7 బిలియన్ల మంది ప్రజలు యేటా ఒక నెల పాటు నీటి కొరతను ఎదుర్కుంటారు. నీటి కొరత, క్షీణిస్తున్న పంట ఉత్పాదకత, సముద్ర మట్టం పెరుగుదల, అధిక జనాభా వంటి ఇతర అంశాలతో పాటు కరువు కారణంగా 2050 నాటికి 216 మిలియన్ల మంది ప్రజలు వలస వెళ్లవలసి వస్తుందని తెలిపింది. ఇది పేదరికం, ఆహార అభద్రత, నీటి కొరత, అనారోగ్యాలకు దారితీస్తాయి. ఇవి ప్రజల్లో ఆర్థిక అసమానతలును పెంచుతాయి. చాలా మంది వలస పోతారు. జీవవైవిధ్యం, నీటి వనరులు, వృక్షసంపదకు నష్టం కలిగిస్తుంది. 2040 నాటికి ఆహార ధరలు 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉంటుంది. పంటలకు అత్యంత తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తాయి. అన్ని వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుంది. మంచినీటి పర్యావరణ వ్యవస్థలు, జలవనరులు క్షీణించి పంటలను పండించడం, పశువులను పెంచడం కష్టతరం చేస్తుంది.

నేలక్షీణతకు నిలకడలేని వ్యవసాయ అటవీ పద్ధతులు, పట్టణ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వెలికితీత పరిశ్రమలు కారణాలు. అతిగా మేపడం, నిలకడలేని వ్యవసాయ పద్ధతులు వంటి కారకాలు మన ప్రపంచంలోని పొడి భూములను ఎడారులుగా మారుస్తున్నాయి. మన దేశంలో ఎడారీకరణకు ప్రధాన కారకాలు ఉపాంత భూముల్లో సాగును విస్తరించడం, సరిపడని నేల, నీటి సంరక్షణ చర్యలు, ఇంటెన్సివ్ పంట విధానాలు, పేలవమైన నీటిపారుదల నిర్వహణ, భూగర్భజలాలను అతిగా వినియోగించుకోవడం. వాతావరణ మార్పు, అటవీ నిర్మూలన, అతిగా మేపడం, నిలకడలేని వ్యవసాయ పద్ధతులు వంటి కారకాలు పొడి భూములను ఎడారులుగా మారుస్తున్నాయి.

నేలను పునరుద్ధరణ చేయాలి. చెట్లు నాటడం, పంటమార్పిడి, నీటి నిలువ కాలువలు నిర్మించడం, సేంద్రీయ ఎరువులు, వాడడం వలన భూ పునరుద్ధరణ జరుగుతుంది. పునరుద్ధరణలో మట్టి నష్టాన్ని నివారించడం కీలకమైన భాగం. ఇప్పటి వరకు 115 దేశాలు భూ పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నాయి. ఒక మిలియన్ హెక్టార్ల నేలా మరియు అటవీ నిర్మూలనను పునరుద్ధరణ చేశారు. మన దేశంలో 1988 నాటి జాతీయ అటవీ విధానం లక్ష్యంగా మొక్కలను నాటడం, అడవుల విస్తీర్ణం పెంపు ద్వారా ఎడారీకరణను ఎదుర్కొవడం జరుగుతోంది. 2021-22 మధ్య 18.94 మి.హెక్టార్ల అటవీ పెంపకం జరిగింది. జాతీయ తీర ప్రాంత మిషన్ ద్వారా మడ అడవులు, పగడపు దిబ్బలను పరిరక్షించుతున్నారు.

**(జూన్ 17 తేదీ ప్రపంచ ఎడారీకరణ, కరువుతో పోరాట దినోత్సవం)**



**డీజే మోహన్‌రావు**
**అధ్యాపకులు, శ్రీకాకుళం**
**8247045230**

# నకిలీ కరెన్సీ ముఠా గుట్టు రట్టు




- చాక్లెట్ కంపెనీ యజమాని ఇంట్లో దొంగతనం
- మూడు కార్లు,స్కూటీ ఫోన్లు, లక్ష రూపాయల నగదు స్వాధీనం
- 14మందితో రెక్కీ, సీసీ కెమెరాలు ధ్వంసం చేసిన దుండగులు
- ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సంఘటన
- వివరాలను వెల్లడించిన డీసీపీ, ఏసీపీ



**ఇబ్రహీంపట్నం, జూన్ 16 (జనం సాక్షి)**

ఫేక్ కరెన్సీ అడ్డుకట్టకు పోలీసులు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా చెక్ పడటం లేదు. 14మందితో రెక్కి నిర్వహించి, మరి దొంగతనానికి పాల్పడిన సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ సమీపంలోని చాక్లెట్ కంపెనీ యజమాని తిరుమల తురై ఇంట్లో రూ. 950 కోట్లు ఉన్నాయని భావించిన బోగిని జంగయ్య సతీష్ మహమూద్ రజాక్ పెద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనే నలుగురు వ్యక్తులు ఒక పథకం ప్రకారం ఇంట్లో డబ్బులు దొరికించాలని ఆశతో పథకం పన్నారు.అందుకు అనుగుణంగానే, రజాక్ అనే వ్యక్తి పూజలు చేస్తానని నమ్మించి, 14 మంది సహాయం తీసుకొని ఇంటి చుట్టూ రెక్కీ నిర్వహించి, ఒకేసారి అందరూ ఇంట్లోకి చొరబడి సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, వాచ్ మెన్‌ని బంధించి దొంగతనానికి పాల్పడ్డారని తెలిపారు. అయితే ఇంట్లో ఉన్నవాళ్లు ఇది గమనించి స్థానిక పోలీసులకు ఫోన్ చేయడం ద్వారా అక్కడి నుంచి వాళ్ళు పరార్ అయినట్లు డిసిపి తెలిపారు. ఏసీపీ కేవిపి రాజు, సిఐ రాఘవేందర్ రెడ్డి, ఎస్ఐడి కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ఎంక్వయిరీ నిర్వహించి నలుగురు దొంగలను పట్టుకోవడం జరిగిందని అన్నారు. వీరిని విచారించగా దొంగతనానికి సంబంధించిన పూర్తి వివరాలను ఒప్పుకున్నారని తెలిపారు.వారివద్ద నుండి లక్ష రూపాయల నగదు, మూడు కార్లు,ఒక స్కూటి, 14 సెల్ ఫోన్లు, కత్తులు, లిక్విడ్, స్వాధీనం చేసుకున్నారు. కాగా, వీరికి సహకరించిన మరో పదిమంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును చేదించడానికి సహకరించిన హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు,కానిస్టేబుల్స్ కృష్ణా, రవీందర్, ఉపేందర్, శివచంద్ర, సంతోష్‌లను ఈ సందర్భంగా డిసిపి, ఏసిపి, అభినందించారు.



## ముస్లింలపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

### ఎంఐఎం పార్టీ కొడంగల్ తాలూకా అధ్యక్షులు -ఎస్బీ.గుల్షన్

**కొడంగల్ జూన్ 16 (జనం సాక్షి):**

మెదక్‌లో హిందు వాహిని, భజరంగ్ దళ్, విశ్వ హిందు పరిషత్, గో రక్షక్ సభ్యులు ముస్లిం లపై దాడి చేయడం సరైంది కాదని ఎంఐఎం పార్టీ కొడంగల్ తాలూకా అధ్యక్షులు ఎస్బీ.గుల్షన్ అన్నారు.ఈ సందర్భంగా ఆదివారం రోజు కొడంగల్ పట్టణ కేంద్రంలో ఎంఐఎం ఆఫీస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కుల మతాల మధ్య చిచ్చు రేపుతో అల్లర్లు సృష్టించడం తగదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడుతుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవడం సమంజసం కాదు. మెదక్‌లో అమాయక ముస్లింలపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తరచూ ముస్లింలపై దాడులు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరైనది కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇలాంటి దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలనీ అలాగే రేపు బక్రీద్ పర్వదినం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనకులకు తావు లేకుండా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎండీ సర్తజ్ హుస్సేన్, షేక్ రోమన్, సయ్యద్ ముస్తఫా, ఎండీ.అజర్, ఎండీ షన్వాజ్ హుస్సేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖద్రి పాల్గొన్నారు.

## ఒలింపియాడ్ పరీక్షలో హైదరాబాద్ విద్యార్థులకు ర్యాంకులు




**ఖైరతాబాద్, జూన్ 16 (జనం సాక్షి) :**

2023-24 సంవత్సరానికిగాను ఎస్ఓఎఫ్(ఎస్ఓఎఫ్) ఒలిం పియాడ్ పరీక్షలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు టాప్ ర్యాంక్‌లు సాధించారు.ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఐదో తరగతి విద్యార్థి ముంజులూరి సాత్విక్ నేషనల్ కామర్స్ ఒలింపియాడ్‌లో అంత ర్జాతీయ రెండవ ర్యాంక్ సాధించి, రజత పతకం మెరిట్ సర్టిఫికేట్ సంపాదించాడు. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి శుభయు బెనర్జీ, 8వతరగతి, నేషనల్ కామర్స్ ఒలింపియా డ్‌లో అంతర్జాతీయ 2వర్యాంకుసాధించిరజత పతకం మెరిట్ సర్టిఫికేట్‌ను అందుకున్నారు. ఈ సంవత్సరం ఎస్ఓఎఫ్ ఒలింపియాడ్‌లో హైదరా బాద్‌కు చెందిన 2,34,071 మంది విద్యార్థులతో సహా 70 దేశాలలో సుమారు మిలియన్ల మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్వాంటమ్ లీప్ స్కూల్, కాండోర్ ప్రైన్ ఒన్ స్కూల్‌తో సహా హైదరాబా ద్‌లోని ప్రముఖ పాఠశాలలు పాల్గొన్నవారిలో ఉన్నాయి. సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ 2023-24 విద్యా సంవత్సరానికి విజేతలు, వారి ఉపా ధ్యాయులు ప్రధానోపాధ్యాయులను సన్మానించ డానికి న్యూ ఢిల్లీలో అవార్డుల వేడుకను నిర్వహిం చింది. ఏడు వేర్వేరు ఒలింపియాడ్ పరీక్షలలో పాల్గొన్న గ్రేడ్ 1 నుండి 12 వరకు ప్రపంచవ్యాప్త మొ దటి ముగ్గురు ర్యాంక్ హోల్డర్‌లను ఈ ఈవెంట్ జరుపుకుంది. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ప్రముఖ రచయిత మరియు స్క్రీన్ రైటర్ చేతన్ భగత్ వంటి విశిష్ట అతిథులు ఈ వేడుకకు హాజరయ్యారు.



## చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఘన సత్కారం

**రాజేంద్రనగర్, జూన్ 16 (జనం సాక్షి)**

భాజపా చేవెళ్ల ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొందిన కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన భాజపా రాష్ట్ర నాయకురాలు, జనహిత వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపును ఆకాంక్షించిన ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారికి కప్పిన శేష వస్త్రము, కుంకుమ శక్తి కంకణాలను ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డికి కట్టి ఆయనపై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెంటయ్య, చక్రపాణి, అంజన్, పప్పు, రామ్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్ఎంపి, పిఎంపి బతుకు భరోసా పాదయాత్రని జయప్రదం చేయండి




పాదయాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఉక్కుల అశోక్

**ఇబ్రహీంపట్నం, జూన్ 16 (జనం సాక్షి)**

ఆర్ఎంపి, పిఎంపి, గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని 19న తలపెట్టిన పాదయాత్ర కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కమ్యూనిటీ ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉక్కుల అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్ఎంపి, పిఎంపి, గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులు, తనిఖీలను వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యులకు పారామెడిక్ కోర్స్ పెట్టి దాదాపు వెయ్యి గంటలు ట్రైనింగ్ ఇచ్చిన అప్పటి ప్రభుత్వం తీరా సర్టిఫికెట్ ఇచ్చే సమయానికి పెద్దాయన లోకం విడిచి వెళ్లి పోయారు. ఆయన కాలం చేసిన తరువాత వచ్చిన ప్రభుత్వాలు గ్రామీణ వైద్యుల సమస్యలను పట్టించుకోలేదు ఆ సర్టిఫికెట్ గురించి ఊసే లేదు మళ్ళీ గ్రామీణ వైద్యులకు గుర్తింపు పత్రాలు ఇచ్చి ప్రభుత్వ అనుమతులుతో నియమ నిబంధనలతో ప్రజలకు సేవలు చేసుకొనే అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ వైద్యుల మీద చేసిన తనిఖీలు దాడులకు నిరసనగా 19న ఎల్‌బి నగర్ శ్రీకాంతా చారి విగ్రహం దగ్గర నుంచి కోటి లోని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కార్యాలయం వరకు పాదయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్రంలోని గ్రామీణ వైద్య సోదరులకు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కమ్యూనిటీ ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు సదానందం, నవీన్ కుమార్ ,గఫర్, ఇబ్రహీం, శ్రీనివాస్, రహీమ్, అనూరాధ, మహేందర్, గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# వంశ రాజుల అభ్యున్నతికి కృషి చేస్తా

- వంశరాజ్ కులస్తులు అన్ని రంగాలలో రాణించాలి
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- వంశరాజ్ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత




**కాప్రా, జూన్ 16 (జనం సాక్షి)**

రామంతపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం, అమ్మానాన్న జ్ఞాన మందిరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంశరాజ్ కమ్యూనిటీకి చెందిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అదేవిధంగా ఈ సంవత్సరం ఈ సంవత్సరం వంశరాజ్ కులస్తులు ప్రభుత్వ ఉద్యోగం పొందిన యువతీ యువకులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ సతీమణి ఈటెల జమున రాజేందర్, స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీ వాణి వెంకటేశ్వరరావు, మానవ హక్కుల వేదిక సభ్యులు జీవన్ కుమార్, గడ్డం సాయికిరణ్ లు హాజరై బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వంశ రాజు కులస్తుల అభ్యున్నతికి పాటుపడతానన్నారు, అదేవిధంగా విద్యార్థినీ విద్యార్థులు విద్యార్థి దశలో శ్రద్ధగా చదువుకోవాలన్నారు. వంశరాజ్ కులస్తులు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. మెడిసిన్ సీటు సంపాదించి ప్రతిభ కనబరిచిన నిరుపేద విద్యార్థులకు ఐదు సంవత్సరాల పాటు తన సొంత నిధులతో చదివిస్తానని హామీ ఇచ్చారు. ఈటల జమున మాట్లాడుతూ.. అమ్మానాన్న పౌండేషన్, వంశరాజ్ కులస్తులకు, విద్యార్థిని విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా దగ్గరుండి తీరుస్తానని వారి అభివృద్ధికి దోహదపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిటికెల కృష్ణయ్య, అమ్మానాన్న జ్ఞాన మందిరం ఫౌండేషన్ చైర్మన్ దీర్ఘ జీవ తిరుపతయ్య, రామంతపూర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పాయసం గోపాల్, ఉపాధ్యక్షులు రాసని బాలస్వామి, చిన్న కృష్ణ, వెంకటయ్య, వేణు, బాలు, వీరస్వామి, బాలస్వామి, బాలచందర్, రాము, మల్లేష్, సురేష్, యది, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.






## బోరు బావిని ధ్వంసం చేసిన రియల్ వ్యాపారులు

**కేశంపేట, జూన్ 16 (జనం సాక్షి)**

మండలంలో రియల్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొత్తపేట గ్రామం పరిధిలో కొందరు రియల్ వ్యాపారులు నాలుగు ఎకరాల స్థలంలో నూతనంగా వెంచర్‌ను ఏర్పాటు చేశారు. వెంచర్ ముందు భాగంలో గ్రామ పంచాయతీకి చెందిన మంచినీటి బోరు బావి ఉంది. ఈ బోరు ద్వారానే గతంలో గ్రామ ప్రజల అవసరాల కోసం మంచినీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం వెంచర్ నిర్వాహకులు బోరు బావిని ధ్వంసం చేసి మట్టితో పూర్తిగా పూడ్చివేశారు. అధికారులకు విషయం తెలిసిన పట్టించుకోలేదని ఆరోపణలు గ్రామస్తుల నుండి వినబడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుబావిని పూడ్చివేసిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకొని బోరు బావిని ఉపయోగంలోకి తేవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## హోంశాఖ సహాయ మంత్రికి శుభాకాంక్షలు

**రాజేంద్రనగర్, జూన్ 16 (జనం సాక్షి)**

పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచి కేంద్ర హోం శాఖ సహాయమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ని ఢిల్లీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ భాజపా అధ్యక్షులు కొండె మహేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బండి నరేష్ యాదవ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ ధర్గ చరణ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ కార్యకర్తలు నిజాయతీగల వారు

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్క లంక శ్రీనివాసరావు

**మహేశ్వరం,జూన్16 (జనం సాక్షి)**

నిజాయితీ కలిగిన పార్టీ కార్యకర్తలు ఎవరు? అంటే కాంగ్రెస్ పార్టీ వారే అని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వక్క లంక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నాడు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్ కి గౌడ్ ను కలిసి కాంగ్రెసు పార్టీని వీడకుండా 40 సంవత్సరాలుగా కష్ట కాలంలో పార్టీకి అండదండగా పనిచేసిన వారికి గుర్తించి నామినేట్ పదవులు ఇవ్వాలని కోరారు. పార్టీలు మారిన వారు పదవులు రాకపోతే వెళ్లిపోతారని వారు పార్టీలో పని చేయడానికి పనికిరారని వారు పదవులు కాపాడుకోవడానికి పార్టీలో పదవి కోసం వస్తారు వెళ్ళిపోతారు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎప్పుడూ పార్టీని విడిపోరని గమనించి మాలాంటి వారు చాలామంది పార్టీని పట్టుకొని చాలా కాలం నుంచి ఉన్నామని చైర్మన్ గానూ డైరెక్టర్ గాను పదవులు ఇవ్వాలి అని నీతి నిజాయితీగా పనిచేస్తున్న వారి గురించి ఆలోచించి పార్టీకి పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలకు 10 ఇవ్వాలని కోరుతూ 40 సంవత్సరాల కార్యకర్తగా మీ అభిమాని వక్కలంక శ్రీనివాసరావు అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు పేర్కొన్నారు.



## చిరకాలం మరచిపోలేని తీపిజ్ఞాపకాలు పోటోలు

### మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్

**తాండూరు జూన్ 16 (జనం సాక్షి)**

చిరకాలం పరచిపోలేని తీపిజ్ఞాపకాలు పోటోలేనని మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్ గుప్త పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంక్ మెయిన్ రోడ్డు సమీపంలో రాయల్ ఫోటోగ్రఫీ స్టూడియో నిర్వాహకులు కీజర్ ఆద్వర్యంలో ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ ముఖ్య అథితిగా హజరై రాయల్ ఫోటోగ్రఫీ స్టూడియోను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్ మాట్లాడుతూ పోటోలద్వారానే తిపిజ్ఞాపకాలు పదిలంగా ఉంటాయన్నారు. చిరకాలం మరిచిపోని మదురజ్ఞాపకాలు పోటోలేనన్నారు. అలాంటి పోటోస్టుడియోను ప్రారంబించడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా యువత స్వయం ఉపాధి నిర్ణయం అబినందనియమన్నారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ మణపూరం రాము ,పార్టీ నాయకులు, యువకులు నర్సింహ, పోటోస్టుడియో నిర్వాహకులు, మిత్రులు కుటుంబ సభ్యులు, అస్లం, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా, వైద్యానికై మొదటి ప్రాధాన్యత



## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో జూన్ 16 (జనం సాక్షి)**

వనపర్తి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన ఆదర్శ్ సురభికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నా రెడ్డి పూల బోకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు విద్యా, వైద్యంపై ప్రాధాన్యత ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. 2018 బ్యాచ్ ఐఏఎస్ అయిన ఆదర్శ్ సురభి ఆదివారం వనపర్తి జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్‌గా బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్ కొత్తగా నియమితులైన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిను ఐడిఒసి ప్రాంగణంలో పూల మొక్కతో సాదర ఆహ్వానం పలికారు. వనపర్తి జిల్లా కలెక్టర్‌గా సిటిసిపై సంతకాలు చేసి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు విద్యా పరంగా అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వనపర్తి జిల్లాకు కలెక్టర్‌గా నియమితులై బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నా రెడ్డి పూల బొకే ఇచ్చి శాలువాతో సన్మానం చేస్తూ తన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కలిసి కృషి చేద్దామని పేర్కొన్నారు. తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ప్రణాళిక సంఘం అధ్యక్షులు తెలియజేశారు. అనంతరం జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది కలెక్టర్ కు మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. డిపిఆర్ఓ సీతారాం, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, డిఈఓ గోవిందరాజులు, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి సుధీర్ రెడ్డి, సిపిఓ చంద్రశేఖర్ రాజు, సి.సెక్షన్ సూపరింటెండెంట్ రమేష్ రెడ్డి, డిటి. మధు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

# భక్తి శ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలి

## ఎస్పీ యోగేష్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

బక్రీద్ పండుగ ను జిల్లా ప్రజలు మతసామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా భక్తి శ్రద్ధలతో జరుపు కావాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం ఒకప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపి, ఎస్పీ మాట్లాడుతూ. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై బందోబస్తు ఏర్పాట్ల గురించి పోలీసు అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇవ్వడం జరిగింది. నారాయణపేట జిల్లా పరిధిలో ఉన్న ఈద్గాల దగ్గర ప్రార్థనల సమయంలో ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పండగ రోజు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలకు ఏలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్ ఏర్పాటు చేసి, అవసరం ఉన్న చోట పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలంతా మతసామరస్యాన్ని కాపాడుకుంటూ సామరస్యంగా, శాంతి యుతంగా పరస్పరం ఇతర మతాలను గౌరవి ంచుకుంటూ తమ పం డగలను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ప్రజలు సామా జిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకూ డదని తెలియజేశారు. సోషల్ మీడియాలో పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎవరైనా వివాదాస్పదంగా పోస్టులు చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లకు సంప్రదించాలని ఎస్పీ కోరారు.





## బాధ్యతలు స్వీకరించిన శిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

నారాయణపేట జిల్లా నూతన కలెక్టర్‌గా శిక్తా పట్నాయక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న శిక్తా పట్నాయక్ నారాయణ పేట జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన సందర్భంగా ఆదివారం ఇక్కడి జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్‌ను జిల్లా రెవెన్యూ ఆదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ. నర్సింగరావు, డిపిఆర్ఓ ఎంఏ.రషీద్, కలెక్టరేట్ వివిధ సెక్షన్‌ల పర్యవేక్షకులు, సిబ్బంది, అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు. కాగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ శిక్తా పట్నాయక్ కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల కార్యాలయాలను పరిశీలించారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించేది కమ్యూనిస్టులే

- ఇచ్చిన హామీలను నెరవేర్చని భాజపా ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలు ఎక్కడ..?
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 16(జనం సాక్షి)**

ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించేది కేవలం కమ్యూనిస్టు పార్టీలకే దక్కుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి కేకే భవన్‌లో ఆ పార్టీ మండల స్థాయి రాజకీయ శిక్షణాతరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి జయరాజ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. ప్రపంచంలో దోపిడీ, వివక్ష, అణచివేత ఉన్నంతకాలం కమ్యూనిజం అజేయంగా నిలుస్తుందన్నారు. దేశ భవిష్యత్తు మార్చేది సోషలిజమేనని, అదే అంతిమ పరిష్కారం అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి మూడో సారి అధికారంలోకి వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలకు అధికారం కోల్పోవాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు నడుస్తున్న ఇచ్చిన ఆరు హామీలలో కేవలం రెండు హామీలు మాత్రమే అమలు చేసిందని విమర్శించారు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అనే క్లాసును సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్ భోధి వించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, కొండాపూర్ మండలం కార్యదర్శి రాజయ్య, కంది మండలం కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు బాబూరావు, రత్నయ్య, శేఖర్, సుజాత, నర్సింలు, ప్రభాకర్, సంజీవ పాల్గొన్నారు.



## పీవీ నరసింహారావు తెలంగాణ మత్స్య కళాశాల పరిశీలన

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జి చిన్నారెడ్డి

**పెబ్బేరు జూన్ 16 (జనం సాక్షి)**

పెబ్బేరు పట్టణ పరిధిలోని తెలంగాణ పీవీ నరసింహారావు ఫిషరీస్ యూనివర్సిటీ కళాశాలను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జి చిన్నారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ, ఉపాధి అవకాశాల గురించి వారితో చర్చించడం జరిగింది. ప్రభుత్వంతో మాట్లాడి కోర్స్ అయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పన కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. యూనివర్సిటీ వెనకాల డంపింగ్ యార్డ్ ఉన్నందున దుర్వాసన పొగ వస్తుందని విద్యార్థులు తెలుపగా వెంటనే మున్సిపల్ కమిషనర్ డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని మార్చాలని సూచించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మాజీ గౌని బుచ్చారెడ్డి, సీనియర్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసరాజు భాస్కర్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ పాతపల్లి చంద్రశేఖర్, విజయ్ గౌడ్, సురేష్, నరసింహ, చరణ్, సోప్పరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మి చెక్కులకు మోక్ష మెప్పుడు..?

**న్యాల్ కల్, జూన్ 15, (జనం సాక్షి)**

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో సంబంధిత అధికారులు తీవ్ర జాప్యం చేయడం ఏంటని, చెక్కుల పంపిణీకి మోక్షం ఎప్పుడని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మమ్మద్ గోసోద్దీన్ సభలో అధికారులను ప్రశ్నించారు. ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సభలో ఉపాధ్యక్షుడు చెక్కుల పంపిణీ విషయమై ప్రస్తావిస్తూ.. మండలంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి నెలలు గడుస్తున్న చెక్కులను పంపిణీ చేయడంలో తీవ్ర జాప్యం చేయటం సరికాదన్నారు. అంతకుముందు రేజింతల్ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి సభలో పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని ఆయా పాఠశాల ఆవరణలో దశాబ్దాలుగా పెను ప్రమాదకరంగా మారిన శిథిల భవనాలను తొలగించి విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మండల పరిషత్ అధికారుల బృందం ఎంపీపీ అంజమ్మ, ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీలకు సన్మానించారు. కార్యక్రమంలో ఉప తహసిల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీవో సురేష్ కుమార్, మండలంలోని వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి వేళ డిఎస్పీ ఆకస్మిక తనిఖీ..!

## 53 మూగ జీవాలను వ్యవసాయ క్షేత్రానికి తరలింపు

**న్యాల్ కల్, జూన్ 16,( జనం సాక్షి)**

జిల్లా పోలీస్ ఉన్నతాధి కారి ఆదేశం మేరకు స్థానిక పోలీసులు అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. శనివారం జహీరాబాద్ డివిజన్ డిఎస్పి రామ్మోహన్ రెడ్డి పర్య వేక్షణలో జహీరాబాద్ గ్రామీణ వలయాధికారి మొహమ్మద్ నహీముద్దీన్, ఎస్సై రాము నాయుడు, పోలీసుల బృందంతో కలిసి మండలంలోని జహీరాబాద్-బీదర్ రోడ్డు, గంగ్వార్ ప్రధాన కూడలి వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు. బక్రీద్ పండగను పురస్కరించుకొని తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన కొందరు అక్రమ వ్యాపారులు పశువులను హైదరాబాద్ మహానగరానికి తరలిస్తున్న సమాచార నేపథ్యంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు డీసీఎంలు, మరో రెండు బొలెరో వాహనాల్లో 20 కోడె దూడలు, 18 ఎద్దులు, 15 గేద దూడలను గంగ్వార్ కూడలి మీదుగా హైదరాబాద్ వెళుతుండగా వాహనాలను తనిఖీ చేసి పశు సంపదను సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రానికి తరలించారు. ఆదివారం ఉదయం పశువులు, వాహనాలకు చెందిన పలు పత్రాలు పరిశీలించిన అనంతరం వదిలేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశు సంపదను వాహనాల్లో ఇష్టా రీతిగా తరలిస్తే కేసులు తప్పవని డిఎస్పి హెచ్చరించారు.





## పేటలో డాగ్ స్కాడ్ తనిఖీలు

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

నారాయణపేటలో ఆదివారం బక్రీద్ సందర్భంగా పోలీసులు డాగ్ స్కాడ్ తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు బక్రీద్ పండుగ సందర్భంగా నారాయణపేట, మక్తల్, ఉట్కూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఈద్గాలను, ప్రార్థన మందిరాలను, ప్రధాన చౌరస్తాలను ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా బాంబు స్కాడ్ పోలీసులు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.



## అక్రమంగా కేసులు నమోదు

### ఎస్ఐ మాకు వద్దనీ జిల్లా ఎస్పీకి వినతి

**శివ్వంపేట జూన్ 16 (జనం సాక్షి):**

తాము కొనుగోలు చేసి తీసుకున్న భూమిలోకి వెళ్తే అక్రమంగా మాపై ఎస్ఐ కేసులు నమోదు చేశాడు. ఇదే విషయంపై తాము జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందించామని మండల పరిధిలోని పెద్దగొట్టిముక్కల గ్రామ పంచాయతీ దొంతికుంట గ్రామానికి చెందిన మామిడి సత్తిరెడ్డి, నర్సారెడ్డి ఆదివారం విలేఖరులకు తెలిపారు. నర్సారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం పెద్దగొట్టిముక్కుల గ్రామానికి చెందిన వాకిటి పెంటారెడ్డి వద్ద గ్రామ శివారులోని 2వ సీరియల్ సర్వే నెంబర్ 70ఫు 22 గుంటల భూమిని మే నెల 2022లో కొనుగోలు చేసుకొని 60 రోజుల వాయిదాపై అగ్రిమెంట్ చేసుకున్నమన్నారు. అయితే మాకు డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో అదే అగ్రిమెంట్ పై మేడ్చల్ జిల్లాకు చెందిన ఇతర వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చుమన్నారు. ఖరీదు చేసుకున్న భూమికి హద్దులు నిర్ధారించి, కడిలు పాతగా, ఇతర వ్యక్తులు అక్రమంగా మా భూమిలోకి ప్రవేశించి కడిలను ధ్వంసం చేసి, మడులు కట్టుకున్న భూమిని చదును చేసిన పొలాన్ని విధ్వంసం చేశారన్నారు. ఈ విషయంపై తాము ఇటీవల శివ్వంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డిని సంప్రదిస్తే, మాపై అక్రమంగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మళ్ళీ అట్టి భూమిలోకి వెళ్తే మీపై రౌడీ షీట్ తెరుస్తామని బెదిరించినాడని రైతులు వాపోయారు. ఈ దౌర్జన్యం పై మేము జిల్లా ఎస్పీ, తూప్రాన్ డిఎస్పీ, సీఐ లను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. చట్టానికి విరుద్ధంగా సివిల్ విషయంలో తలదూర్చి మాపై అక్రమ కేసులు నమోదు చేసిన ఎస్ఐపై న్యాయపరంగా పోరాడుతామని బాధిత రైతులు అన్నారు.

# కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్న పెట్టుబడిదారులు

### ఆవాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి. అబ్బాస్




**వనపర్తి బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి)**

సమాజంలో పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోపిడీ చేసి లాభం పొందుతున్నారని ఆవాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి. అబ్బాస్ అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీనిక బంకేట్ హాల్లో సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండ్ల రాజు అధ్యక్షతన తరగతులు ప్రారంభించగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జయలక్ష్మి పాల్గొని ప్రసంగి ంచారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ ఎప్పుడూ కార్మికుల శ్రమ వల్ల లాభం వస్తుందని, దీనిని 1867లో కారల్ మార్క్స్ పెట్టుబడి గ్రంథం ద్వారా వివరించారన్నారు. సరళీకరణ విధానాలు, కార్మికులపై ప్రభావం అనే అంశంపై సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ క్లాస్ బోధించారు. 1991 నుండి ప్రారంభమైన సరళీకరణ విధానాల గురించి నేటి వరకు జరిగిన పరిణామాలను కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను ఆయన వివరించారు. ఎన్డీఏ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, నేడు కార్మిక సంఘం పెట్టుకోవడం కష్టంగా మారిందని, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, పోరాడే హక్కు, వేతనాలు పెంచుకునే హక్కు లేకుండా పోయిందన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, కోశాధికారి శారద, సహాయ కార్యదర్శి రమేష్, గంధం మదన్, బుచ్చమ్మ, జిల్లా కమిటీ సభ్యులు నందిమల్ల రాములు, హమాలి, అంగన్వాడి, ఆశ, భవన నిర్మాణ కార్మికులు, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి. విజయేందిర బోయి

## కలెక్టర్‌కు స్వాగతం పలికిన అదనపు కలెక్టర్‌లు

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్‌గా బి. విజయేందిర బోయి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాకు చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్ అర్‌బి అతిథి గృహం వద్ద పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, అదనపు ఎస్పీ రాములు, ఆర్డీవో నవీన్ స్వాగతం పలికారు. అనంతరం నేరుగా జిల్లా కలెక్టరేట్‌లో తన చాంబర్‌కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను ఛాంబర్‌లో అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఎస్.మోహన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, డిపిఆర్ఓ శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిడి పాండు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ భాస్కర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శంకర్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఏ.నటరాజ్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసి పూల బొకేలు అందించారు. అనంతరం తహశీల్దార్‌లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులు, సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాట్ల పై సమీక్షించి సూచనలు చేశారు.



## మంత్రి టీజీ భరత్ ని సన్మానించిన పూరి సురేష్ శెట్టి

**వనపర్తి బ్యూరో జూన్16 (జనం సాక్షి)**



ఇటీవలే నూతనంగా పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి గా ప్రమాణ స్వీకారం చేసి కర్నూలుకు విచ్చేసిన సందర్భంగా టిసి భరత్ ని శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు పూరి సురేష్ శెట్టి సన్మానించారు. ఈ సందర్భంగా పూరి సురేష్ శెట్టి మాట్లాడుతూ యువ నాయకుడు పిలిస్తే పలికే వ్యక్తి వారి పరిశ్రమల ద్వారా కొన్ని వేల కుటుంబాలకు పని కల్పించిన వ్యక్తి కర్నూలు పట్టణాన్ని అందంగా తీర్చి దిద్దుతారని యువతకు ఉపాధి కల్పిస్తారని ఆశిస్తున్నాము అని పూరి సురేష్ శెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం శెట్టి బాదం వెంకటేశ్వర్లు, బీచ్ పుల్లయ్య హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## హైమాస్ లైట్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని టిడి గుట్ట, నాల్ బౌలి ఖలీల్ చౌక్‌లో గల ఇ బిలాల్ మజీద్ దగ్గర ఆదివారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హైమాస్ లైట్ లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# ప్రపంచానికి పెనుసవాల్ ఎడారీకరణ

ఎడారీకరణ మరియు కరువు ప్రభావాలను ఎదుర్కోవడానికి అవసరమైన సహకారం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం జూన్ 17న దీనిని జరుపుకుంటారు. ఈ సంవత్సరం థీమ్, చరిత్ర మరియు రోజు యొక్క ప్రాముఖ్యతను చూద్దాం. ఈ సంవత్సరం క్షీణించిన భూమిని ఆరోగ్యకరమైన భూమిగా మార్చడంపై దృష్టి సారిస్తుంది. యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ ఎడారీకరణ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఇబ్రహీం థియావ్ ప్రకారం, "ఊఎఎఅ19 అనంతర ఆర్థిక పునరుద్ధరణకు భూమి పునరుద్ధరణ గొప్పగా దోహదపడుతుంది. భూమి పునరుద్ధరణలో పెట్టుబడి పెట్టడం వల్ల ఉద్యోగాలు ఏర్పడతాయి మరియు ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయి మరియు వందల సంఖ్యలో జీవనోపాధిని పొందవచ్చు. లక్షలాది ఉద్యోగాలు పోతున్నాయి." ఎడారీకరణ మరియు కరువును ఎదుర్కోవడానికి ప్రపంచ దినోత్సవం అనేది ప్రపంచంలోని ప్రజలకు అన్ని స్థాయిలలో సహకారం, సంఘం యొక్క బలమైన ప్రమేయం మరియు సమస్య పరిష్కారం ఉన్నప్పుడు భూమి క్షీణత తటస్థతను సాధించవచ్చని గుర్తుచేసే ఒక ప్రత్యేకమైన సంఘటన. ఈ రోజు స్థిరమైన భూ నిర్వహణపై దేశాలు సాధించిన పురోగతిని మరియు ప్రపంచంలో ఏమి చేయాలి, తద్వారా భూమి క్షీణత తటస్థత పేదరికం తగ్గింపు, ఆహారం, నీటి భద్రత, వాతావరణ మార్పు, ఉపశమన మరియు అనుసరణకు బలమైన ఆధారాన్ని అందిస్తుంది. ఎడారీకరణ అనేది శుష్క, పాక్షిక శుష్క మరియు పొడి ఉప-తేమ వంటి వివిధ ప్రాంతాలలో భూమి క్షీణించడం. ప్రధానంగా, ఇది మానవ కార్యకలాపాల వల్ల మరియు తరువాత వాతావరణ మార్పుల వల్ల వస్తుంది. ఇది ఇప్పటికే ఉన్న ఎడారుల విస్తరణ అని కాదు, అయితే ఇది భూమి యొక్క ఉత్పాదకతను ప్రభావితం చేసే పొడి భూమి పర్యావరణ వ్యవస్థలు, అటవీ నిర్మూలన, అతిగా మేపడం, చెడు నీటిపారుదల పద్ధతులు మొదలైన వాటి కారణంగా ఏర్పడుతుంది. 2021 ఎడారీకరణ మరియు కరువును ఎదుర్కోవడానికి ప్రపంచ దినోత్సవం యొక్క థీమ్ "పునరుద్ధరణ. భూమి. రికవరీ. మేము ఆరోగ్యవంతమైన భూమితో మెరుగ్గా తిరిగి నిర్మిస్తాము. ఎడారీకరణ మరియు కరువును ఎదుర్కోవడానికి ప్రపంచ దినోత్సవం కోసం 2019 యొక్క థీమ్ "మనం కలిసి భవిష్యత్తును పెంచుకుందాం". 1995 నుండి ఎడారీకరణ మరియు కరువును ఎదుర్కోవడానికి ప్రపంచ దినోత్సవాన్ని జూన్ 17, 2019 న జరుపుకుంటారు. 1994లో, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ జూన్ 17ని "ఎడారీకరణను ఎదుర్కోవటానికి ప్రపంచ దినం"గా ప్రకటించింది. ముఖ్యంగా తీవ్రమైన కరువు లేదా ఎడారీకరణను ఎదుర్కొంటున్న ప్రాంతాలలో ఎడారీకరణను ఎదుర్కోవడానికి ఐక్యరాజ్యసమితి సమావేశం. 2025 నాటికి 1.8 బిలియన్ల ప్రజలు సంపూర్ణ నీటి కొరతను అనుభవిస్తారు మరియు ప్రపంచంలోని 2/3 మంది నీటి ఒత్తిడితో కూడిన పరిస్థితులలో జీవిస్తారు. 2045 నాటికి 135 మిలియన్ల మంది ప్రజలు ఎడారీకరణ కారణంగా స్థానభ్రంశం చెందవచ్చు. సంవత్సరానికి 3 బిలియన్ టన్నుల కార్బన్‌ను నిల్వ చేయడానికి, క్షీణించిన పర్యావరణ వ్యవస్థల నేలలను పునరుద్ధరించడం అవసరం. అజెండా ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ 2030 ప్రకటించింది, "స్థిరమైన వినియోగం మరియు ఉత్పత్తి ద్వారా, దాని సహజ వనరులను స్థిరంగా నిర్వహించడం మరియు వాతావరణ మార్పులపై తక్షణ చర్యలు తీసుకోవడంతో సహా, క్షీణత నుండి గ్రహాన్ని రక్షించడానికి మేము నిశ్చయించుకున్నాము, తద్వారా ఇది ప్రస్తుత అవసరాలకు మద్దతు ఇస్తుంది మరియు భవిష్యత్తు తరాలు" అని నిర్దిష్టంగా, లక్ష్యం 15 భూమి క్షీణతను అరికట్టడానికి మరియు రివర్స్ చేయడానికి మా సంకల్పాన్ని తెలియజేస్తుంది. కాబట్టి, ఎడారీకరణ మరియు కరువును ఎదుర్కోవటానికి ప్రపంచ దినోత్సవం అనేది ఎడారీకరణ మరియు కరువును ఎదుర్కోవటానికి సంబంధించిన సమస్యలకు సంబంధించిన ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం అని మనం చెప్పగలం. ఈ రోజు కరువు మరియు ఎడారీకరణ కారణంగా ఏర్పడే సమస్యలను కూడా పరిష్కరిస్తుంది.

# రైతుల పక్షపాతి షబ్బీర్ అలీ

- 20,21,22 ప్యాకేజి పనులపై సమీక్ష హర్షణీయం
- కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఇమ్రాన్ ఖాన్, ఇమ్రోజ్, దర్పల్ శేఖర్
- మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నాగరాజ్ గౌడ్

**బిచ్కుంద జూన్ 16 (జనంసాక్షి):** జిల్లాకు సాగు నీరు అందించే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు 20,21,22 ప్యాకేజీ పెండింగ్ పనులపై ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఇమ్రాన్ ఖాన్, ఇమ్రోజ్, దర్పల్ శేఖర్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా రైతులకు రెండు లక్షల 75,000 ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైయస్సార్ హయాంలో ప్రారంభించిన పనులు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 20.21.22 ప్యాకేజి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తయితే షబ్బీర్ అలీకి, కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని ప్రాజెక్టు పూర్తి కాకుండా పదేళ్ల పాటు కక్ష కట్టి నిధులు ఆపేశారన్నారు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే షబ్బీర్ అలీ కలలు కన్న ఈ పనులు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పట్టుదలతో పూర్తి చేయించడమే లక్ష్యంగా ఇరిగేషన్ అధికారులతో పనుల పురోగతి తెలుసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు ప్యాకేజీ పనుల కోసం అవసరమయ్యే నిధులను మంజూరు చేయిస్తానని పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తాననడం జిల్లా రైతాంగానికి తీపి కబురు అందించారన్నారు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు 20,21,22 ప్యాకేజి పనులను పూర్తి చేసి జిల్లా రైతులకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించడం పట్ల ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయని జిల్లా సస్యశ్యామలంగా మారుతుందని అ ఘనత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకే దక్కుతుందని యావత్ జిల్లా రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాయిని బస్వరాజు, అజీమ్, సలీమ్, జీవన్, సల్మాన్, సాహిల్ షెట్కార్, సుచిత్, ఖద్గాం నాగేశ్వరరావు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## ప్యాకేజీ పెండింగ్ పనులపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

**మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్**



**బీబీపేట్(జనంసాక్షి):** జూన్ 16: జిల్లాకు సాగు నీరు అందించే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు 20,21 ,22 ప్యాకేజీ పెండింగ్ పనులపై ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ఇరిగేషన్ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించడం హర్షణీయమని మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా రైతులకు రెండు లక్షల 75,000 ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్సార్ హయాంలో ప్రారంభించిన పనులు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 20.21.22 ప్యాకేజి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తయితే షబ్బీర్ అలీకి, కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని ప్రాజెక్టు పూర్తి కాకుండా పదేళ్ల పాటు కక్ష కట్టి నిధులు ఆపేశారన్నారు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే షబ్బీర్ అలీ కలలు కన్న 20,21,22 ప్యాకేజి పనులు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పట్టుదలతో పూర్తి చేయించడమే లక్ష్యంగా ఇరిగేషన్ అధికారులతో పనుల పురోగతి తెలుసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు ప్యాకేజీ పనుల కోసం అవసరమయ్యే నిధులను మంజూరు చేయిస్తానని పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తాననడం జిల్లా రైతాంగానికి తీపి కబురు అందించారన్నారు ఎత్తిపోతల పథకంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయని జిల్లా సస్యశ్యామలంగా మారుతుందని ఘనత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కే దక్కుతుందని యావత్ జిల్లా రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు



# పొన్నం ప్రజాదర్బార్..

## ప్రజాసమస్యలపై చిగురుమామిడి మండల కేంద్రములో ఏర్పాటు చేసిన మంత్రి

**కరీంనగర్ బ్యూరో, (చిగురుమామిడి) (జనంసాక్షి) :** చిగురుమామిడి మండల కేంద్రములో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఆదివారం రోజు ప్రజా సమస్యలపై ప్రజా దర్బార్ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజల యొక్క సమస్యలను సావధానంగా విని సంబంధిత శాఖల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిస్కారం చేశారు. ప్రజలతో సాదా సీదాగా పలు అంశాలపై ఇస్తాగోష్టిగా మాట్లాడారు. ప్రజలకి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, మంత్రిగా రెట్టింపు భాద్యతతో హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మంత్రి చొరవ, పనితీరుతో మండల ప్రజలు హర్షం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమములో స్థానిక జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్, మండల పార్టీ అధ్యక్షులు కంది తిరుపతి రెడ్డి, చిటుమల్ల రవీందర్, స్థానిక మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## శిక్షణ తరగతుల్లో న్యాయవాదులు..

**వేములవాడ,జూన్ 16 (జనం సాక్షి)**
ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 15 ,16 తేదీలలో రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులకు నూతన చట్టాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు వేములవాడ బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో వృత్తి మెలుకువలు, రాబోయే కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ ను వేములవాడ బార్ అసోసియేషన్ తరపున శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, సీనియర్ న్యాయవాదులు పొత్తూరు అనిల్ కుమార్, గడ్డం సత్యనారాయణ రెడ్డి, అయిల్నేని కిషోర్ రావు, వేముల సుధాకర్ రెడ్డి, పెంట రాజు, నక్క దివాకర్, జంగం అంజయ్య, రేగుల రాజ్ కుమార్, బొడ్డు గంగరాజు, గుజ్జె మనోహర్, బొజ్జ నరేష్, బొడ్డు ప్రశాంత్ కుమార్, బొజ్జ మహేందర్, కాతుబంద నర్సింగరావు, పంపరి శంకరయ్య, నేదురి అభిలాష్, కట్కం జనార్ధన్, గోలి కిరణ్, కనికరపు శ్రీనివాస్, బీమా మహేష్ బాబు, మహిళ న్యాయవాదులు జక్కుల పద్మ, బూర సరిత, తమ్మిడి అన్నపూర్ణ, మొగిలి సుజాత పాల్గొన్నారు..

# ఇతరుల భూమి ఆక్రమణ

**తల్లి, కుమారుడిపై కేసు**

**శంకరపట్నం, జూన్ 16(జనంసాక్షి):** తనయుడి ఓ తల్లి తన భూమితో పాటు పక్కనున్న ఇతరులకు చెందిన ఇల్లు స్థలాన్ని కొడుకు పేరున రిజిస్ట్రేషన్ చేయడంతో ఆ భూమి యజమాని ఫిర్యాదు మేరకు కేశవపట్నం పోలీసులు కేసు నమోదు చేసినట్లు కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పూర్తి వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ఆబాది భూమి నేరెళ్ల ఆగమ్మ భర్త రాజయ్య ఇంటి పక్కన ఉన్న తడిగొప్పుల రాజమ్మ భర్త కొమురయ్య కు చెందిన కాలి స్థలాన్ని తన కొడుకు అయిన నేరెళ్ల సంతోష్ అనే వ్యక్తిపై రిజిస్ట్రేషన్ చేసిందని, మొలంగూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిని తప్పుదోవ పట్టించి మోసం చేయడంతో సదరు భూమి యజమాని ఫిర్యాదుతో తల్లి, కుమారులపై ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఈవీఎం హ్యాకింగ్‌లపై కాంగ్రెస్ అనుమానాలు

వ్యాఖ్యలతో మన దేశంలోని విపక్షాలు గొంతు కలుపుతున్నాయి. భారత్‌లో ఈవీఎంబ్లాక్‌బాక్సులుగా మారాయని, వాటిని పరిశీలించేందుకు ఎవరినీ అనుమతించడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై అనేక ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈవీఎంలపై వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ ఈ మేరకు రాహుల్. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎలాన్ మస్క్ పోస్టును సైతం రాహుల్ ట్యాగ్ చేశారు. మరోవైపు, ఈవీఎంలపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలను కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తోసిపుచ్చారు. ఈవీఎంల హ్యాకింగ్ పై ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ, ఎలాన్ మస్క్ చాలా తేలిగ్గా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కనెక్టివిటీ, బ్లూటూత్ వైఫై, ఇంటర్నెట్ లేకుండా హ్యాకింగ్ చేయడం అసంభవమని రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. ఫ్యాక్టరీ ప్రోగ్రామ్ కంట్రోలర్లను ఎవరూ రీప్రోగ్రామ్ చేయలేరని స్పష్టం చేశారు. ఈవీఎంలను తయారు చేయడం సహా సరిగ్గా ఉపయోగించడం ఎలాగో భారత్ నిరూపించిందని ఆయన పేర్కొన్నారు. ఎలాన్ మస్క్‌కు అవసరమైతే శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమని రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. మూడు ఐఐటీలకు చెందిన నిష్ణాతులైన ప్రొఫెసర్ల బృందం ఈవీఎంలను ఆధునికీకరించిందని గుర్తుచేశారు. కేంద్ర ఎన్నికల సంఘం సమర్థించిన సాంకేతిక నిపుణుల బృందం ఇంఓలు సురక్షితమని స్పష్టం చేసినట్లు వెల్లడించారు. ప్రపంచంలో ఉన్న ఈవీఎంలతో పోలిస్తే భారత్ లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ప్రత్యేకమైనవని ఐఐటీ బాంబేకు చెందిన ప్రొఫెసర్లు కూడా స్పష్టం చేస్తున్నారు. భారత ఇంఓలకు ఇతర పరికరాలతో ఎలాంటి అనుసంధానం ఉండదని పేర్కొన్నారు. కరెంటు సరఫరా కూడా ఈవీఎంలకు ఉండదని, బ్యాటరీతోనే పనిచేస్తాయని గుర్తుచేశారు.



# గోవుల అక్రమ తరలింపు

## అడ్డుకున్న మహిళలు

**అభినందించిన మాజీ సర్పంచ్ సంపత్ రావు**

**ముత్తారం (జనంసాక్షి)**
బక్రీద్ పండుగ పర్వదినాన సంధర్భంగా ముస్లిమ్స్ హైద్రాబాద్ లోని మల్క్షపేట్ పరిధిలో మూగ జీవలను జీవ హింస చేయడానికి తరలిస్తున్న వాహనాలను గమనించిన మహిళలు వాహనాలను ఆవులను (ఎద్దులను) ఎక్కడికి తరలిస్తున్నారని ప్రశ్నించగా వాహనాల డ్రైవర్లు బక్రీద్ పండుగ సందర్భంగా జీవ హింసకు తరిస్తున్నామని తెలపడంతో మూగజీవులను హహీంత్స చేయవద్దని ముత్తారం మండలం హరిపురం గ్రామానికి చెందిన బోడ శ్రీవనిత మైధిలి తోపాటు సునీత కలసి ఆదివారం రోజున అడ్డుకున్నారు. వాహనాల్లో తరలిస్తున్న మూగజీవులను జీవహింసకు అడ్డుపడ్డ మహిళలను ముస్లింలు అడ్డుకొని అనేక ఇబ్బంది గురి చేసిన కూడా అనేక ఇబ్బందులు పడుతూ మూగజీవాలను కాపాడారు. అనంతరం దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో ఇతరులతో కలసి వారు వ్యవసాయం చేసే ఎద్దులను హింస మేదం నేరమని గోవులను సంరక్ష కేంద్రంలో గోమాతను చేర్పించి కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అంతేకాకుండా మహిళలపైన బెదిరింపులకు గురివి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందిన వెంటనే హరిపురం గ్రామ మాజి సర్పంచ్ వెల్పురి సంపత్ రావు తోపాటు గ్రామ నాయకులు కార్యకర్తలు మహిళలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సంపత్ రావు మాట్లాడుతూ అంతరించిపోతున్న మూగజీవులను కాపాడడంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక చూపాలని. పండుగలు పేరుతో జీవహింస చేస్తున్న వారిని అడ్డుకున్న వ్యక్తి ఎవరంటే హరిపురం చెందినవారు కావడం చాలా గౌరవంగా ఉందని. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఎక్కడ ఎన్నడూ లేని విధంగా రాజధాని నగరంలో ధైర్యం చేసి గో హింస చేయకుండా చేసిన ధైర్య సాహసాలకు ప్రత్యేక అభినందన తెలియజేస్తున్నట్లు తెలిపారు.

# ఫోటోగ్రాఫర్‌పై దాడి సరికాదు

**నిరసనగా నల్ల బ్యాడ్జీలతో అసోసియేషన్ ర్యాలీ**

వేములవాడ,జూన్ 16 (జనం సాక్షి)యాదాద్రి జిల్లా భువనగిరి లో ఫోటోగ్రాఫర్ పై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం వేములవాడ రూరల్ ఫోటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తెలంగాణ చౌక్ లో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరిలో జరిగిన ఓ ఫంక్షన్ లో సెల్ ఫోన్ తో ఫోటోలు తీయాలని బంధువులు కోరగా ఫోటోగ్రాఫర్ ఫోన్లో ఫోటోలు తీయడం మా వృత్తి కాదని నిరాకరించడంతో బంధువులు ఫోటోగ్రాఫర్ పై దాడి చేశారని తెలిపారు. ఫోటోగ్రాఫర్ పై దాడి చేయడం చాలా హేయమైన చర్య అని అన్నారు. దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫోటోగ్రాఫర్లపై ఇలాంటి




ఘటనలు పునరావృతం అయితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మీడియా ద్వారా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దానే వేణు, కోశాధికారి మహంకాళి బాబు, సభ్యులు వేణు, నాగరాజు, ప్రభాకర్, శ్రీకాంత్, సందీప్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# అరుంధతి రాయ్ ప్రాసిక్యూషన్ అనుమతిని వెంటనే ఉపసంహరించుకోవాలి

**సిపిఎం పార్టీ జోన్ కమిటీ సభ్యులు చెల్పూరి రాము.**

జమ్మికుంట, జూన్ 16 ( జనం సాక్షి): జమ్మికుంట పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం రోజున జోన్ కమిటీ సభ్యులు చెల్పూరి రాము మాట్లాడుతూ యుఎపిఎ వంటి తీవ్రమైన సెక్షన్ల కింద రచయిత అరుంధతి రాయ్ ను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతించడాన్ని సిపిఎం జోన్ కమిటీ సభ్యులు రాము తీవ్రంగా ఖండించారు. 14ఏళ్ల నాటి కేసులో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఇలా అనుమతి మంజూరు చేయడం దురుద్దేశంతో తీసుకున్న చర్య అని విమర్శించారు. ఐపిసిలోని 124ఎ, 153ఎ, 153బి, 504, 505, 13 యుఎపిఎ వంటి తీవ్రమైన సెక్షన్ల కింద ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతినివ్వడం చూస్తుంటే ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం నినదించే గొంతులను అణచివేయాలని బిజెపి ప్రభుత్వం భావిస్తోందని స్పష్టమవుతోందని అన్నారు. అరుంధతిరాయ్ ప్రాసిక్యూషన్‌కు అనుమతిని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రచయిత అరుంధతి రాయ్ ను, విద్యావేత్త షేక్ షౌకత్ హుస్సేన్‌ను 14ఏళ్ల నాటి కేసులో యుఎపిఎ కింద ప్రాసిక్యూషన్ చేసేందుకు అనుమతినివ్వడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఎన్నికల ఫలితాల అనంతరమే ఇలా చేయడం చూస్తుంటే ఇది భావ ప్రకటనా స్వేచ్ఛకు వ్యతిరేకంగా తీసుకున్న ప్రతీకార చర్యే అని విమర్శించారు. వారిద్దరికీ సిపిఎం పార్టీ తరఫున మద్దతుగా నిలుస్తామని, ఈ చర్యకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులందరూ తమ గళాన్ని వినిపించాలని ఈ సందర్భంగా కోరారు.

# టెర్రరిజంపై ఉక్కుపాదం

ఆయన మార్గదర్శకాలు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జూన్ 29 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభంకానుంది. లక్షల సంఖ్యలో భక్తులు పాల్గొననున్న నేపథ్యంలో అక్కడ తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై కూడా అమిత్ షా సమీక్ష నిర్వహించినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సరిహద్దుల్లో బలగాల మోహరింపు, చొరబాటు యత్నాలు తిప్పికొట్టడం, ఉగ్రవాద నిర్మూలనా కార్యకలాపాలపై షా అధికారులతో చర్చించారు. నాలుగు రోజుల వ్యవధిలోనే జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్రదాడులు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. అక్కడి పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోదీ.. హోం మంత్రి అమిత్ షా, ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్, జమ్మూ-కశ్మీర్ ఎల్జీ మనోజ్‌సిన్హాలతో ఇటీవల సమీక్ష జరిపారు. ఈ క్రమంలోనే ఉగ్రవాదం నిర్మూలనకు పూర్తిస్థాయిలో శక్తిసామర్థ్యాలను వినియోగించాలని ప్రధాని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు చర్యలను ముమ్మరం చేయనున్నారు. నేడు అమిత్ షా అధ్యక్షత జరిగిన సమావేశంలో అజిత్ డోభాల్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సహ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకారం రోజునే యాత్రికులే లక్ష్యంగా పర్యాటక బస్సుపై ఉగ్రవాదులు జరిపిన దాడి సంచలనం సృష్టించింది. ఈ దారుణానికి పాల్పడింది తామేనంటూ పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తొయిబాకు ముసుగు సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించుకుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
17 జూన్ 2024
తెలంగాణ

# విద్యుత్ సమస్య ఎదురైనప్పుడు 1912 నెంబర్‌కు ఉచితంగా ఫోన్ చేయవచ్చు

## ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

బోనకల్, జూన్16:(జనంసాక్షి)
విద్యుత్ సమస్య వచ్చినప్పుడు అధికారులు అందుబాటులో లేరని రాష్ట్రంలో కొన్నిచోట్ల వింటున్నట్లు, వీటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయించినట్టు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం ఉపముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ రాష్ట్రంలో ఎవరికి, ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ సమస్య ఎదురైనప్పుడు 1912 నెంబర్ కు ఉచితంగా ఫోన్ చేయవచ్చని తెలిపారు. కాల్ సెంటర్ కు ఫిర్యాదు అందిన వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఫిర్యాదులు అన్ని ఆన్లైన్ లో రికార్డు అయి ఉంటాయని వివరించారు. ఎవరికైనా ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు 108 అంబులెన్స్ కు ఏ విధంగా అయితే ఫోన్ చేస్తారో, విద్యుత్ సమస్య వచ్చినప్పుడు 1912 ఫోన్ చేయాలని డిప్యూటీ సీఎం కోరారు. విద్యుత్ రంగ పరిస్థితిపై ప్రభుత్వం ఏర్పడగానే అసెంబ్లీలో వాస్తవ పరిస్థితులను శ్వేత పత్రం ద్వారా చర్చకు పెట్టామన్నారు. సభలోని సభ్యులంతా విద్యుత్ అంశంపై మాట్లాడారన్నారు. గత ప్రభుత్వ విద్యుత్ శాఖ మంత్రి కోరిన వెంటనే సభా నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి పారదర్శకత ఉండేందుకు న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్టు ప్రకటించారన్నారు. ఈ విషయాలన్నీ అసెంబ్లీలో రికార్డు అయి ఉన్నాయి, ఎవరైనా వెళ్లి చూసుకోవచ్చు అని ఆయన తెలిపారు. న్యాయవిచారణ జరగాలని నాటి విద్యుత్ శాఖ మంత్రి కోరగా, ఆ పార్టీ నేతలే కక్ష సాధింపు ధోరణి అంటున్నారన్నారు. విచారణకు ఆదేశించడం వరకే ప్రభుత్వం పని ఆ తర్వాత విచారణకు ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని ఉపముఖ్యమంత్రి తెలిపారు.



ధరణి సమస్యలపై నిర్ణయం తీసుకుంటామని గతంలోనే చెప్పినట్లు, దానిపై కమిటీ కూడా వేసామని, ఆ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా అందరి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత అందరి అభిప్రాయాలను ప్రజల ముందు పెడతామని డిప్యూటీ సీఎం అన్నారు. దీనికి సంబంధించి సంపూర్ణంగా, పారదర్శకంగా ఉండేలా, ప్రజలకు జవాబుదారీగా ఉండేలా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామన్నారు.కార్యక్రమం లో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెనకటేశ్వర రావు, ఎస్.ఇ. ట్రాన్స్ కో సురేందర్, పి. ఆర్. ఎస్.ఇ. చంద్రమౌళి, ఇ.ఇ. వెంకటరెడ్డి, కె. వి. కె శ్రీనివాస్, తహసీల్దార్ పూర్ణ చందర్, ఎపిడిఓ రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దంపతులు

నల్గొండరూరల్, జూన్ 16(జనంసాక్షి)
దర్వేశిపురం శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాల సందర్భంగా అంగారంగ వైభవం కన్నుల విందుగా వేలాది మంది భక్తుల సమక్షంలో వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని కల్యాణ మహోత్సవంలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున అమ్మవారికి తలంబ్రాలు మరియు పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దంపతులు,కళ్యాణం అనంతరం శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దంపతులకి వేద ఆశీర్వాదచనాలు అందజేసిన ఆలయ అర్చకులు. ఈ కల్యాణ మహోత్సవాన్ని విక్షించడానికి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తుల కోసం మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సొంత ఖర్చులతో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

# బక్రీద్ శుభా కాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు

## రుగ్మతలను వీడి,సన్మార్గంలో నడుద్ధాం



ఖమ్మం బ్యూరో, జూన్ 16 (జనంసాక్షి):
త్యాగం, క్షమ, ధర్మం, నిబద్ధతకు ప్రతీకగా భావించే బక్రీద్ ( ఈద్ ఉల్ అద్హా ) పండుగని అత్యంత భక్తి శ్రద్దలు, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు ఆకాం క్షించారు. .పవిత్ర బక్రీద్ పండుగను పురష్కరించుకుని ఆయన ముస్లిం సోదర సోదరీ మణులందరికీ ఆదివారం ఒక ప్రకటనలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. స్వార్ధం, అసూయ, రాగ ద్వేషాలు వదిలేసి, మానవత్వాన్ని ఎదజల్లడమే బక్రీద్ పండుగ ఉద్దేశాలని అన్నారు.ఈ పండగ దయాగుణాన్ని, దాన గుణాన్ని చాటిచెబుతూ ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు. అల్లా ఆశీస్సులతో కుటుంబాల్లోని కలతలు, కష్టాలు, నష్టాలు తొలగిపోయి సుఖవంతమైన జీవితాన్ని గడపాలని అన్నారు. జాతి ,మత ,బీద గొప్ప అనే బేధాలను విడనాడి, ప్రేమానురాగాలను పెంపొందించి, ఆత్మీయతకు, ఆదరణకు ప్రతీకగా నిలిచేదే బక్రీద్ పండుగ అన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించడం కోసం , నమ్మిన సిద్దాంతాల కోసం కన్న పేగు బంధాన్ని సైతం బలిచ్చేందుకు సిద్ధమైన అబ్రజత్ ఇబ్రహీం త్యాగనిరతిని స్ఫూర్తిగా తీసుకుని, సాటివారి కష్టాలను సామాజికంగా పంచుకుందా మని నామ అన్నారు. సమిష్టిగా ఒకరినొకరు సహకరించు కుందామని అన్నారు. ఎంతో విశిష్టత ఉన్న ఈ పండుగ మానవాళీలో ఎంతో ఐక్యతను నింపుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈర్ష్యాద్వేషాలు విడనాడి, శాంతి సామరస్యం ,స్నేహం, ప్రేమతో ఒకరినొకరు జీవిద్దామని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# త్యాగానికి ప్రతీకగా బక్రీద్

## తెలంగాణ శాసనమండలి చైర్మన్



నల్గొండటౌన్, జూన్ 16(జనంసాక్షి)
త్యాగానికి ప్రతీకగా ఇస్లాం మతస్థులు జరుపుకునే పవిత్ర పండుగ బక్రీద్ (ఈద్ అల్-అధా) సందర్భంగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముస్లిం సోదర- సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. దేవుని పై విశ్వాసాన్ని కలిగి, సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ మానవాళికి ఇస్తున్నదని ఆయన చెప్పారు .భక్తిని ,త్యాగ గుణాన్ని ఈ పండుగ తెలియజేస్తుందని తెలిపారు. తమకు ఉన్నంతలో ఇతరులకు దానం చేయాలి అనే గొప్ప గుణాన్ని బక్రీద్ తెలియజేస్తుందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు .

# నల్లగొండ కలెక్టర్‌గా నారాయణరెడ్డి



నలగొండ బ్యూరో, జూన్ 16,(జనంసాక్షి)
నల్గొండ జిల్లా నూతన కలెక్టర్ గా సి.నారాయణరెడ్డి ఆదివారం బాధ్యతలను స్వీకరించారు.శనివారం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పలువురు జిల్లా కలెక్టర్లను బదిలీ చేయగా నల్గొండ జిల్లా కలెక్టర్ గా పని చేస్తున్న దాసరి హరిచందన బదిలీ ఆయ్యారు.ఆమె స్థానంలో నూతన జిల్లా కలెక్టర్ గా సి. నారాయణరెడ్డి నియమితులైన విషయం తెలిసిందే.వికారాబాద్ జిల్లా కలెక్టర్ గా పని చేస్తున్న ఆయన ఆదివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ గా పదవి బాధ్యతలను చేపట్టారు .ముందుగా నల్గొండ జిల్లాకు చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కి స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,నల్గొండ ఆర్డీవో రవి, స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.అనంతరం నూతన కలెక్టర్ నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయనికి చేరుకోగానే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర,కలెక్టరేట్ ఏ ఓ మోతిలాల్ పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.నల్గొండ జిల్లా నూతన కలెక్టర్ గా పదవి బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా నూతన కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కి పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.నూతన జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికిన వారిలో సమాచార శాఖ సహాయ సంచాలకులు యు.వెంకటర్శ్వర్లు, పంచాయతీరాజ్ ఈ ఈ భూమయ్య , పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు,జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, మిషన్ భగీరథ ఎస్ ఈ వెంకటేశ్వర్లు,కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మోతిలాల్,జిల్లా కలెక్టర్ సిసిలు ప్రసాద్,కరుణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# విధి నిర్వహణ తొలిరోజే..

## - మానవత్వాన్ని చాటుకున్న భద్రాద్రి కలెక్టర్ జితిష్ వి పాటిల్..





బూర్గంపహాడ్ జూన్ 16 (జనంసాక్షి):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే కలెక్టర్ జితీష్ వి పాటిల్ మానవత్వాన్ని చాటుకున్నారు. బూర్గంపహాడ్ మండలం సారపాక క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని బైక్ పై ప్రయాణిస్తున్న ఇద్దరికీ, ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అటుగా వెళుతున్న నూతన కలెక్టర్ పాటిల్, తన వాహనాన్ని ఆపి దగ్గరుండి క్షతగాత్రులను తన వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నూతన కలెక్టర్ గా విధులకు హాజరైన వెంటనే కలెక్టర్ మానవత దృక్పథాన్ని చాటుకున్నారని పలువురు ప్రశంశించారు.

# ఐసెట్ లో రాష్ట్రస్థాయిలో 62వ ర్యాంకు సాధించడం అభినందనీయం

**విద్యతోపాటు పోటీ పరీక్షలకు త్రివేణి కళాశాల లో ప్రత్యేక శిక్షణ**

**త్రివేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని వీరం రెడ్డి చందనకు ఐసెట్లో 62వ ర్యాంకు**

**ర్యాంకర్ చందనను అభినందించిన త్రివేణి విద్యాసంస్థల చైర్ పర్సన్ బాణాల వసంత వెంకటరెడ్డి**



**కోదాడ, జనంసాక్షి:** కోదాడ త్రివేణి డిగ్రీ కళాశాలలో సాధారణ విద్యతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని విద్యాసంస్థల చైర్ పర్సన్ బాణాల వసంత వెంకటరెడ్డి అన్నారు ఆదివారం కళాశాలలో ప్రభుత్వం ప్రకటించిన ఐసెట్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని వీరాం రెడ్డి సాయి చందన రాష్ట్రస్థాయిలో 62వ ర్యాంకు సాధించడం పట్ల ఆ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. గతంలో కూడా కళాశాల నుండి పీజీ,బీఈడీ, తో పాటు ఇతర కోర్సుల్లో ఉద్యోగాల ఎంపికలో అనేక మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి ఉన్నత లక్ష్యాలకు ఎదిగారన్నారు. చందనను ఆదర్శంగా తీసుకొని మిగతా విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. చందనకు ఉన్నత విద్యలకు కళాశాల పక్షాన పూర్తి సహకారం అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శివ, అధ్యాపకులు కాషాయ్య, లక్ష్మయ్య వెంకటేశ్వర్లు, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేద్దాం

**సమన్వయంతో పని చేసి జిల్లాను అభివృద్ధి బాటలో నిలుపుదాం...**

**జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందించాలి**

**సూర్యాపేట జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన తేజస్ నందలాల్ పవార్**



సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):
సూర్యాపేట జిల్లా నూతన కలెక్టర్ గా తేజస్ నందలాల్ పవార్ ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ లోని వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల జిల్లా అధికారులందరూ సమన్వయంతో పనిచేసే జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని అన్నారు. అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాలకు అందేలా కృషి చేస్తామన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు.ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు మనందరం పనిచేయాలని తెలిపారు. 2018 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ స్వస్థలం బీహార్ రాష్ట్రం.మహబూబ్ నగర్ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా, అదనపు కలెక్టర్ గా పని చేశారు. కామారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం వనపర్తి జిల్లా కలెక్టర్ గా ఉండి, బదిలీపై సూర్యాపేట జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత, ఏవో సుదర్శన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలి..

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి పిలుపు..



తుంగతుర్తి జూన్ 16 (జనం సాక్షి)
ఎన్నికల ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం సిపిఎం పార్టీ శ్రేణులు పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి పిలుపునిచ్చారు. ఆదివారం తుంగతుర్తి లోని రిటైర్డ్ ఉద్యోగుల భవన్లో తుంగతుర్తి నియోజకవర్గ పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వస్తాయని ఆశపడ్డ మోడీకి తను అనుసరించిన నిరంకుశ విధానాల ఫలితంగా బంగపాటు తప్ప లేదన్నారు. సుదీర్ఘకాలం జరిగిన రైతాంగ పోరాటం, మోడీ అనుసరించిన అప్రజాస్వామిక విధానాలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి చేసిన పోరాటాల ఫలితంగా ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి తగిన శాస్తి జరిగిందని అన్నారు.ఒంటరిగా అధికారంలోకి వస్తామని, ఆప్ కీ బార్ చార్ సౌ నినాదంతో విర్రవీగిన మోడీ చరిస్మాను సన్నగిల్లి చావుతప్పి కన్ను లొట్ట పోయినట్టుగా మిత్రులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.నిరంకుశ విధానాలను అవలంబించే ప్రభుత్వాలకు ఇలాంటి గతే పడుతుందని హెచ్చరించారు. ఉపా చట్టం పేరుతో మేధావులు, అభ్యుదయవాదులను ప్రాసిక్యూట్ చేయడం కోసం అనుమతి ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలు చెప్పిన గుణపాఠంతో దేశంలో రాజ్యాంగబద్ధ పాలన కొనసాగించాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలు ఎదుర్కొంటున్న ధరల భారాన్ని తగ్గించి,నిత్యవసర సరుకుల ధరలను అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎరువులు, విత్తనాలు సరిపడా అందుబాటులో ఉంచాలని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీ లను అమలు చేయాలని అన్నారు. ఆగస్టు 15 వరకు అమలు చేస్తానన్న రెండు లక్షల రూపాయల రుణమాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. గ్రామాలలో అనేకమంది పేదలు రేషన్ కార్డులు లేక ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయాలని,రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ శిక్షణా తరగతుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్,కందాల శంకర్ రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు సిపిఎం మండల కార్యదర్శిలు వజ్జె శ్రీనివాస్, కల్లేపల్లి భాస్కర్ నాయకులు అంతయ్య, దేవరకొండ యాదగిరి,గడ్డం ఎల్లయ్య సావిత్ర,వసంత,జానయ్య, గుడిపాటి వెంకులు,గోవిందా చారి,ఉప్పల సోమయ్య, బ్రహ్మచారి,మీనయ్య,నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సుభిక్షంగా ఉండాలని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీర్వదించాలి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నల్లగొండ బ్యూరో,జూన్ 16,(జనంసాక్షి)
రాష్ట్ర ప్రజలు, నల్గొండ జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండేలా ధర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీర్వదించాలని,రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆకాంక్షించారు.ఆదివారం నల్గొండ జిల్లా కనగల్ మండలం ధర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవానికి ఆయన సతీమణి శ్రీమతి సబిత తో కలిసి శ్రీ జమదగ్ని సమేత రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు.అంతేకాక ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు,ఉత్సవ కమిటీ సభ్యులు మంత్రి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.కనగల్ మండలం దరవేశి పురం రేణుక ఎల్లమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈరోజు కళ్యాణం నిర్వహించగా మంత్రి దంపతులు హాజరై కల్యాణం జరిపించారు.కళ్యాణోత్సవానికి హాజరైన భక్తులందరికీ మంత్రి ఉచిత అన్నదానం జరిపించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లా ప్రజలు,రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని,మంచి వర్షాలు కురిసి ప్రజలు పాడి,పంటలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. నల్గొండ జిల్లాను అన్ని రంగాలలో తెలంగాణ రాష్ట్రంలోనే ముందు స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు.ఈ కళ్యాణ మహోత్సవానికి ఈవో జల్లపల్లి జయరామయ్య,ఉత్సవ కమిటీ చైర్మన్ నగేష్, ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి,చిలకమర్రి శ్రవణ్ కుమార్ చారి,దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్ర కుమార్, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు.



# సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం..



మణుగూరు, జూన్ 16 (జనంసాక్షి):
వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు సిసి రోడ్లు నిర్మించారని పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు అన్నారు. ఆదివారం మణుగూరు మండలంలోని విప్పల సింగారం, చెరువు ముందు సింగారం గ్రామాలలో సుమారు రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఏడు,సి సి రోడ్ల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తుల పూల దండలు వేసి హారతి ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఉదయం లేచిన దగ్గర్నుంచి మనం ఎక్కడికి వెళ్లాలన్న రహదారులు సరిగా ఉంటేనే మనం గమ్యానికి సరైన సమయానికి చేరుకోగలమన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారులు సరిగా లేకపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు సరిగా ఉంటే ఆపద సమయంలోనైనా ఏ రాత్రి అయినా సురక్షితంగా ఇంటికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే నూతన రోడ్ల కు విద్యుత్ స్థంబాల తో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలనీ విద్యుత్ అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ పీ. వెంకట్టేశ్వర్లు, ఏఈ వేణుగోపాల్, గ్రామ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విపణి




## గ్రీవ్స్ ఎలక్ట్రిక్ ఇ-స్కూటర్ యాంపీర్ నెక్సస్

### ధర రూ.1.09 లక్షలు

చెన్నై: గ్రీవ్స్ కాటన్ లిమిటెడ్‌కు చెందిన ఇ-మొబిలిటీ విభాగం గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రై.లి. తన ఫ్యామిలీ విద్యుత్ స్కూటర్ యాంపీర్ నెక్సస్‌ను ఆవిష్కరించింది.దీని ధర రూ.1.09 లక్షలు (ఎక్స్-షోరూమ్, చెన్నై). గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రై.లి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ కె.విజయ్ కుమార్ చెన్నైలో ఈ విద్యుత్ స్కూటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. నగరంలోని 11 విక్రయ కేంద్రాల్లో ఇ-స్కూటర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. తమిళనాడు రాణిపేట్‌లోని కంపెనీ ఫ్యాక్టరీలో యాంపీర్ నెక్సస్‌ల డిజైన్, అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. 30 శాతం అదనపు బ్యాటరీ లైఫ్ దీని సొంతం. జన్‌స్కార్ ఆక్వా, ఇండియన్ రెడ్, లునార్ వైట్, స్టీల్ గ్రే రంగుల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

## పాక్‌లో బక్రీద్ కానుకగా పెట్రోల్ ధర రూ.10 తగ్గింపు

ఇస్లామాబాద్:
నగదు కొరత, రెండంకెల ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న పాకిస్థాన్ ప్రజానీకానికి ఊరటనిస్తూ ఈదుల్ అధా (బక్రీద్) పండగ సందర్భంగా అక్కడి ప్రభుత్వం లీటరు పెట్రోలుపై రూ.10.20, హైస్పీడ్ డీజిలు (హెచ్ఎస్‌డీ)పై రూ.2.33 మేర తగ్గించింది.
శనివారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిర్ణయంతో పెట్రోలు లీటరు ధర రూ.258.16, హెచ్ఎస్‌డీ రూ.267.89గా ఉంటుందని శుక్రవారం ట్రిబ్యూన్ వార్తాపత్రిక ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనను ఉటంకిస్తూ పేర్కొంది. 2022 మే నుంచి పాకిస్థాన్ ద్రవ్యోల్బణం 20 శాతానికి పైగా ఉంది. పరిశ్రమల విద్యుత్తు ఛార్జీలను యూనిట్‌కు రూ.10.69 చొప్పున తగ్గిస్తున్నట్లు ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఇదివరకే ప్రకటించారు.

## దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా మళ్లీ సిరిల్ రామఫోసా



జొహన్నెస్‌బర్గ్:
సిరిల్ రామఫోసా (71) మరోసారి దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గత నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రామఫోసాకు చెందిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ మూడు దశాబ్దాల్లో తొలిసారిగా మెజారిటీని కోల్పోయింది.
దీంతో ప్రత్యర్థులను అడ్డుకొని సంకీర్ణ సర్కారు ఏర్పాటు చేసేందుకు ఆయన డెమోక్రటిక్ అలయెన్స్‌తో చారిత్రక ఒప్పందం చేసుకోవాల్సి వచ్చింది. 400 స్థానాలు ఉన్న పార్లమెంటులో శుక్రవారం రాత్రి జరిగిన ఓటింగులో రామఫోసాకు 283 ఓట్లు రాగా.. ఆయన ప్రత్యర్థి అయిన ఎకనమిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ అభ్యర్థి మలేమాకు 44 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో రామఫోసా మరోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

# 'నాన్న నేర్పిందే నా పిల్లలకూ చెప్పాను'..

### వేదాంత చీఫ్ భావోద్వేగ పోస్ట్



మనల్ని ప్రపంచానికి పరిచయం చేసింది అమ్మ అయితే.. మనకు ప్రపంచాన్ని పరిచయం చేసేది నాన్న. తన జీవితంలో ఎదుర్కొన్న ఒడుదొడుకులను పంచుకుంటూ నేర్చుకున్న పాఠాల్ని చెబుతాడు.
ప్రతి అడుగులోనూ తోడుంటాడు. ఎటువంటి సమస్యలో చిక్కుకున్నా నేనున్నానంటూ భుజం తడుతాడు. ఎప్పుడు కింద పడినా చేయందిస్తాడు. ఇలా చెప్పుకుంటూ పోతే నాన్న ప్రేమను వర్ణించడానికి మాటలు సరిపోవు. ప్రతి ఒక్కరి జీవితంలో నాన్నే రియల్ హీరో. ఇలా తన జీవితంలో నాన్న అందించిన సపోర్ట్ గురించి పంచుకున్నారు వేదాంత వ్యవస్థాపకుడు, ఛైర్‌పర్సన్ అనిల్ అగర్వాల్
%కెరీర్ ప్రారంభ దశలో తన తండ్రి ఏవిధంగా సపోర్ట్ చేశాడో "ఎక్స్" వేదికగా పంచుకున్నారు అనిల్ అగర్వాల్. 'ఫాదర్స్‌డే' సందర్భంగా తండ్రి ద్వారకా ప్రసాద్ అగర్వాల్ నేర్పిన పాఠాన్ని ఫాలోవర్లతో పంచుకున్నారు. "వ్యాపార రంగంలో అడుగుపెడదామని ముంబయి వచ్చాను. మొదట్లో నేను చాలా కష్టాల్ని ఎదుర్కొన్నా. ఆ సమయంలో ఓ రోజు సాయంత్రం నాన్న వచ్చి బ్రేక్ తీసుకో అని సలహా ఇచ్చారు. కొన్ని రోజులు సెలవు తీసుకొని ఇంటికి వెళ్లమన్నారు. తర్వాత నాలో మనోధైర్యాన్ని పెంచాడు. ఆయన జీవనపోరాటం గురించి చెప్పడం ప్రారంభించాడు. అయినప్పటికీ నాలో బాధ తగ్గలేదు. కానీ ఏదైనా సాధించగలను అన్న ఆత్మవిశ్వాసం ఏర్పడింది. ఆయన ఎప్పుడూ ఓ విషయం చెప్పేవాడు. మాట్లాడటం అనేది ప్రతి సమస్యను పరిష్కరిస్తుంది. ప్రతి బంధానికి పునాది ఇదే అని చెప్పేవారు. ఇదే పాఠాన్నే పిల్లలకు నేర్పాను" అని అగర్వాల్ తెలిపారు.
"జీవితాంతం తల్లిదండ్రులు మనతో ఉండకపోయినా వారి సంస్కారం, జీవిత పాఠాలు, వారి ఆశీర్వాదాలు ఎప్పుడూ మనతోనే ఉంటాయి. అవే మనల్ని ముందుకు నడిపిస్తాయి. ఈ రోజు నా పిల్లలు ఫాదర్స్‌డే శుభాకాంక్షలు తెలుపుతుంటే మా నాన్నకు కృతజ్ఞతలు చెప్పాలనిపించింది" అని ఆనందంతో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. తన తండ్రితో దిగిన చిన్ననాటి ఫొటోను జత చేశారు. ఇదిలా ఉండగా.. 19 సంవత్సరాల వయసులో అనిల్ అగర్వాల్ వ్యాపారం కోసం పట్నాను వదిలి ముంబయికి వెళ్లారు. ఎంతో శ్రమించి సొంతంగా కంపెనీని స్థాపించారు. మొదట ప్రారంభించిన తొమ్మిది వెంచర్‌లు విఫలమయ్యాయి. అయినప్పటికీ పట్టువదల్లేదు. పదో ప్రయత్నంగా కేబుల్ ఉత్పత్తిని మొదలు పెట్టారు. తర్వాత దాన్ని రాగి, అల్యూమినియం తయారీకి విస్తరించారు. అలా చివరకు వేదాంతని స్థాపించారు.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.01
వరంగల్ ₹ 5.12

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్
₹66,500 (22 క్యారెట్లు)
₹72,550 (24 క్యారెట్లు)

చెన్నై
₹67,050 (22 క్యారెట్లు)
₹73,150 (24 క్యారెట్లు)

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్
₹ 95,600

## అవిన్యా బ్రాండ్‌పై టాటా ప్రీమియం విద్యుత్తు కార్లు

### 30 నిమిషాల ఛార్జింగ్‌తో కనీసం 500 కిలోమీటర్ల ప్రయాణం

దిల్లీ: టాటా మోటార్స్, ప్రీమియం విద్యుత్తు కార్లను అవిన్యా బ్రాండ్‌పై ఆవిష్కరించేందుకు సన్నద్ధమవుతోందని సమాచారం.అవిన్యా వాహనాల్లో వినియోగించే బ్యాటరీలు, అతి త్వరగా ఛార్జింగ్‌కు అనువుగా ఉంటాయని, 30 నిమిషాల ఛార్జింగ్‌తోనే కనీసం 500 కిలోమీటర్లు ప్రయాణించేలా వీటిని తీర్చిదిద్దుతున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అవిన్యా కాన్సెప్ట్ విద్యుత్తు కారును 2022 ఏప్రిల్‌లో టాటా మోటార్స్ ప్రదర్శించిన సంగతి విదితమే. సంస్కృత పదమైన అవిన్యాకు అర్థం వినూత్నత. 2025లో అవిన్యా కారును విపణిలోకి విడుదల చేస్తామని అప్పట్లో సంస్థ ప్రకటించింది.అయితే ఈ పేరుపై ఒక విద్యుత్తు కారును ఆవిష్కరించడంతో సరిపెట్టుకోక, ఈ పేరునే విద్యుత్తు కార్లకు బ్రాండ్‌గా వినియోగించాలని టాటా మోటార్స్ భావిస్తున్నట్లు ఆటో కార్ ఇండియా పేర్కొంది. ఈ బ్రాండ్‌పై పలు వాహనాలను ఆవిష్కరిస్తామని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవత్స వెల్లడించారు. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ లక్షణాలు, స్పోర్ట్స్ వినియోగ వాహనాల్లో ఉండే విలాసవంత - బహుముఖ సదుపాయాలు, బహుళ వినియోగ వాహన తరహా పనితీరు కలిసి ఉండేలా, 'సరికొత్త, అందమైన వినూత్న' విద్యుత్తు వాహనాలను అవిన్యా బ్రాండ్‌పై ఆవిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్ల ముందు, వెనుక కొత్త గుర్తింపును అమర్చుతామని వివరించారు. బటర్‌ఫ్లై డోర్లు ఈ వాహనాలకు ఏర్పాటు చేస్తామని, ఇందువల్ల కారులోకి ఎక్కడం బాగుంటుందని, లోపల కూడా ఎక్కువ ఖాళీ ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు, నీరు-దుమ్ము నుంచి అధిక రక్షణ కల్పిస్తూ, అన్ని ప్రాంతాల వినియోగదారులకు అనువుగా తదుపరి తరం ముడిపదార్థాలతో ఈ వాహనాలను రూపొందిస్తామని వివరించారు. తక్కువ బరువుతో, అధిక సామర్థ్యంతో పనిచేసేలా ఈ వాహనాలు ఉంటాయని స్పష్టం చేశారు.




## ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లతో వొడాఫోన్ ఐడియా కొత్త ప్లాన్

కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. దీని ధర రూ.248. దేశవ్యాప్తంగా అన్ని టెలికాం సర్కిళ్లలో ఇది అందుబాటులో ఉంది.అయితే, ఇది సాధారణ సర్వీస్ వ్యాలిడిటీ ప్లాన్ కాదు. ఇది ఒక డేటా వోచర్. దీన్ని రీఛార్జ్ చేసుకోవాలంటే కచ్చితంగా యాక్టివ్ సర్వీస్ వ్యాలిడిటీ ప్లాన్ ఉండాల్సిందే. ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే ఓటీటీ ప్రయోజనాలు లభించడం విశేషం.వొడాఫోన్ ఐడియా రూ.248 ప్లాన్ వ్యాలిడిటీ ఒక నెల. దీంట్లో 6జీబీ డేటా లభిస్తుంది. వీఐ మూవీస్ అండ్ టీవీ (ఎంటీవీ) ప్రో సబ్‌స్క్రిప్షన్ కూడా ఉంటుంది. సాధారణంగా వీఐ ఎంటీవీ ప్రో సభ్యత్వం విడిగా తీసుకుంటే నెలకు రూ.202 చెల్లించాలి. ఈ ప్లాన్‌తో డిస్నీ హాట్‌స్టార్, సోనీలివ్, ఫ్యాన్‌కోడ్, క్లిక్, మనోరమా మ్యాక్స్, చౌపల్, హంగామా సహా పలు ఓటీటీలు లభిస్తాయి. టీవీ సహా మొబైల్‌లోనూ వీటి కంటెంట్‌ను వీక్షించొచ్చు.

## తాజా ఉత్తీర్ణులకు హుషారే

### 6 నెలల్లో నియామకాలు 5% పెరిగాయ్ఐటీ రంగ పరిస్థితి మెరుగవుతున్నందునే: ఫౌండిట్



దిల్లీ: గత ఆరు నెలల్లో తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్) నియామకాలు 5% పెరిగాయని ఓ నివేదిక వెల్లడించింది. ఐటీ రంగ పరిస్థితి క్రమంగా మెరుగవుతుండటం ఇందుకు కారణమని పేర్కొంది. తాజా ఉత్తీర్ణుల నియామకాల ధోరణిపై ఫౌండిట్ (ఇంతకుమునుపు ఏపీఏసీ అండ్ ఎంఈ) ఈ నివేదికను విడుదల చేసింది. 2023 మే నుంచి 2024 మే వరకు ఫౌండిట్ ప్లాట్‌ఫామ్‌పై నమోదైన ఉద్యోగ ప్రకటనలను విశ్లేషించి, దీన్ని రూపొందించింది.
ప్రారంభ స్థాయి వృత్తి నిపుణులకు సంబంధించిన మొత్తం నియామకాల ప్రకటనల్లో ఐటీ రంగానివి 32%, స్టాఫింగ్ ఇండస్ట్రీవి 12%.
గత ఆరు నెలల్లో తాజా ఉత్తీర్ణులకు గిరాకీ 5% పెరిగింది.
హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లోని కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలపై ఆసక్తి కనబరుస్తున్నాయి.ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు, కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడానికి ప్రాధాన్యం ఇస్తుండటం, వ్యయ నియంత్రణ చర్యలు లాంటివి నియామకాల ధోరణుల్లో మార్పునకు కారణం. అంకురాలకొస్తే ఐటీ సేవల రంగంలోనివి 23%, ఇంటర్నెట్ సేవలందించేవి 22% ఉద్యోగాలను తాజా పట్టభద్రులకు కేటాయించాయి. గత త్రైమాసికంలో ఐటీ పరిశ్రమలో నియామకాలు తగ్గినా, అంకుర సంస్థల్లో ఇంజినీరింగ్ పట్టభద్రులకు గిరాకీ బాగానే ఉంది. వీరి కోసం వచ్చిన నియామకాల ప్రకటనల్లో అంకురాల నుంచే 28% ఉన్నాయి. అంకురాల నుంచి ఇతర ఉద్యోగాల కోసం వచ్చిన ప్రకటనల్లో కన్సల్టెంట్లు (10%), సేల్స్ ఎగ్జిక్యూటివ్/ మేనేజర్ (4%), ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్/ మేనేజర్ (4%) హోదాలవి ఉన్నాయి.
తాజా ఉత్తీర్ణులకు సంబంధించి వచ్చిన నియామక ప్రకటనల్లో దిల్లీ-ఎన్‌సీఆర్‌ది (21%) అత్యధిక వాటా కాగా.. ఆ తర్వాతి స్థానాల్లో బెంగళూరు (14%), ముంబయి (8%), చెన్నై (8%), పుణె (8%), హైదరాబాద్ (8%) ఉన్నాయి. 'చదువుకునే సమయంలో సముపార్జించిన నైపుణ్యాపైనే అంకురాలు సహా కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అందువల్ల అధునాతన నైపుణ్యాలను పెంపొందించుకోవడంపై యువ వృత్తి నిపుణులు దృష్టి సారించాల'ని ఫౌండిట్ సీఈఓ శేఖర్ గరిసా తెలిపారు.

# జనంసాక్షి జాతీయం అంతర్జాతీయం

## కొత్త వ్యాపారాల్లో అయిదింతల వృద్ధి లక్ష్యం

### మహీంద్రా గ్రూపు ఎండీ అనిశ్ షా

దిల్లీ: వ్యాపారాల విలువను గణనీయంగా పెంచుకోవడంపై మహీంద్రా గ్రూపు దృష్టి సారిస్తోందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ అనిశ్ షా తెలిపారు.
రాబోయే దశాబ్ద కాలంలో భారత వృద్ధిలో 70% వరకు వాటా ఉండొచ్చని భావిస్తున్న వ్యాపారాలపై దృష్టి కేంద్రీకరించినట్లు పేర్కొన్నారు. ఫలితంగా 2030కు తమ గ్రూప్ విలువ ఎంతో పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే అయిదేళ్లలో కొత్త వ్యాపారాల విలువను 5 రెట్లు పెంచుకోవాలన్నది మహీంద్రా గ్రూపు లక్ష్యమని షా వెల్లడించారు. 'వృద్ధి రత్నాలు'గా భావిస్తున్న ఈ కొత్త వ్యాపారాల విలువ 2024 మార్చి నాటికి 4.2 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ.35,000 కోట్లు) ఉంది. 'ప్రస్తుతం మా కంపెనీలన్నీ విపణిలో బలమైన స్థితిలో ఉన్నాయి. ప్రతి ఒక్కటి విలువను పెంచుకోగలిగిన సామర్థ్యమున్న కంపెనీలే అని పీటీఐ ఇంటర్వ్యూలో షా తెలిపారు. ఆయనేమన్నారంటే..

**ఆ కంపెనీలు బలమైనవే కానీ..**

వాహన (ఆటోమొబైల్), వ్యవసాయ సామగ్రి (ఫామ్ ఎక్విప్‌మెంట్) విభాగాలు మార్కెట్‌లో అగ్రగామిగా ఎదిగేందుకు అడుగులు వేస్తున్నాయి. టెక్ మహీంద్రా, మహీంద్రా ఫైనాన్స్ పూర్తి సామర్థ్యాన్ని కనబర్చాల్సిన అవసరం ఉంది. కొన్నేళ్లుగా ఈ కంపెనీల పనితీరు.. పరిశ్రమ తీరు కంటే తక్కువగా ఉంది. మహీంద్రా ఫైనాన్స్ మరో ఏడాదిలో పూర్తిగా పుంజుకుంటుంది. టెక్ మహీంద్రా కూడా రాణిస్తోంది.

**'వృద్ధి రత్నాల' విలువ 5 రెట్లు**

మహీంద్రా గ్రూపు 'వృద్ధి రత్నాలు'గా భావిస్తున్న కంపెనీల మొత్తం విలువ గత నాలుగేళ్లలో 5 రెట్లు పెరిగింది. 2020 మార్చి నాటికి ఈ కంపెనీల మొత్తం విలువ 0.8 బిలియన్ డాలర్లు (సుమారు రూ.6,500 కోట్లు) కాగా.. 2024 మార్చి నాటికి 4.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.35,000 కోట్ల)కు చేరింది. వచ్చే ఐదేళ్లలో వీటి విలువ మరో 5 రెట్లు పెరగాలని అనుకుంటున్నామని షా తెలిపారు.
మహీంద్రా గ్రూపు 10 'వృద్ధి రత్నాల' కంపెనీల్లో 3 స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి. అవి లైఫ్‌స్పేస్, లాజిస్టిక్, హాలిడేస్ కంపెనీలు.
లాస్ట్ మైల్ మొబిలిటీ, ఫామ్ మెషినరీ (వ్యవసాయ సామగ్రి), ఎయిరోస్ట్రక్చర్స్, క్లాసిక్ లెజెండ్స్, సస్టెన్ (సౌర వ్యాపారం), యాక్సెలో (వాహన రీసైక్లింగ్ వ్యాపారం), కార్ అండ్ బైక్ వ్యాపారాలు నమోదు కాలేదు.

**ఐపీఓకు ఆ కంపెనీ**

'యాక్సెలో' కంపెనీని పబ్లిక్ ఇష్యూకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయి. వాహన పరిశ్రమలో డీకార్బనైజింగ్ కార్యకలాపాలను ఈ కంపెనీ నిర్వహిస్తోంది. పబ్లిక్ ఇష్యూకు గడువు నిర్దేశించుకోలేదు. విలువ పెంచుకోవడంపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నాం. 'తొలుత స్వతంత్రంగా నిలదొక్కుకోవాలి. ఓ పెద్ద వ్యాపార సంస్థగా మారాకే, స్టాక్ మార్కెట్లో నమోదుపై యోచిస్తాం' అని షా వివరించారు.

# నియంత్రణ పటిష్ఠమైనా మోసాలు తగ్గట్లేదు: కేపీఎంజీ సర్వే



దిల్లీ: నియంత్రణ చర్యల్లో పలు మార్పులు చేసినా, మోసాల సంఖ్య తగ్గడం లేదని తమ సర్వేలో పాల్గొన్న వాళ్లలో ఎక్కువ మంది వెల్లడించినట్లు కేపీఎంజీ వెల్లడించింది.వినియోగదారు సంబంధిత రంగాల్లోని (ఎఫ్ఎమ్‌సీజీ, వినియోగ వస్తువులు, వ్యవసాయం, రిటైల్, ఇ-కామర్స్) పలు సంస్థల నుంచి 75 మందికి పైగా ఆర్థిక రంగ నిపుణులు అభిప్రాయాలు సేకరించారు. ఆ వివరాలు ఇలా.. నియంత్రణపరమైన మార్పులు చోటుచేసుకున్నా మోసాల సంఖ్య తగ్గలేదని వీళ్లలో 79 శాతం మంది వెల్లడించారు. కేవలం 21 శాతం మంది ఈ మార్పులు కారణంగా మోసాల సంఖ్య తగ్గినట్లు తెలిపారు. సంగ్రహణ, విక్రయాలు, పంపిణీ, ఇ-కామర్స్ విభాగాల్లో ఎక్కువగా మోసాలు జరిగేందుకు ఆస్కారం ఉందని సర్వేలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు.
మోసాల కారణంగా సంస్థ పేరు- ప్రతిష్ఠలపై తీవ్రమైన ప్రభావం పడుతుందని 72 శాతం మంది వెల్లడించగా.. ఆర్థికపరంగా కలిగే నష్టాలు కూడా సంస్థలపై ప్రభావం చూపుతాయని 16 శాతం మంది చెప్పారు.
మోసాల గుర్తింపు, నియంత్రణకు సాంకేతికత ఆధారిత హెచ్చరిక సంకేత వ్యవస్థ ఏర్పాటే అత్యంత సరైన చర్య అని భావిస్తున్నట్లు 61 శాతం మంది తెలిపారు. 'వినియోగ సంబంధిత రంగాల్లో గణనీయ మార్పులు చోటుచేసుకోవడమే కాకుండా వేగవంత వృద్ధి నమోదవుతోంది. అదే సమయంలో మోసాల సంఖ్య కూడా ఈ రంగాల్లో బాగానే పెరుగుతున్నాయి. ఈ మోసాల కారణంగా సంస్థలకు ఆర్థికపరంగా నష్టాలు వాటిల్లుతున్నాయి' అని కేపీఎంజీ పార్ట్‌నర్ (ఫోరెన్సిక్ సర్వీసెస్) ముస్తఫా సుర్కా తెలిపారు. సాంకేతికతతో పాటు బలమైన పర్యవేక్షణా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంపై పెట్టుబడులు పెట్టడం ద్వారా క్రమక్రమంగా ఈ మోసాలను సంస్థలు నియంత్రించుకునే వీలుంటుందని సుర్కా అభిప్రాయపడ్డారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
17 జూన్ 2024
తెలంగాణ

# కామాధుడిని కఠినంగా శిక్షించాలి

**సహస్ర ఆత్మ శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులర్పించిన గ్రామస్తులు..**



**ముత్తారం (జనం సాక్షి) :**
ఇటీవలన సుల్తాన్ బాద్ మండలం కాట్నపల్లి గ్రామ శివారులోని ఓ రైస్ మిల్ లో జీవన ఉపాధి కోసం వచ్చిన ఓ కుటుంబంలోని ఆరు నెలల సహస్ర అనే చిన్నారి కామాంధుడి చేతిలో అఘాయిత్యానికి గురైన చిన్నారికి ఆత్మకు శాంతి చేకూరాలని హరిపురం గ్రామ మాజీ సర్పంచ్ వేల్పురి సంపత్ రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు వివిధ పార్టీ నాయకులు కలిసి ఆదివారం రోజున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేళ్ల చిన్నారి కామాంధుడి విషపు కాటుకి బలి అయిన చిన్నారి ఆత్మ శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ నివాళులర్పించడం జరిగిందని అన్నారు. కామంతో కళ్ళు మూసుకుపోయి పశువుల ప్రవర్తిస్తున్న కామాంధులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఎక్కడ కూడా ఇలాంటి సంఘటనలు ఏ తల్లిదండ్రులకు రాకుండా ఉండేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంలు కఠిన చట్టాలను తీసుకొని వచ్చి మరణ శిక్షలు విధించాలని విధించాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చెనవెన శ్రీనివాస్,మాజీ ఉపసర్పంచ్ కూస మౌనిక సతీష్, ఎగుర్ల కుమార్, తాడురి కిషన్, యార బాపన్న, మెంగని రవి, మునిగంటి రాకేష్, అడ్డూరి మోహన్, భాస్కర్, కూస సంపత్, అనుముల సంపత్, శెట్టే అనిల్ కుమార్ , విష్ణుభక్తుల సంతోష్, రాజు, చెనవెన రాజు, ఎగుర్ల రాజు, బోడ సంతోష్, మెంగని వినయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి హత్యాచారం చాలా దురదృష్టకరం..

- ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ...
- మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క..



**గోదావరిఖని, జూన్ 16, (జనంసాక్షి):**
ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి ఆపై హత్య ఘటన దురదృష్టకరమని రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ సీతక్కలు స్పష్టం చేశారు. ఆదివారం రోజున పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని రైస్ మిల్లులో ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చిన్నారిపై బీహార్ కు చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడడంతో పాటు కిరాతకంగా హత్య చేయడం సభ్య సమాజం క్షమించదన్నారు. తల్లి దండ్రుల వద్ద నిద్రిస్తున్న ఆరేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారం జరపడంతో పాటు హత్య చేయడం అతి కిరాతకమని అన్నారు. సంఘటన సమాచారం అందగానే పోలీసులు స్పందించి గంట వ్యవధిలోని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని,అయితే అప్పటికే చిన్నారి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. సంఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి నిందితుడిని వెంటనే పట్టు కోవడంతో పాటు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపేలా ఆదేశించారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు తోపాటు పలువురు పాల్గొన్నారు.

# 17మంది కార్మికుల కుటుంబాలలో చీకటిమయం చేసిన, సింగరేణి యాజమాన్యం

**- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య**

**యైటింక్లయిన్ కాలని జూన్ 16 (జనంసాక్షి) :**
జూన్ 16 2003, 7ఎల్ఈపి గని మొదటి షిఫ్ట్ చివరలో జరిగిన, ప్రమాదం దుర్ఘటనలో 17 మంది కార్మికులను బలిగొన్న సింగరేణి అధికారులపై చర్యలు తీసుకోవాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిలాల్ నక్వీ, సహాయకునిగా కమలేస్ సహాయ్ అఖిల భారతీయ ఖధాన్ మజ్దూర్ సంఘ్ బిఎంఎస్ జాతీయ రక్షణ కమిటీ సభ్యులు సుదీర్ఘ విచారణ అనంతరం సింగరేణి అధికారుల తప్పిదంతో ప్రమాదం జరిగిందని సింగరేణి అధికారులను శిక్షించాలని కోరడం జరిగిందన్నారు. తీర్పు ఇచ్చినప్పటికీ ఇప్పటికీ అమలు చేయని సింగరేణి యాజమాన్యం, రక్షణ చర్యలపై చిత్తశుద్ధి ఆచరణలో ప్రకటించాలని, అంతర్జాతీయ ప్రమాణాలు కొనసాగించాలని ఆయన డిమాండ్ చేసినారు, గని ప్రమాదంలో 17మంది సింగరేణి కార్మికుల కుటుంబాలకు న్యాయం జరగలేదని, ప్రభుత్వం,సింగరేణి యాజమాన్యం బాధిత కార్మిక కుటుంబాలకు ఇచ్చినటువంటి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేసినారు, సింగరేణి సంస్థలో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై సింగరేణి రక్షణ విభాగం పూర్తిస్థాయిలో రక్షణ కమిటీల నియామకం జాతీయ కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఏర్పాటు చేయాలని రక్షణ విషయంలో సింగరేణి అధికారుల పాత్ర నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందదని పని స్థలములలో పర్యవేక్షణ లోపం కనబడుతున్నదని నివారణకు జాతీయ సంఘాల ప్రతినిధులతో వెంటనే రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



# ఆరేళ్ల చిన్నారిపై లైంగికదాడి, ఆపై హత్య చేసిన నిందితుని కఠినంగా శిక్షించాలి

**- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు డి. బుచ్చమ్మ**

**యైటింక్లయిన్ కాలని జూన్ 16 (జనంసాక్షి) :**
ఆరేళ్ల చిన్నారిపై లైంగికదాడి, ఆపై హత్య చేసిన నిందితుని కఠినంగా శిక్షించాలని పగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు డి. బుచ్చమ్మ అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పీఓడబ్యూల అధ్యక్షుడు బీ. అశోక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు.

సంఘటనకు పాల్పడిన నిందితుడని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో 8వ కాలనీలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడు ఆసిఫాబాద్ జిల్లాలోని దహెగాం మండలానికి చెందిన వ్యక్తి సుల్తానాబాద్ మండలంలోని మమత రైస్ మిల్లులో కూలీగా పని పనిచేస్తున్నట్లు స్థానికుల సమాచారం రాత్రి సమయంలో పాప నిద్రపోతుండగా రైస్ మిల్లులో హమాలీగా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు బాలికను ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడి, అతి దారుణంగా హత్య చేశాడని అన్నారు. ఈ సంఘటనకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మిల్లు యాజమాన్యాలపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల మహిళా సంఘ డిమాండ్ చేస్తుందన్నారు. .లేనియెడల పెద్ద ఎత్తున అన్ని మహిళా సంఘాలను కలుపుకొని ఆందోళనలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రగతిశీల నాయకురాలు బండ పద్మ, కె. శారద రాజేశ్వరి, మదనమ్మ, జె.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## విద్యానగర్ శ్రీ బాల భక్త ఆంజనేయస్వామి దేవాలయ నూతన కమిటీ ఎన్నిక



**కరీంనగర్ బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి) :**
కరీంనగర్ పట్టణం విద్యానగర్ నవీన కుర్మ వాడలో గల శ్రీ బాల భక్త ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. దేవాలయాల ఆవరణ లో కమిటీ సభ్యుల ముఖ్య సమావేశంలో ఇట్టి కార్యవర్గం ఏర్పాటయింది. దేవాలయ కమిటీ అధ్యక్షులుగా ఏల్కపల్లి బీరయ్య, ప్రధాన కార్యదర్శిగా దానే అశోక్, కోశాధికారిగా సాయిల్ల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా సంద మహేష్ ల నియామకం జరిగింది. దేవాలయ అభివృద్ధి కోసం తగిన కృషి చేస్తామని నూతన కమిటీ బాధ్యులు ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో బక్రీద్ నిర్వహించాలి

- మతసామరస్యాన్ని కాపాడుతూ.. ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా పండుగలను నిర్వహించుకోవాలి..
- పండుగల సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చే ఎలాంటి వదంతులను "(పుకార్ల)" ను నమ్మరాదు..
- పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్..




**గోదావరిఖని, జూన్ 16, (జనంసాక్షి):**
బక్రీద్ పండుగను రామగుండం కమీషనరేట్ ప్రజలంతా సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం కమిషనరేట్ పరిధి పెద్దపల్లి మంచిర్యాల జిల్లాల ప్రజలకు రేపు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమీషనరేట్ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మసీదులు,దర్గాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బందోబస్త్ విధులకు హాజరయ్యే అధికారులకు,సిబ్బందికి దిశా నిర్దేశం చేశామన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వ్యాప్తంగా గత 15 రోజులుగా చెక్పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలు చేపట్టి ఆవుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు. ఆకస్మిక తనిఖీలను నిర్వర్తిస్తూ అక్రమ రవాణా జరగకుండా నివారిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తెలియజేశారు. కమీషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు మరియు సిబ్బంది మొత్తం బక్రీద్ బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అభ్యంతరకర పోస్టులు వచ్చిన ప్రజలు అట్టి పోస్టులను చూసిన వెంటనే ప్రతిస్పందించకుండా, సంయమనం పాటిస్తు అట్టి పోస్టుల్లో నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని, సామాజిక మాధ్యమంల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని వాటిని ముందుగా ఎటువంటి సమాచారం తెలిసినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలి అని లేదా డయల్ - 100కు ఫోన్ చేసి తెలియ జేయాలని కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను పోస్ట్ చేసిన ,ఫార్వార్డ్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీపీ హెచ్చరించారు.



# క్రికెట్ టోర్నమెంట్ గెలుపొందిన వారికి బహుమతులు అందించిన ఎస్ఐ శేఖర్ రెడ్డి

**ముస్తాబాద్ జూన్ 16 (జనంసాక్షి):**
ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామ యువత ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు గత 15 రోజులుగా క్రికెట్ పోటీలు కొనసాగాయి ఆదివారం ఫైనల్ మ్యాచ్ కి బ్రదర్స్ జట్టు గన్నెవారిపల్లె జట్టు పోటీల్లో పాల్గొనగా ఫైనల్ మ్యాచ్ కి ముస్తాబాద్ ఎస్సై శేఖర్ రెడ్డి పాల్గొని క్రీడల్లో విజేతలైన జట్టులకు ప్రథమ స్థానంలో బ్రదర్స్ జట్టు గెలుపొందగా ద్వితీయ స్థానంలో గన్నే వారి పల్లి జట్టు నిలిచారు గెలుపొందిన విన్నర్ జట్టుకు 13వేల నగదు తో పాటు రన్నర్ జట్టుకు 7 నగదు తో పాటు ట్రోఫీ తో పాటు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచిన వారికి మ్యాన్ అఫ్ ది సీరీస్మ్యా,న్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులను అందజేశారు విజేత గెలుపొందిన బ్రదర్స్ టీం గ్రామానికి చెందిన నిరుపేద యువతికి పై చదువులకు 5000 రూపాయల నగదును ఎస్సై చేతుల మీదుగా అందజేశారు ఇదే స్ఫూర్తితో నామాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఉచ్చిడి బాల్ రెడ్డి తన వంతు సహాయంగా 2000 నగదును ఆ యువతీకి అందించారు క్రీడా పోటీలు నిర్వహించిన పోతుగల్ యువతను. ఆర్థిక సాయం అందించిన బ్రదర్స్ క్లబ్ టీమ్ ను,సహకరించిన యువతను ఎస్సై శేఖర్ రెడ్డి అభినందించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత జీవితం పట్ల సరైన దృక్పథ సంకల్పబలం ఉంటేనే లక్ష్యసాధనలో సఫలీకృతులు అవుతారని పేర్కొన్నారు యువత కీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని యువకులకు సూచించారు ఈ కార్యక్రమంలో క్రీడ నిర్వాహకులు కిట్టు సాయి రాకేష్ అభి సుజిత్ ముఖ్య అతిథులుగా కోలా కృష్ణ గజ్జల రాజు గాడిచెర్ల శ్రీనివాస్. ఉచిడి బాల్ రెడ్డి భాను,నాని,తిరుపతి మహేష్ వివిధ గ్రామాల క్రీడాకారులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు గ్రామీణ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు స్పోర్ట్స్ లో రానించాలి..

**రామగుండం, జూన్ 16, (జనంసాక్షి):**
సౌత్ జోన్ ఖేలో ఇండియా ఉమెన్స్ వూషూ లీగ్ పోటీలలో బంగారు పథకం సాధించిన సిగిరి శ్రావ్యాంజలిని సన్మానించిన బిజెపి నాయకులు కందుల సంధ్యారాణి. మహిళలు గ్రామీణ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు స్పోర్ట్స్ లో రానించాలనే ఉద్దేశంతో ఖేలో ఇండియా గేమ్స్ ను కేంద్ర ప్రభుత్వం రూపొందించడం జరిగింది.

ఇందులో భాగంగా ఈనెల 10వ తేది నుండి 14 వ తేదీ వరకు కర్ణాటక బాగల్ కోర్టులో జరిగినటువంటి సౌత్ జోన్ ఖేలో ఇండియా ఉమెన్స్ వూషూ లీగ్ పోటీలలో గోదావరిఖని వాసి సిగిరి శ్రావ్యంజలి సాండా ఫైటింగ్ (ఫుల్ కాంటాక్ట్ ) జూనియర్ - 60కేజీ విభాగం లో తెలంగాణ రాష్ట్రము తరుపున ఆడి తెలంగాణకు మొదటి బంగారు పతకం సాధించడం జరిగింది. ప్రతిష్టాత్మకమైన ఖేలో ఇండియా పోటీలో తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా తరపున మొదటిసారిగా మొదటి స్థానం (బంగారు పతకం) సాధించడం హర్షించదగ్గ విషయ మని కందుల సంధ్యారాణి (బీజేపీ ఇంచార్జ్ ) తెలిపారు. బంగారు పథకం సాధించినందుకు గాను సిగిరి శ్రావ్యం జలిని, కోచ్ కుమార్ ని శాలువా తో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా వుషు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.కుమార్, తల్లి దండ్రులు సిగిరి నరేష్, లావణ్య, లక్ష్మి నగర్ బీజేపీ మండల అధ్యక్షులు కోడూరి రమేష్, నాయకులు పైతరీ రాజు, కందుల పోషం,బాలు తదితరులుపాల్గోన్నారు.



# సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం వెంటనే అమలు చేయాలి -సిఐటియు..

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెబిసిసిఐ సభ్యులు మంద నరసింహారావు..**




**గోదావరిఖని, జూన్ 16, (జనం సాక్షి):**
సింగరేణి కార్మికులకు గత అనేక సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంత ఇంటి పథకాన్ని గత రెండు సంవత్సరాలుగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అనేక దఫాలుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది సింగరేణి ఏడోదఫా జరిగిన ఎన్నికల సందర్భంగా ఈ డిమాండును అన్ని సంఘాలు ముందుకు తీసుకు వచ్చినటువంటి అంశం మరియు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కూడా సొంత ఇంటి పథకాన్ని తప్పకుండా అమలు చేసి తీరుతామని వాగ్దానం చేయాల్సి వచ్చింది ఈ సమస్యను పరిష్కరిస్తే ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అనే సామెత గా సొంత ఇంటి పథకంతో పాటు పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ సమస్య ప్రత్యేకంగా అగ్రిమెంట్ చేయకుండానే పరిష్కారమయ్యే ఏర్పడుతుంది ఈ సమస్య పరిష్కారం వల్ల కంపెనీకి గాని ప్రభుత్వానికి గాని ఎలాంటి ఆర్థిక భారం పడదు అని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు ఈరోజు గోదావరిఖని చౌరస్తా లోని శ్రామిక భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

సొంత ఇంటి పథకం అమలు వల్ల కంపెనీకి ఎలా లాభం:
పెరక్స్ మీద ఇన్కమ్ టాక్స్ అమలు చేయాలంటే ఒక్కొక్క కార్మికుడికి 4000 నుంచి 6000 వరకు ప్రతినెల పేమెంట్ చెల్లించే భారం తగ్గుతుంది అలాగే నీరు విద్యుత్తు రిపేర్సు పేరుమీద నాలుగు వేల నుంచి 5000 వరకు భారం తగ్గుతుంది కాలనీ విద్యుత్తు రోడ్ల మెయింటెనెన్స్ భారం తగ్గుతుంది కంపెనీ మున్సిపాలిటీలకు కట్టుతున్న నాలా ఇతర పన్నులు భారం తగ్గుతుంది క్వార్టర్స్ మెయింటెనెన్స్ కొరకు ఉపయోగించే కార్మికులను సేఫ్టీ ఇతర అవసరాలకు వాడుకునే అవకాశం ఏర్పడుతుంది. సింగరేణిలో ఉన్న ఓటర్స్ 60% పైగా 40 సంవత్సరాల పైబడిన క్వాటర్లను కులగొట్టి వాటి స్థానంలో కొత్త కోటర్స్ కొట్టాలంటే కోట్లాది రూపాయల ఖర్చు భారం తగ్గుతుంది. కంపెనీ మీద వస్తున్న రాజకీయ ప్రభుత్వ అధికారుల ఒత్తిడి తగ్గుతుంది ఆక్రమణకు గురయ్యే క్వటర్లో పద్ధతికి స్వస్తి పలకవచ్చు అలాగే దానికి ఉపయోగించే విద్యుత్తు నీటి భారం శానిటేషన్ తదితర భారం కూడా తగ్గుతుంది.

**కార్మికులకు ఎలాంటి లాభం చేకూరుతుంది:**
ఎవరు నివసిస్తున్న కొట్టరు వాళ్లకు కేటాయిస్తే సొంత ఇంటి పథకం అమలుతో పాటు క్వార్టర్స్ లేని కార్మికులకు సింగరేణి వ్యాపితంగా ఉన్న మూడువేల ఎకరాల ల్యాండ్ ను 250 గజాల చొప్పున కేటాయించి 20 లక్షల వడ్డీ లేని రుణం ఇస్తే అంత ఇల్లు కట్టుకోవచ్చు
ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సొంత ఇంటి పథకం చేకూరాటం వల్ల లక్షల రూపాయల భారం తగ్గుతుంది పేరక్స్ మీద ఇన్కమ్ టాక్స్
భారం దాదాపు నాలుగు వేల నుండి 6000 వరకు ఆదా అవుతుంది ఇంటికి రాయి కింద ఇన్కమ్ టాక్స్ మినహాయింపు 3000 వరకు కలుగుతుంది కార్మికుడికి ఇంటి కిరాయి కింద కార్పొరేషన్ లో 16% నుండి 20% మున్సిపల్ ఏరియాలో ఎన్ని శాతం నుంచి 10 శాతం ఒక్కొక్క కార్మికుడికి 5000 నుంచి 9000 వరకు లాభం చేకొరుతుంది. ఇలా కార్మికునికి కలిగే లాభం నుంచి బ్యాంకు ఈఎంఐ లోను కట్టుకోవచ్చు కార్మికులకు భారం కూడా కాదు

**రాష్ట్ర ప్రభుత్వానికి ఎలా ప్రయోజనం:**
కోల్బెల్టులోనే మున్సిపాలిటీలకు నిధుల కొరత తీరుతుంది కార్మికునికి సొంత ఇంటి పథకం వాగ్దానంతో పాటు మీద ఇన్కమ్ టాక్స్ వాగ్దానాన్ని కూడా నెరవేర్చినట్లు అవుతుంది కార్మికులు నివాసం అంటే ప్రాంతాలు అభివృద్ధికి తోడ్పడతాయి బహుళ రకాల ప్రయోజనాలు ఉన్న ఈ స్కీమును అమలు చేయటం కొరకు రాష్ట్ర ప్రభుత్వము మరియు సింగరేణి యాజమాన్యం ముందుకు రావాలని కోరుతున్నాము అలాగే ఈ స్కీము అమలు కొరకు కార్మికులంతా ఐక్యంగా పోరాటానికి ముందుకు రావాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు పిలుపునిస్తున్నది, ఈ కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, తోట నరహరి రావు, జేల్లా గజేంద్ర, దాసరి సురేష్, కోలేటి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# బ్రూక్ మెరుపు ఇన్నింగ్స్

## సూపర్ 8కు ఇంగ్లండ్




మాజీ చాంపియన్ ఇంగ్లండ్ టీ20 వరల్డ్ కప్ సూపర్ 8లో అడుగుపెట్టింది. శనివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో నమీబియాపై బట్లర్ సేన సూపర్ విక్టరీ కొట్టింది. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 41 పరుగులతో ఇంగ్లండ్ గెలుపొందింది. మెరుపు ఇన్నింగ్స్ ఆడిన హ్యారీ బ్రూక్(47 నాటౌట్) 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో స్కాట్లాండ్ ఓడడంతో ఇంగ్లండ్‌కు సూపర్ 8 బెర్తు దక్కింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ మెగా టోర్నీని ఓటమితో ఆరంభించింది. ఆస్ట్రేలియా చేతిలో ఓటమి.. స్కాట్లాండ్‌తో మ్యాచ్ రద్దు కారణంగా బట్లర్ బ్యాచ్ గ్రూప్ 'బి' నుంచి ఎలిమినేట్ అవడం ఖాయం అనిపించింది. అయితే పసికూన ఒమన్‌పై బౌలర్ల విజృంభణతో రికార్డు విజయంతో ఇంగ్లండ్ సూపర్ 8 రేసులోకి వచ్చింది.

### 10 ఓవర్ల మ్యాచ్‌లో..

ఇక గెలవక తప్పని మ్యాచ్‌లో నమీబియాపై ఇంగ్లండ్ దుమ్మురేపింది. 10 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో చాంపియన్ ఆటతో ప్రత్యర్థిని మట్టికరిపించింది. హ్యారీ బ్రూక్(41 నాటౌట్), జానీ బెయిర్‌స్టో సుడిగాలిలా చెలరేగారు. దాంతో, ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 122 రన్స్ చేయగలిగింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నమీబియా దీటుగా బదులిచ్చింది. ఓపెనర్లు మైఖేల్ వాన్ లింగెన్(33), నికోలాస్ డవిన్(18)లు శుభారంభమివ్వగా.. డేవిడ్ వీస్(27) చితక్కొట్టాడు. కానీ, చివర్లో ఇంగ్లండ్ బౌలర్లు కట్టడి చేయడంతో నమీబియా 84 రన్స్ చేసిందంతే. దాంతో, ఇంగ్లండ్ 41 పరుగుల తేడాతో గెలుపొందింది. అయినా స్కాట్లాండ్, ఆస్ట్రేలియా మ్యాచ్ ఫలితం తేలితేగానీ సూపర్ 8కు వెళ్తామా? లేదా? అని బట్లర్ సేన కంగారు పడింది. అయితే.. ఆసీస్ జట్టు ఇంగ్లండ్‌కు మేలు చేస్తూ స్కాట్లాండ్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించింది.

# తటస్థ హెూదాతో ఆడొచ్చు

## రష్యా, బెలారస్ అథ్లెట్లకు ఊరట



రష్యా, బెలారస్ క్రీడాకారులకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) శుభవార్త చెప్పింది. వచ్చే నెల నుంచి పారిస్ వేదికగా జరగాల్సి ఉన్న ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు గాను పై రెండు దేశాలకు చెందిన పలువురు ఆటగాళ్లకు 'తటస్థ హెూదా'ను అందించింది. రష్యా నుంచి 14 మంది, బెలారస్ నుంచి 11 మంది అథ్లెట్లు తమ దేశాల జాతీయ జెండా, గీతం, రంగులు లేకుండా తటస్థ హెూదాలో ఈ క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించింది. సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, తైక్వాండో, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్ విభాగాల్లో బరిలోకి దిగబోయే ఆటగాళ్ల పేర్లను విడుదల చేసింది.. బృందాలుగా (టీమ్ ఈవెంట్స్) ఆడే క్రీడల నుంచి రష్యా, బెలారస్ ఆటగాళ్లపై నిషే ధం కొనసాగుతోంది. రెండేండ్లుగా ఉక్రెయిన్ తో యుద్ధం కారణంగా ఈ రెండు దేశాలపై ఐ వోసీ నిషేధం విధించిన విషయం తెలిసిందే.

# 'హ్యాపీ ఫాదర్స్ డే'.. కోహ్లీ గారాలపట్టీ పెయింటింగ్




భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకు గారాల కూతురు వామిక 'ఫాదర్స్ డే' శుభాకాంక్షలు తెలిపింది. ఆర్ట్ వర్క్ ద్వారా వామిక తండ్రి విరాట్‌పై తన ప్రేమను తెలియజేసింది. ఆ బొమ్మను అనుష్కా శర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టింది. ఆ పోస్ట్‌కు 'ఒకే వ్యక్తి పలు విషయాల్లో ఉత్తమంగా ఎలా ఉండగలడు. ఇది ఆశ్చర్యకరం. వీ లవ్ యూ విరాట్ కోహ్లీ' అని ఆమె క్యాప్షన్ రాసింది. వామికా గీసిన ఆ బొమ్మలో రెండు పాద ముద్రలు ఉన్నాయి. ఒకటి ఆమెది కాగా.. మరొకటి కోహ్లీది. అంతేకాదు దానిపై 'హ్యాపీ ఫాదర్స్ డే' అని రాసి ఉంది. ఈ స్పెషల్ పోస్ట్ చూసిన కోహ్లీ వామికా ఆర్ట్ వర్క్‌కు ఫిదా అవుతున్నారు.

# దంచేసిన హెడ్, స్టోయినిస్..!

- స్కాట్లాండ్ ఔట్
- టీ20 వరల్డ్ కప్‌లో సూపర్ 8కు చేరిన ఆస్ట్రేలియా



చివరి లీగ్ మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. సంచలనాలకు తావివ్వకుండా స్కాట్లాండ్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారీ ఛేదనలో ఓపెనర్ ట్రావిస్ హెడ్(68), ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్(59)లు అర్ధ శతకాలతో స్కాటిష్ బౌలర్లను ఉతికారేశారు. వీళ్లిద్దరూ దంచేయడంతో మిచెల్ మార్ష్ సేన మరో రెండు బంతులు ఉండగానే జయకేతనం ఎగురవేసింది. ఈ విక్టరీతో మెగా టోర్నీ రెండో రౌండ్‌కు ముందు కంగారు జట్టు కొండంత ఆత్మవిశ్వాసాన్ని పోగు చేసుకుంది. సూపర్ 8 బెర్తును నిర్ణయించే మ్యాచ్ కావడంతో స్కాట్లాండ్ బ్యాటర్లు శివమెత్తారు. ఓపెనర్ మున్సే(35) రాణించగా. ఆ తర్వాత బ్రాండన్ మెక్‌కల్లమ్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 34 బంతుల్లోనే 6 సిక్సర్లు, 2 ఫోర్లతో 60 రన్స్ బాదేశాడు. అతడిచ్చిన ఊపుతో కెప్టెన్ బెర్రింగ్‌టన్(42), వికెట్ కీపర్ మాథ్యూ క్రాస్(18)లు ఆఖర్లో దంచేశారు. దాంతో స్కాట్లాండ్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 రన్స్ కొట్టింది. ఆసీస్ బౌలర్లలో మ్యాక్స్‌వెల్ రెండు వికెట్లు పడగొట్టాడు.

### టాపార్డర్ వైఫల్యం

2 పరుగుల వద్దే ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్(1) ఔటయ్యాడు. ఆ షాక్ నుంచి తేరుకునే లోపే మిచెల్ మార్ష్(8), విధ్వంసక ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్(11)లు పెవిలియన్ చేరారు. 60 పరుగులకే 3 వికెట్లు పడిన దశలో హెడ్(60), స్టోయినిస్(59)లు ఇన్నింగ్స్ నిలబెట్టారు.

# శతక్కొట్టిన మంధాన..!

## తొలి వన్డేలో టీమిండియా జయభేరి



సొంతగడ్డపై భారత మహిళల జట్టు గర్జించింది. ఏకపక్షంగా సాగిన తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై జయభేరి మోగించింది. తొలి వన్డేలో ఓపెనర్ స్మృతి మంధాన(117) సూపర్ సెంచరీతో కదం తొక్కగా.. స్పిన్నర్ ఆశా శోభన(4/21) తిప్పేసింది. భారీ ఛేదనలో మిగతా బౌలర్లు తలొక చేయి వేయడంతో ప్రత్యర్థిని 122 పరుగులకే కట్టడి చేసింది. దాంతో, చిన్నస్వామి స్టేడియంలో సఫారీలపై టీమిండియా 143 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది. ఈ విజయంతో హర్మన్‌ప్రీత్ సేన మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

# సాకర్ పండుగలో గోల్స్ వర్షం..!

## 48 ఏండ్లలో ఇదే తొలిసారి

జర్మనీ ఆతిథ్యమిస్తున్న సాకర్ పండుగ యూరో చాంపియన్‌షిప్‌లో గోల్స్ వర్షం కురుస్తోంది. టోర్నీ ఆరంభమైన రెండు రోజులకే రికార్డు స్థాయిలో బంతి గోల్ పోస్టులోకి దూసుకెళ్లింది. నాలుగు మ్యాచుల్లోనే ఏకంగా 16 గోల్స్ నమోదయ్యాయి. దాంతో, మెగా టోర్నీ 48 ఏండ్ల చరిత్రలో అత్యధిక గోల్స్ రికార్డు కావడం ఇదే తొలిసారి. 1976 యూరో చాంపియన్‌షిప్స్ తర్వాత తొలి నాలుగు మ్యాచుల్లోనే ఆటగాళ్లు డజన్నర గోల్స్ కొట్టేయడం ఓ పెద్ద సంచలనమే. యూరో చాంపియన్‌షిప్ టోర్నీ ఆరంభ పోరులోనే జర్మనీ 5 గోల్స్ కొట్టింది. ప్రత్యర్థి స్కాట్లాండ్‌ను ఒక్క గోల్‌కే పరిమితం చేసి అదిరే బోణీ కొట్టింది. ఆ తర్వాత స్విట్జర్‌లాండ్ 3-1తో హంగేరిని చిత్తు చేసింది. ఇక సమఉజ్జీల సమరంగా భావించిన పోరులో స్పెయిన్ మూడు గోల్స్‌తో క్రొయేషియాను మట్టికరిపించింది.



### టోర్నీలో యంగ్‌స్టర్

ఈ మెగా టోర్నీలో స్పెయిన్ టీనేజర్ లమినె యమల్ అరుదైన ఘనత సాధించాడు. యూరో కప్‌లో ఆడిన అతి పిన్నవయస్కుడిగా లమినె రికార్డు సృష్టించాడు. 16 ఏండ్ల 338 రోజుల వయసులో అతడు క్రొయేషియాపై ఆడి రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. అంతేకాదు బార్సిలోనా క్లబ్‌కు ఆడిన చిన్న వయసు ఫుట్‌బాలర్‌గా లమినే గుర్తింపు సాధించాడు.

### మెరుపు గోల్ అతడిదే

యూరో చాంపియన్‌షిప్‌లో అల్బేనియా ఆటగాడు మెరుపు గోల్ చేశాడు. టోర్నీ చరిత్రలోనే వేగవంతమైన గోల్‌తో రికార్డు సృష్టించాడు. ఇటలీపై నెడిమ్ బజ్‌రామి కేవలం 23 సెకన్లలోనే బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. కానీ, ఈ మ్యాచ్‌లో ఇటలీ 2-1తో గెలుపొందింది.

# పంతం నెగ్గించుకున్న గంభీర్




### టీమిండియా కోచ్‌గా అప్పుడే..?

భారత పురుషుల జట్టు హెడ్ కోచ్ పదవిని చేపట్టేది ఎవరు? ఈ ప్రశ్నకు త్వరలోనే ఎండ్ కార్డ్ పడనుంది. టీమిండియా ప్రధాన కోచ్‌గా మాజీ క్రికెటర్ గౌతం గంభీర్ నియామకం ఖరారైపోయింది. ఐపీఎల్‌లో మెంటార్‌గా విజయవంతమైన గంభీర్ ప్రస్తావించిన అన్ని షరతులకు భారత క్రికెట్ బోర్డు పచ్చ జెండా ఊపేసింది. దాంతో, ఇక గౌతీ పేరును బీసీసీఐ అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. ఇంతకు గౌతీ కండీషన్స్ ఎంటో తెలుసా..? హెడ్‌కోచ్‌గా తాను ఉండాలంటే.. తనకు నచ్చిన సహాయక సిబ్బందిని తెచ్చుకునేందుకు అనుమతించాలని గంభీర్ పట్టు పట్టాడు. దాంతో, కాస్త తటపటాయించిన బీసీసీఐ పెద్దలు చివరకు అన్ని షరతులకు అంగీకరించారని సమాచారం. 'భారత జట్టు కోచ్‌గా ఉండాలని గంభీర్‌తో చర్చలు జరిపాం. టీ20 వరల్డ్ కప్ తర్వాత రాహుల్ ద్రవిడ్ స్థానాన్ని గంభీర్ భర్తీ చేస్తాడు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ మధ్యే ఒక ఇంటర్వ్యూలో గౌతీ సైతం టీమిండియా హెడ్‌కోచ్ పోస్ట్‌పై స్పందించాడు. 'జాతీయ జట్టుకు కోచ్‌గా ఉండడం కన్నా గొప్ప గౌరవం మరొకటి లేదు. భారత్‌కు కోచ్‌గా ఉండడాన్ని నేను ఇష్టపడుతాను. విశ్వ వేదికలపై 140 కోట్ల మంది భారతీయులు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు నేను ప్రతినిధిగా ఉంటాను' అని గంభీర్ వెల్లడించాడు.

### రెండుసార్లు చాంపియన్‌గా

ప్రస్తుతం గంభీర్ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆటగాడిగా గొప్ప రికార్డు ఉన్న గౌతీ.. భారత జట్టు రెండు ఐసీసీ ట్రోఫీ(2007 టీ20 వరల్డ్ కప్, 2011 వన్డే వరల్డ్ కప్)లు గెలిచిన జట్టులో సభ్యుడు. అంతేకాదు ఐపీఎల్‌లో ఏడు సీజన్లు కోల్‌కతా కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతడి సారథ్యంలో కేకేఆర్ రెండుసార్లు (2012, 2014) చాంపియన్‌గా నిలిచింది. అయితే.. మెంటార్ హిట్ కొట్టిన గంభీర్‌కు కోచ్‌గా ఏమాత్రం అనుభవం లేదు. అయినా సరే ముక్కుసూటి తత్వం, కఠిన నిర్ణయాలు తీసుకొనే నైజం గల అతడు భారత జట్టులో విజయ కాంక్షను రగిలిస్తాడని బీసీసీఐ భావిస్తోంది.

### ఆ ఇద్దరు వద్దనడంతో..

ప్రస్తుతం కోచ్‌గా సేవలందిస్తున్న రాహుల్ ద్రవిడ్ పదవీ కాలం టీ20 వరల్డ్ కప్‌తో ముగియనుంది. దాంతో, ఆలోపే కొత్త కోచ్ నియామక ప్రక్రియను చేపట్టాలని బీసీసీఐ భావించింది. తొలుత మాజీ కోచ్ రవిశాస్త్రి, వీవీఎస్ లక్ష్మణ్‌లు రేసులో ఉంటారనే వార్తలు వినిపించాయి. కానీ, వాళ్లు సంసిద్ధంగా లేకపోవడంతో జై షా బృందం గంభీర్‌ను ఆశ్రయించిన విషయం తెలిసిందే.

# భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలి

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**



భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే రోజుల్లో ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది ని ఆదేశించారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్న పేట లోని డంపింగ్ యార్డ్ ను మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ తో కలిసి పరిశీలించారు. మహబూబ్ నగర్ పట్టణంలో నుంచి ప్రతిరోజు వచ్చే సుమారు 100 టన్నుల వరకు చెత్త వస్తుందని మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ వజ్ర కుమార్ రెడ్డి ఎమ్మెల్యేకు తెలిపారు. పట్టణంలో 50 ఆటోలు ,19 ట్రాక్టర్‌లు, రెండు డిసియంల ద్వారా చెత్తను గృహ వినియోగదారుల నుంచి సేకరించడం జరుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం రాంకీ సంస్థ ప్లాస్టిక్ బాటిల్స్ రీ సైక్లింగ్ చేసే యూనిట్ ను ఆయన పరిశీలించారు. గత పదిహేను రోజులుగా ఈ రీ సైక్లింగ్ యూనిట్ పనిచేయడం లేదని అక్కడ సిబ్బంది ఎమ్మెల్యేకు తెలిపారు. సేకరించిన చెత్తను బయో మైనింగ్ చేసి ఉపయోగిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే చెప్పగా, గతంలో బయో మైనింగ్ మిషన్ ఉండేదని, దాన్ని బాడుగకు తెచ్చి వాడుకొనే వారిమని, జెసిబి కూడా డంపింగ్ యార్డ్‌లో అవసరమే అని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు సేవ చేస్తున్నప్పుడు ఖర్చుల గురించి ఆలోచన చేయవలసిన అవసరం లేదని, డంపింగ్ యార్డ్‌కు జెసిబిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, బెజ్జుగం రాఘవేందర్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ వజ్ర కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినిలు ఇష్టంగా కష్టపడి చదువాలి

## కస్తూరిబా బాలికా విద్యాలయం(మైనార్టీ) సందర్శించిన జిల్లా కలెక్టర్ బి.విజయేందిర

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**



విద్యార్థినిలు ఇష్టంగా కష్టపడి చదవాలని, అప్పుడే ఉన్నత విద్య నభ్యసించి ఆసక్తి ఉన్న రంగంలో జీవితంలో స్తిరపడతారని జిల్లా కలెక్టర్ బి.విజయేందిర అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ పట్టణం యెనుగొండలోని కస్తూర్భా గాంధీ బాలికా విద్యాలయం(మైనార్టీ బాలికలు), కెజిబివి మహబూబ్ నగర్ అర్బన్ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ బి.విజయేందిర సందర్శించారు. కళాశాలలో విద్యార్థినుల సంఖ్య, ప్రస్తుతం అడ్మిషన్‌ల గురించి, పరీక్షలలో ఫలితాలు గురించి స్పెషల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. మొదటి, రెండవ సంవత్సరం కలిపి 160 సీట్లకు గాను 80 మంది ఉన్నారని, మొదటి సంవత్సరం లో అడ్మిషన్ లు జరుగుతున్నట్లు తెలిపారు. కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న ఎంపిసి, బైపిసి తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో జిల్లా కలెక్టర్ సంభాషించారు. మొదటి సంవత్సరంలో సాధించిన మార్కులు, భవిష్యత్తులో మీరు ఏమి కావాలనుకుంటున్నారని విద్యార్థినిలను ఆమె అడిగారు. పలువురు విద్యార్థినిలు ఐఏఎస్, ఐపిఎస్, బ్యాంకింగ్, సాఫ్ట్ వేర్, లెక్చరర్ తదితర ఉద్యోగాల్లో స్థిరపడాలని చదువుతున్నట్లు తెలిపారు. కష్టపడి చదివితేనే తాము ఎంపిక చేసుకున్న వృత్తి, ఉద్యోగంలో బాగా స్థిరపడ వచ్చుని, జీవితంలో ఎవ్వరిపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడాలని కలెక్టర్ సూచించారు. చదువు తో పాటు లైఫ్ స్కిల్స్ ఆత్మ రక్షణ, కంప్యూటర్ బేసిక్స్, టైపింగ్, డ్రైవింగ్ లాంటి నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. తమ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని, పోషక ఆహారం తీసుకోవాలని అన్నారు .కళాశాల ఆవరణలో విద్యార్థినిలు ఆటలు ఆడుకునే విధంగా పరిశుభ్రం చేయాలని అన్నారు. పక్కనే ఉన్న కెజిబివి (మైనార్టీ బాలికలు) ను సందర్శించి 10వ తరగతి విద్యార్థినిలతో మాట్లాడారు. బాగా చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం వంట గదిని పరిశీలించి ఆహారం మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ శంకరమ్మ, అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.



# గోవధను సంపూర్ణంగా అరికట్టాలి

**కోహీర్ జూన్ 16 (జనం సాక్షి)**

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గోవధ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు పోలీస్ లకు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఆదివారం కోహీర్ పోలీస్ స్టేషన్ లో వినతిపత్రం సమర్పించారు. హైకోర్టు అదేశాను సారం గోవధ చట్టాన్ని సంపూర్ణంగా అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందువులు ఆరాధ్య దైవంగా భావించే గోమాతను కుర్బానీ పేరుతో వధించ రాదన్నారు. బక్రీద్ సందర్బంగా ఎక్కడ గోవధ జరిగినా సమాచారం ఇవ్వాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వైద్యనాథ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కిష్టన్న సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ సతీష్, మండల ప్రధానకార్యదర్శి నర్సిములు, ఉపాధ్యక్షులు రమేష్, నరేష్ కోశాధికారి చంద్రశేఖర్, కోహీర్ టౌన్ ప్రెసిడెంట్ సంతోష్, నాయకులు మల్లేష్ వంశీవర్ధన్ రెడ్డి, గోపాల్, ప్రశాంత్, శ్రీనివాస్, మల్లేష్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
17 జూన్ 2024

# కరెంటుపై గ్రామసభలు

- మాజీ విద్యుత్తు మంత్రి జగదీష్ రెడ్డి అసెంబ్లీలో కోరిన మేరకే న్యాయ విచారణ
- విచారణకు హాజరు కాకపోతే న్యాయవ్యవస్థ చూసుకుంటుంది
- కక్ష సాధింపు అంటే అవగాహన రాహిత్యమే
- రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం
- ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం, జూన్ 16 (జనంసాక్షి) :** విద్యుత్ సమస్య వచ్చినప్పుడు అధికారులు అందుబాటులో లేరని రాష్ట్రంలో కొన్నిచోట్ల వింటున్నాం.. వీటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయించినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమల్లు అన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ రాష్ట్రంలో ఎవరికి, ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ సమస్య ఎదురైనప్పుడు 1912 నెంబర్ కు ఉచితంగా ఫోన్ చేయవచ్చు అని తెలిపారు. కాల్ సెంటర్ కు ఫిర్యాదు అందిన వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఫిర్యాదులు అన్ని ఆన్‌లైన్‌లో రికార్డు అయి ఉంటాయని వివరించారు. ఎవరికైనా ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు 108 అంబులెన్స్ కు ఏ విధంగా అయితే ఫోన్ చేస్తారో, విద్యుత్ సమస్య వచ్చినప్పుడు 1912 ఫోన్ చేయాలని డిప్యూటీ సీఎం కోరారు. విద్యుత్ రంగ పరిస్థితిపై మా ప్రభుత్వం ఏర్పడగానే అసెంబ్లీలో వాస్తవ పరిస్థితులను శ్వేత పత్రం ద్వారా చర్చకు పెట్టామని సభలోని సభ్యులంతా విద్యుత్ అంశంపై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి నష్టం జరిగిందని కొందరు సభ్యులు తెలిపారు. సభలో పాల్గొన్న మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి లేచి విద్యుత్తు కొనుగోలు అంశంపై న్యాయవిచారణ జరపాలని పదే.. పదే కోరారు. వెంటనే సభా నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి పారదర్శకత ఉండేందుకు న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయాలన్నీ అసెంబ్లీలో రికార్డు అయి ఉన్నాయి, ఎవరైనా వెళ్లి చూసుకోవచ్చు అని తెలిపారు. కక్ష సాధింపు ధోరణితో జ్యుడీషియల్ ఎంక్వయిరీ చేస్తున్నారని ఎవరైనా మాట్లాడితే వారిది అవగాహన రాహిత్యంగా భావిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. న్యాయవిచారణ జరగాలని నాటి విద్యుత్ శాఖ మంత్రి కోరగా, ఆ పార్టీ నేతలే కక్ష సాధింపు ధోరణి అంటున్నారు.. వారి వారికే కక్ష సాధింపులు ఉన్నాయేమో, ఎవరికి తెలుసని డిప్యూటీ సీఎం అన్నారు. ఇందిరా గాంధీ లాంటి మహానేతలే విచారణ కమిషన్ల ముందు హాజరయ్యారని గుర్తు చేశారు. జ్యుడిషియల్ విచారణకు రామని ఎవరైనా అంటే వారి గురించి న్యాయవ్యవస్థ చూసుకుంటుందని తెలిపారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అనుభవం కలిగిన వారు అని తెలిపారు. విచారణకు హాజరుకాము, నేను చెప్పిందే వేదం, శాసనం అంటే వారికి న్యాయవ్యవస్థ పై నమ్మకం లేదని భావిస్తున్నట్టు తెలిపారు. విచారణకు ఆదేశించడం వరకే ప్రభుత్వం పని ఆ తర్వాత విచారణకు మాకు ఎలాంటి సంబంధం ఉండదు ఎలా విచారిస్తారు, ఎవరెవరిని పిలుస్తారు మాకు తెలియదని డిప్యూటీ సీఎం అన్నారు.

గత 10 సంవత్సరాల పాటు రాష్ట్రంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జమాబంధీ లేదు. కొద్దిమంది పెద్దలకు ప్రయోజనం చేకూర్చేందుకు ధరణి అనే పోర్టల్ ను తీసుకొచ్చారు. పార్ట్ – బి లో పెట్టినవి అపహరించేందుకు వేసులు బాటు కల్పించారు అని డిప్యూటీ సీఎం తెలిపారు. ధరణి సమస్యలపై నిర్ణయం తీసుకుంటామని గతంలోనే చెప్పాం, దానిపై కమిటీ కూడా వేసాం, ఆ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా అందరి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత అందరి అభిప్రాయాలను ప్రజల ముందు పెడతామని డిప్యూటీ సీఎం అన్నారు. దీనికి సంబంధించి సంపూర్ణంగా, పారదర్శకంగా ఉండేలా, ప్రజలకు జవాబుదారీగా ఉండేలా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామన్నారు.

# వ్యవసాయ శాఖ పేరును వ్యవసాయ – రైతు సంక్షేమ శాఖగా నామకరణం చేయాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి
- ఏ ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల చర్యలు తీసుకోవాలని సూచన



**హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యవసాయ శాఖ పేరును వ్యవసాయ – రైతు సంక్షేమ శాఖగా నామకరణం చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను కోరారు. రైతుల సంక్షేమం, అభ్యున్నతి కోసం కృషి చేసే వ్యవసాయ శాఖ పేరులో రైతు సంక్షేమం అనే పేరును కూడా జోడించాలని చిన్నారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా వ్యవసాయ – రైతు సంక్షేమ శాఖగా పిలిచేవారని, అయితే టిఆర్ఎస్ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ శాఖగా మాత్రమే మార్చారని, రైతు సంక్షేమం పేరు తొలగించారని చిన్నారెడ్డి గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ – రైతు సంక్షేమం శాఖగా అమలు చేస్తున్నారని చిన్నారెడ్డి తెలిపారు. రైతు సంక్షేమం కోసం కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే వ్యవసాయ – రైతు సంక్షేమ శాఖగా నామకరణం చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొందని, అందులో భాగంగానే వ్యవసాయ – రైతు సంక్షేమ శాఖగా నామకరణం చేయాలని చిన్నారెడ్డి కోరారు. వ్యవసాయ – రైతు సంక్షేమ శాఖగా నామకరణం చేస్తే రైతులకు ఈ శాఖ తమ కోసం ఉన్నట్లుగా భావన కలుగుతుందని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ – రైతు సంక్షేమ శాఖగా నామకరణం చేయాలని చిన్నారెడ్డి కోరారు.

## ముఖ్యమంత్రి గారూ..

# బిల్లులు ఇప్పిస్తేనే మా బతుకు

- సీఎం రేవంత్‌కు తెలంగాణ రాష్ట్ర సివిల్ కాంట్రాక్టర్ల మొర
- పెండింగ్ బకాయిలు మంజూరు చేయాలని వేడుకోలు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి) :** 'ముఖ్యమంత్రి గారూ.. మీరు బిల్లులు ఇప్పిస్తేనే మా బతుకు కొనసాగుతుంది' అని తెలంగాణ రాష్ట్ర సివిల్ కాంట్రాక్టర్లు రేవంత్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. పెండింగ్ బకాయిలు ఇవ్వాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ కాంట్రాక్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని డిపార్టుమెంట్ల సివిల్ కాంట్రాక్టర్ల కు రావలసిన రెండు సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని వారు కరీంనగర్ ప్రెస్ భవన్‌లో విలేఖర్ల సమావేశంలో తెలిపారు. వారు మాట్లాడుతూ... కాంట్రాక్టర్ల ఆర్థిక పరిస్థితి భాగాలేనందున, ముందు ముందు కొత్త పనులు చేయలేని పరిస్థితి ఉన్నదని హైదరాబాద్ వెళ్ళి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటి సి.యం, (ఫైనాన్స్ డిపార్టుమెంట్) లను కలిసి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతామని తెలిపారు. అన్ని డిపార్టుమెంట్ల చీఫ్ ఇంజనీర్లను కలిసి ముందు ముందు పనులు చేయలేమని చెపుతూ వినతి పత్రము సమర్పిస్తామన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గత రెండు సంవత్సరముల నుండి దాదాపు 100 కోట్ల వరకు అన్ని డిపార్టుమెంట్లో రావాల్సిన పెండింగ్ బిల్లులు ఉన్నవని (ఆర్ అండ్ బీ, పిఆర్, కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో దాదాపు జనరల్ ఫండ్స్ 15 కోట్లు అన్ని స్కీమ్స్ పెండింగ్ బిల్లులు, సోషల్ వెల్ఫేర్, ఇన్స్టిట్యూట్ మొదలైన) మిగిత జిల్లాల్లో కూడా పెండింగ్ బిల్లులు ఇలాగే ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిలో భాగమైన మా కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి మా కాంట్రాక్టర్లను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దర్శనాల శంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల మోహన్, ప్రధాన కార్యదర్శి రూసెల్లి కిషన్ రావు, లీగల్ అడ్వైజర్ ప్యాట రమేష్ , చీఫ్ అడ్వజర్ కొప్పుల అజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ చిందం శ్రీనివాస్, ఓ.భిక్షపతి, జి.శివ కుమార్, కడే. శంకర్, హనుమాండ్ల ప్రభాకర్, గుద్దూరి. నర్సయ్య, ఓ.కుమార్ స్వామి, జి.కృష్ణారావు, ఇ. శివా రెడ్డి, సిహెచ్. రవీందర్ రెడ్డి, బి. ప్రకాష్ రావు, ఎస్. సునీల్ కుమార్, బి.శేఖర్, బద్దే. మదన్ మోహన్ రెడ్డి, దార్ సింగ్, జెగత్ పాల్ రెడ్డి, బద్దం హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కకు కలిసిన కలెక్టర్ దివాకర టీఎస్



**ములుగు బ్యూరో,జూన్16(జనం సాక్షి):** ములుగు జిల్లా నూతన కలెక్టర్ గా దివాకర టిఎస్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ములుగు జిల్లా కేంద్రం లోని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క క్యాంపు కార్యాలయం లో జిల్లా కలెక్టర్ మంత్రి కి పూల మొక్కను ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# విచారణకు హాజరు కాకుండా కమిషనే తప్పంటావా?

- కేసీఆర్‌పై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ధ్వజం

**హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి) :** విద్యుత్ విచారణ కమిషన్ ఎదుట మాజీ సిఎం కేసిఆర్ హాజరు కాకుండా, అసలు కమిషన్ కు విచారణ జరిపే అర్హత లేదంటూ విమర్శించడాన్ని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా తప్పు పట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, పవర్ ప్లాంట్ల ఏర్పాటు అంశాలపై కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు చేసిన కమిషన్ ముందు కేసీఆర్ హాజరై వివరణ ఇచ్చి ఉంటే ఆయనకే గౌరవంగా ఉండేదని, అసలు వివరణ ఇవ్వకుండా, విచారణ కమిషన్ నే విమర్శిస్తూ... లేఖ రాయడం విచారణ వ్యవస్థలను అగౌరవపరచడమే అని, పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసిఆర్ తీరు అప్రజాస్వామికమని మహేశ్వర్ రెడ్డి ఆక్షేపించారు. అసలు తన పాలనలో విద్యుత్ రంగంలో తప్పులే జరగకపోతే కమిషన్ ముందు హాజరై వివరాలు చెప్పడానికి కేసిఆర్ కు భయం ఎందుకని ప్రశ్నించారు. ఏకంగా విచారణ కమిషన్ నే తప్పుపడుతూ... మాజీ సిఎం కేసీఆర్ ఎదురుదాడి చేస్తుంటే...ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎందుకు స్పందించడం లేదనీ ప్రశ్నించారు. ప్రభుత్వం వేసిన కమిషన్ నే కెసిఆర్ తప్పు పడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావడం లేదన్నారు. విద్యుత్ రంగంలో అక్రమాలపై సీబీఐ విచారణతో అసలు వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మాజీ జడ్జీతో విచారణ కమిషన్ వేసిందో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు బయటకు రావాలంటే రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ కోరి తమ చిత్త శుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఇక ఈ విషయంలో మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి వాఖ్యలు సరికావన్నారు. కమిషన్, విచారణ వ్యవస్థలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తప్పులు జరగనప్పుడు వాస్తవాలు కమిషన్ ముందు చెప్పడానికి భయం ఎందుకని ప్రశ్నించారు. ఇక మెదక్ లో జరిగిన ఘటన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, పోలీసుల తీరు సరికాదని మహేశ్వర్ రెడ్డి అవేదన వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ప్రభుత్వ తీరు ఉందన్నారు. గోవధను అడ్డుకున్న వారిపై దాడులు చేయడం మంచిది కాదని, ఇంత జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్తున్న తమ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే రాజా సింగ్ ను, మమ్మల్ని అడ్డుకోవడం సరికాదని తెలిపారు. దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# కేసీఆర్‌ను కలిసిన ఉద్యమకారులు



**శామీర్‌పేట, జూన్ 16 (జనంసాక్షి) :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఉద్యమకారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ లోకేసీఆర్ ను ఉమ్మడి శామీర్ పేట మండలం లోని ఉద్యమకారులు కలిశారు. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా బీఆర్ఎస్ అధి నేత కేసీఆర్ ను ఉమ్మడి శామీర్ పేట మండలం లో ని ఉద్యమకారులు కలిసి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కెసిఆర్ బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చే వరకు నాయకులు కార్యకర్తలు శ్రమిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోవుల రవాణా నేపథ్యంలో ఘర్షణ

- పట్టణంలో 144 సెక్షన్



**మెదక్, జూన్ 16 (జనంసాక్షి) :** గోవధ చేసేం దుకు ఆవులను అక్రమంగా రవాణా చే స్తు న్నా ర నే ఆరోపణలపై శనివారం రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగడంతో, తెలంగాణ లోని మెదక్ జిల్లా రాందాస్ చౌరస్తా సమీపంలో 144 సెక్షన్ విధించినట్లు పోలీసులు తెలిపారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 144, ఒక ప్రాంతంలో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడడాన్ని నిషేధిస్తుంది. సాధారణంగా హింస, అల్లర్లకు దారితీసే ఎలాంటి నిరసనలను నివారించడానికి అమలు చేయబడుతుంది. పోలీసులు ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించారని, ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని మెదక్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి బాల స్వామి తెలిపారు.

# సూడో నక్సలైట్ల ముఠా అరెస్ట్

**నల్గొండ, జూన్ 16 (జనంసాక్షి)**




నల్గొండ జిల్లాలో సూడో నక్సలైట్ల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ చందన దీప్తి తెలిపారు. ఆదివారం ఎస్పీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం గణపురానికి చెందిన తోటకూరి శేఖర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం మదిపల్లికి చెందిన మాచర్ల శ్రీనివాస్, గుంటుక రమేష్, కే సముద్రానికి చెందిన మారెపాక లక్ష్మీనారాయణలను అరెస్టు చేసినట్టు తెలిపారు. గత నెల 28న ఘనపురం గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి గుడిని శుభ్రం చేయడానికి వెళ్లిన తోటకూరి పెద్ద వెంకటయ్యకు గుడిలో ఓ వైపు మూలకు 3 తుపాకులు కన్పించాయి. వెంకటయ్య వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచనామా నిర్వహించి తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా విచారిస్తున్న క్రమంలో కొందరు సాక్షలను బట్టి ఘనపురం గ్రామానికి చెందిన తోటకూరి శేఖర్ ఈ తుపాకులను దాచాడనే అనుమానంతో అతని గురించి గాలిస్తుండగా ఆదివారం అంగడిపేటలో పట్టుబడ్డాడు. అతన్ని విచారించగా అతను గతంలో అక్రమంగా తుపాకులను కలిగి ఉన్నాడని, హాలియా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, జైలుకు కూడా వెళ్లాడని ఎస్పీ తెలిపారు. ఇతనికి మిర్యాలగూడ జైలులో రమేష్‌తో పరిచయం ఏర్పడి వాళ్లు బయటికి వచ్చిన తర్వాత ఎలాగైన తొందరగా జీవితంలో స్థిరపడాలన్న ఉద్దేశంతో రమేష్‌కు తెలిసిన మహబూబాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌లు కలిసి సూడో నక్సలైట్లుగా మారి, తుపాకులను ధరించి ధనవంతులను, మైనింగ్ వ్యాపారులను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను, రోడ్డుపై వెళ్లే వాహనాలను ఆపి తుపాకులు చూపించి భయభ్రాంతులకు గురి చేసి డబ్బులు వసూలు చేసే వారని తెలిపారు.

తుపాకులను జీకే వీధి సాపర్ల, విశాఖపట్నం దగ్గరలో కొనుగోలు చేశారని, ఆ తుపాకులను కొన్ని రోజులు శేఖర్ తన ఇంట్లో ఉంచుకుని ఎవరైన చూస్తారని భయపడి ఘణపురం గ్రామచివరన జనసంచారం లేని పెద్దమ్మ తల్లి గుడిలో భద్రపరిచారని తెలిపారు. ఈ తుపాకులు పెద్దగా ఉన్నాయని భావించి వాటితోపాటు పిస్టల్ లాంటి చిన్న తుపాకులు ఉంటే కనపడకుండా పట్టుకెళ్లవచ్చని, ఆ పిస్టల్ కొనుగోలు కోసం అన్వేషిస్తున్న క్రమంలో అంగడిపేటలో శేఖర్ పట్టుబడ్డాడని, అతను ఇచ్చిన సమాచారంతో మిగితా వారిని హైదరాబాద్‌లో పట్టుకుని వీరిపై క్రైం నెం. 77/2024 యూ/ఎస్ సెక్షన్ 25 ఆర్మ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి అక్రమ ఆయుధాలు కలిగి ఉండటం నేరమని, ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసును చేధించేందుకు దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేఇసన ప్రత్యేక బృందమైనా కొండమల్లేపల్లి సీఐ కె.ధనుంజయ్, గుడిపల్లి ఎస్ఐ డి.నర్సింహులు, సిబ్బంది హేమూనాయక్, సత్యనారాయణ, హట్టి నాయక్, కొండల్, భాస్కర్, మహేష్, గురువారెడ్డి, లాలూనాయక్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## వైఎస్ జగన్ ఇంటి నిర్మాణాల కూల్చివేతపై

# ఆమ్రపాలి సీరియస్

- జోనల్ కమిషనర్ సస్పెన్షన్



**హైదరాబాద్, జూన్ 16 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని వైఎస్ జగన్ ఇంటి ముందున్న అక్రమ నిర్మాణాల కూల్చివేత అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జగన్ ఇంటి ముందు అక్రమంగా సెక్యూరిటీ పోస్టు నిర్మించారని ఫిర్యాదులు అందటంతో జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. దీనిపై జీహెచ్ఎంసీ ఇంఛార్జ్ కమిషనర్ ఆమ్రపాలి సీరియస్ అయ్యారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ మీద బదిలీ వేటు వేశారు. ఆ బాధ్యతల నుంచి తొలగిస్తూ ఆదేశాలిచ్చారు. హైదరాబాద్ నగరంలోని అక్రమ కట్టడాలపై జీహెచ్ఎంసీ అధికారులు దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టిన నిర్మాణాలను కూల్చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే.. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఉన్న ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నివాసం ముందు ఉన్న అక్రమ కట్టడాలను కూడా అధికారులు కూల్చేశారు. ఈ కూల్చివేత అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారటంతో.. ఉన్నతాధికారులు ఎంట్రీ ఇచ్చారు. వైఎస్ జగన్ ఇంటి ముందు ఉన్న నిర్మాణాల కూల్చివేతపై జీహెచ్ఎంసీ ఇంఛార్జ్ కమిషనర్ ఆమ్రపాలి సీరియస్ అయినట్టు సమాచారం.పక్క రాష్ట్ర మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత అయిన జగన్ ఇంటికి సంబంధించిన నిర్మాణాల కూల్చివేతపై ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవటంపై ఆమ్రపాలి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఓ మంత్రి ఆదేశాలతోనే.. జీహెచ్ఎంసీ అధికారులు ఈ కూల్చివేతలు చేసినట్టు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడేపై ఆమ్రపాలి చర్యలకు ఉపక్రమించారు. హేమంత్ బోర్కడేపై బదిలీ వేటు వేయగా.. జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బాధ్యతల నుంచి తొలగిస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370